
జ్యోతి

సుచిత్ర మాసపత్రిక
జనవరి '66
75 పైసలు



Venkateswara Rao




ప్రవృద్ధి ప్రమోషనులకు తగిన అర్హులే వారు, హెర్క్యులిస్ దాని స్వంతదారుడుకూడా ఇన్ని సంవత్సరాలు శ్రమకోర్చి పనిచేసినందుకు. మీరు హెర్క్యులిస్ కొన్నారంటే అది మీ నిత్యజీవితపు భాగస్వామి అయిపోతుంది. ఏళ్లు గడిచిపోతూన్న కొద్దీ జీవితంలో పరిస్థితులు మారిపోతాయి... ఉద్యోగంలో అభివృద్ధులు లభిస్తాయి...మీ పిల్లలు పెరిగి పెద్దవారౌతారు పెళ్లిచేసుకొని వేరేచోట కాపురం పెడతారు. కాని మీ హెర్క్యులిస్ ఎప్పుడూ మీదగ్గరే మంచి పరిస్థితులలోనే ఉంటుంది.

హెర్క్యులిస్

సైకిల్ కంటె ఎక్కువైనది—
జీవితకాలపు నేస్తము

టి. ఐ. సైకిల్స్ ఆఫ్ ఇండియా, అంబత్తూరు,
మద్రాసు-53
ప్రొప్రైటర్లు: ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, మద్రాసు-1.

JWT/TIC/H/2953





తొలిమాట

జ్యోతికి మూడేళ్ళు వెళ్ళి నాలుగో యేడు వచ్చింది.

జ్యోతి వికాసానికి పాఠకుల ఆదరం, అభిమానుల అండదండలు ముఖ్యకారణం కాగా,

ఇదే బలంతో జ్యోతి సంస్థ ఇక మూడు పువ్వులు, ఆరుకాయలుగా వర్ధిల్లే శుభసమయం కూడా త్వరలోనే రానున్నది.

• • •


ఈ చతుర్థ జన్మదినోత్సవ సందర్భంలో జ్యోతిని మరింత ఆకర్షణీయంగా వెలువరించడానికి మేము ప్రారంభించిన ప్రయత్నాలు ఈ సంచికలో మీరు చూడవచ్చు. వచ్చే సంచికలో మరిన్ని అందచందాలను అందివ్వడానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తాము.

ఈ సంచికలో ఒక ముఖ్యాకర్షణ సుప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి ముప్పాళ రంగనాయకమ్మగారి సీరియల్ "చదువుకున్న కమల".

శ్రీయుతులు అవసరాల రామకృష్ణారావు, భమిడిపాటి రామగోపాలంగార్ల కథలు కూడా ప్రత్యేకాకర్షణల క్రిందకే వస్తాయి.

• • •

నూతన సంవత్సరాదికి మా పాఠకులకు, ఏజెంట్లకు, ఇతర అభిమానులకు మా శుభాకాంక్షలు.



సుచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట పోస్టు
విజయవాడ—2.

విడిప్రతి వెల
75 పైసలు

ఏడాది చందా
9 రూపాయలు

సంపుటి 4
జనవరి 1966
సంచిక 1

మేనేజింగ్ ఎడిటర్
వి. వి. రాఘవయ్య

ఆర్ట్ ఎడిటర్
బాపు

సంపాదకవర్గం
నండూరి
రామమోహనరావు
ముళ్ళపూడి
వెంకట రమణ
వి. ఎ. కె. రంగారావు
రావి కొండలరావు

ముఖచిత్రం :
రవీంద్ర ఆర్ట్ పిక్చర్స్
"జమీందార్"లో దృశ్యాలు




మీ కుటుంబం మొత్తానికి బలాన్ని, పుష్టిని చేకూర్చగల కొత్త వస్తువు పుష్టి. దీనితో వండిన ప్రతి సరుకు అతి రుచికరంగా వుంటుంది. ఏ రకమైన మిఠాయి అయినా చాలా బాగుంటుంది.

నేడే దీనితో వంట చేయడం ప్రారంభించండి

పుష్టి

రెండుసార్లు శుద్ధిచేసిన వేరుశెనగతో తయారైన

వంట నూనె



ఉత్పత్తిదారులు :


ఫుడ్స్ ఫ్యాట్స్ & ఫెర్టిలైజర్స్ లిమిటెడ్

తాడేపల్లిగూడెం (ఆంధ్ర ప్రదేశ్)

ఆఫీసులు వున్న కేంద్రాలు: మద్రాసు, కాకినాడ, బొంబాయి

FFP 13





కుటుంబరావు కథల షరాబు
రాచకొండ ప్రోజుకు నవాబు
బహుమతికి భానుమతి జవాబు
చివరకు మిగిలేది బుచ్చిబాబు

"జనగణమన" పాటన్
పాడుకొనుచు గోటన్
మన జవాను మీటెన్
పాకిస్తాను "పాటన్"





సీస పద్యానికి శ్రీనాథుడు
ప్రాస పద్యానికి శ్రీశ్రీ నాథుడు
మూస పద్యానికి విశ్వనాథుడు
ఒకొక్కడూ మహాయోధుడు

ఠుమ్రీలు పాడడంలో ఉస్తాద్
బడేగులాం అలీఖాన్ వస్తాద్
అందుకే తాన్‌సేన్ కాలంలో పుట్టలేద్
అనే బెంగ నా కెప్పుడూ లేద్





రాజకీయాలు

ఒక సమీక్ష

1965 వెళ్ళింది; 1966 వచ్చింది.

కొత్త సంవత్సరం ఎలా వుంటుంది? పాత దాని లాగే వుంటుందా? ఇంకా బావుంటుందా? ఇంకా బావుండదా?

క్యాలెండరు మారినప్పుడల్లా వ్యక్తులు, దేశాలు కూడా ఈ ప్రశ్నలు వేసుకోవడం మామూలు.

బెంగుళూరు నుంచి వచ్చే "యాస్ట్రిలాజికల్ మేగజీన్" ఈ విషయాన్ని సంపాదకీయంలో చర్చిస్తూ, జ్యోతిశ్శాస్త్ర ప్రకారం చూస్తే 1966 అద్భుతంగా, ఆశావహంగా ఉండబోదని ఘంటా పథంగా చెప్పేసింది. ఇండియాకు గడ్డురోజులు రానున్నాయని, ప్రపంచానికి కూడా ఏదో సంక్షోభం తప్పదని సూచించింది.

ఈ విషయం చెప్పడానికి జ్యోతిశ్శాస్త్రాన్ని సంప్రతించనక్కర లేదేమో.

● ● ●

గతించిన సంవత్సరం గండంగానే గడిచింది. గత సంవత్సరాలలో రాజుకున్న నిప్పురవ్వ ఒక్కసారి భగ్గుమన్నట్టు ఇండియా, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం బ్రద్దలైంది. ఇండియాను దెబ్బతీయడానికి అదనుకోసం చూస్తున్న పాకిస్తాన్ మొదట కచ్ సమస్యమీద గిల్లికజ్జాకు దిగింది. దానిమీద ఏదో విధంగా సమాధానం కుదురుతుందిలే అని సమాధానపడుతుండగా, కాశ్మీర్ సమస్యను లెవ్వకొట్టింది. వేలాదిగా సాయుధ విద్రోహులను ప్రవేశపెట్టి కల్లోలం కలిగించాలని చూసింది. వారిని తరిమికొట్టడానికి మనం ప్రయత్నించగా పాకిస్తాన్ ప్రత్యక్ష యుద్ధానికి దిగి పరాభవం పొందింది.

ఈ యుద్ధంలో మనం నష్టపడకపోలేదు. కాని కొన్ని మేళ్ళు కూడా జరిగాయి. కాశ్మీర్‌ను మనం వదులుకోబోవడం లేదని, దానిపై పట్టుదలగా వున్నామని అమెరికా, తదితర అగ్రరాజ్యాలు మొదటిసారిగా గ్రహించాయి. మన సామరస్య ధోరణి దౌర్బల్య చిహ్నం కాదని కూడా అవి గ్రహించాయి.

దీని ఫలితంగా అమెరికా, బ్రిటన్‌లు మొన్నటివరకు పాకిస్తాన్ ప్లెబిసైట్ వాదాన్ని సమర్థిస్తున్నవల్లా ఇప్పుడు దాన్ని మానివేసి, ఉభయ దేశాలు రాజీపడాలనే ధోరణికి మారాయి. రష్యా చొరవ తీసుకుని తాష్కెంట్‌లో ఇండో–పాక్ చర్చలు ఏర్పాటు చేసింది.

అమెరికా, బ్రిటన్‌లు తనను సమర్థించే ఆశలు వదలుకుని పాకిస్తాన్ ఈ చర్చలకు సమ్మతించింది. వాటి ఫలితం ఏమవుతుందో చూడాలి

అంతేనా? ఇండో - పాక్ యుద్ధం ఫలితంగా, చైనా దురాక్రమణ సమయంలోవలె, బహుశా అంతకంటె ఇనుమిక్కిలిగా సమైక్యం ఏర్పడింది. ఉత్సాహం ఉద్భవించింది. జాతి జాగరితమైంది. మన స్వాతంత్ర్యాన్ని మనమే కాపాడుకోవాలని, కాపాడుకొనే శక్తి మనకి ఒకరిచ్చేది కాదని, మనకు మనమే సంపాదించుకోవాలని దృఢ నిశ్చయం కలిగింది. దీని నుంచే రక్షణ రంగంలో స్వయం సమృద్ధిని సాధించాలనే సంకల్పం బయలుదేరింది.

• • •

దీని తరువాత మనల్ని ఎదుర్కొన్న పెద్ద సమస్య ఆహార రంగంలో ఏర్పడిన సంక్షోభం. గత సంవత్సరం దేశమంతటా వర్షాభావంవల్ల పంటలు దెబ్బతిన్నాయి.

దీని ఫలితం 1966 లో తీవ్రంగా అనుభవించబోతున్నాము. స్వాతంత్ర్యం వచ్చిన పద్దెనిమిదేళ్ళ తరువాత మనం ఒక ఏడాది వర్షాలు కురవకపోతే తల్లడిల్లిపోయే దుస్థితిలో వున్నాము. మన ప్రణాళికలు, ప్రాజెక్టులు, దిగుమతులు ఏవీ మనల్ని ఆదుకొనే స్థితిలో లేకపోవడం జరిగింది. క్రిందటేడాది 60 లక్షల టన్నుల ధాన్యాలు అమెరికా నుంచి దిగుమతి చేసుకున్నాము. ఈ యేడాది కోటి టన్నులు కావాలని అడగ్గా కోటి న్నర టన్ను లివ్వడానికి అమెరికా సిద్ధపడుతున్నది.

ఇది మనకు గర్వకారణం కానేరదు ఇన్నేళ్ళ తరవాత, ఇంత ధన వ్యయం, ఇన్ని ప్రణాళికల తరవాత మన మింకా ఒకరి నుంచి ఆహార సహాయ తెచ్చుకోవలసిన స్థితిలో వుండడం మంచిది కాదు.

ఈ విషమ సమస్యనుంచి మనం సాధ్యమైనంత తొందరగా బయట పడాలి. వచ్చే అయిదేళ్ళలో ఆహార స్వయం సమృద్ధిని సాధించడానికే మన ప్రయత్నాలన్నీ వినియోగపడాలి. బెంగుళూరు జ్యోతిష్పత్రిక జోస్యం చెప్పినట్లు ముందున్న ఏడాదిలో మనం అతి తీవ్రమైన ఆహార సంక్షోభాన్ని ఎదుర్కోవలసి రావచ్చు. పెద్ద నగరాలలో, పట్టణాలలో రేషనింగ్ పెట్టినా, వాడకం ఎంత తగ్గించుకున్నా, వారాని కొకపూట నిరశనదీక్ష పూనినా, దిగుమతులు విరివిగా జరిగినా, క్లిష్ట స్థితి తప్పకపోవచ్చు. దాన్ని ధైర్యంగా ఎదుర్కోవటం మాత్రమే కాదు. ఈ సవాలును స్వీకరించడమే కాదు. ఈ దుస్థితిని శాశ్వతంగా తొలగించుకోవడానికి తీవ్ర కృషి జరగాలి. వచ్చే అయిదేళ్ళలో మన ప్రయత్నాలే స్వతంత్రజాతిగా మన భవితవ్యాన్ని నిర్దేశిస్తాయి.

• • •

మన దేశానికే కాదు, అంతర్జాతీయంగా చూసినా గడచిన సంవత్సరంవలెనే కొత్త సంవత్సరం కూడా మొత్తంపై సంక్షోభ పూరితంగానే వుండేట్లు తోస్తుంది. వియత్నాంలో, ఇండోనేసియాలో, రొడీషియాలో అగ్ని పర్వతాలు అలాగే వున్నాయి. వీటిలో ఏ ఒక్కటైనా చాలు ప్రపంచ శాంతిని భగ్నం చేయడానికి. ఈ సమస్యలన్నిటినీ 1965 వ సంవత్సరం 1966 కు వారసత్వంగా మిగిల్చిపోతోంది.

మానవుడు వైజ్ఞానికంగా, సాంకేతికంగా, సాంస్కృతికంగా ఎదుగుతున్నాడు. పదేళ్ళక్రిందట ఊహించడానికి కూడా అలవికాని మహత్కార్యాలను అతడు సాధిస్తున్నాడు. ప్రెసిడెంట్ జాన్సన్ చెప్పినట్లు మానవుడీనాడు చంద్రలోకానికి నిచ్చెనలు వేస్తున్నాడు. శూన్య రోదసిలో నిస్సహాయంగా తేలియాడడం నేర్చుకున్నాడు. రోదసీ నౌకలను యథేచ్ఛగా నడపడం నేర్చుకున్నాడు. అంతరిక్షంలో

1966 లో మీ రాశిఫలం


రచన శ్రీ మహేష్

1966 వ సంవత్సరానికి రాశి ఫలితాలు జన్మనక్షత్రాల వారీగా నెలలవారీగా విపులంగా పొందుపరచి వున్నాయి
జన్మనక్షత్రం తెలియనివారికి ప్రత్యేకంగా సూచికవుంది
స్త్రీల రాశి ఫలితాలకు ప్రత్యేకానుబంధం వుంది

1966 లో మీ అదృష్ట దర్శనానికి అత్యుత్తమ దర్పణం

వెల : రూపాయి

జ్యోతి బుక్స్, బకింగ్‌హాంపేట, విజయవాడ-2.



గంటకు పది హేడు వేల మైళ్ళ వేగంతో నిర్దిష్ట కక్ష్యలో పరిభ్ర మించగల రోదసీ వేదికలను నిర్మిం చడం, వాటినుంచి చంద్రమండ లానికి, ఇంకా సుదూర గోళాలకు మానవులతో సైతం రాకెట్లనుపంపే ప్రక్రియనుకూడా అనతికాలంలో నేర్చుకో నున్నాడు. ఈ అద్భుత చర్యలు భవిష్యన్మానవ జీవితంపై, ఆలోచనలపై ఏ ప్రభావం కనబరు స్తాయో చెప్పలేము.

కాని వీటితోపాటు మానవుడి ఆత్మసంస్కారం పెరగడం లేదు. బాహ్య ప్రకృతిని అతడు జయిస్తు న్నాడేకాని, తన ఆంతర ప్రకృ తిని ఇంకా వశపరచుకోలేక పోతు న్నాడు. ఇప్పటికీ సంకుచిత రాగ ద్వేషాలే అతన్ని నడిపిస్తున్నాయి; స్వార్థమే అతన్ని పరిపాలిస్తున్నది.

అనంతకాల సముద్రంలో 1965 గాని 1966 గాని నీటి బిందువుల వంటివి. మానవుడు చతుష్పాత్తుల నుంచి విడివడడం ఒక గుణాత్మక పరిణామం (క్వాలిటేటివ్ ఛేంజ్) కాగా, అతడు ఆత్మసంస్కారం పొందడం మరొక మహత్తర పరి ణామం అవుతుంది. నాగరికత ఎంత పెంపొందినా అవి ఆత్మోన్నతిగా పర్యవసించనంతకాలం మానవ పరి ణామం సంపూర్ణం కాబోదు.

□□□

జ్యోతి

నాల్గవ జన్మదినోత్సవానికి

మా శుభాకాంక్షలు

ఏషియాటిక్ ట్రేడర్స్

కాంగ్రెసు ఆఫీసురోడ్డు
విజయవాడ - 2.



మార్పుతెచ్చిన మనిషి (4)

గొప్ప కవిత్వం వ్రాసినవాడి గుండెలో ఏదో గాయం వుండి వుండాలని ఇటీవల స్వర్గస్థుడైన సోమర్సెట్ మామ్ ఒకసారి అన్నాడు.

ఆధునిక మానవుడి హృదయానికి తగిలిన గాయాలను గేయాలుగా వ్రాసిన కవి శ్రీరంగం శ్రీనివాస రావు.

ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మ సూత్రాలు—ఈ మూడింటిని మన వారు 'ప్రస్థానత్రయం' అన్నారు. 'మహాప్రస్థానం' కూడా చేరిస్తే అది 'ప్రస్థాన చతుష్కం' అవుతుం దని అనేవారుచాలామంది ఉన్నారు.

శ్రీ శ్రీ ఏం రాశాడు ? రష్యా భజనచేశాడు. షాక్ చెయ్యడానికి రాశాడు. పొగగొట్టపు ఘూంకార ధ్వని, రాంబందుల రెక్కల చప్పుడు తప్ప అతని కవిత్వంలో మరేం లేదు; అనేవాళ్ళూ వున్నారు.

శ్రీ శ్రీ కవిత్వం అసలు నచ్చని వాళ్ళూ వున్నారు. వడ్డీతో సహా అంతా నచ్చినవాళ్ళూ వున్నారు.

కాని, ఒకటి మాత్రం నిజం. శ్రీ శ్రీ రాజకీయాలని అరాజకీయా లుగా కొట్టిసేవాళ్ళు కూడా అతని శబ్దాల ప్రాబల్యాన్ని, భావాల శాబల్యాన్ని అంగీకరిస్తారు. 'ఫరవా

లేదు, బాగానే రాస్తా'డని పూరు కోవడానికి వీల్లేని కవి శ్రీ శ్రీ.

నిజం కమ్యూనిజంలోనే ఉందని నమ్మిన మొదటి తెలుగు వారిలో శ్రీశ్రీ ఒకడు. 1934 ప్రాంతాలకే అయన 'మరో ప్రపంచం' పిలుపు విన్నాడు. అక్కడికి పోదామని తోటివారిని చేతనైనంత ఆవేశంతో, ఆవేదనతో పురికొల్పాడు.

విప్లవానికి జగన్నాథ రథచక్రాలతో పోలిక తెచ్చిన మొదటి రచయిత తుర్గెనీవ్ ('వర్జిన్ సాయిల్' నవలలో).

శ్రీ శ్రీ ఆ రథచక్రాలను ఆకాశపు దారుల్నించి భూమార్గం పట్టిస్తానని, భూకంపం పుట్టిస్తానని వాగ్దానం చేశాడు.

ఈ వాగ్దానం మాట ప్రస్తుతం మరచిపోయాడో ఏమోగాని, ఇతర భాషా చలన చిత్రాలకు తెలుగు 'వాక్'దానం మాత్రం ఆయన చేస్తున్నాడు

శ్రీ శ్రీ మీద లెక్కలేనన్ని ప్రభావాలున్నాయి. ప్రాచీనాంధ్ర కవుల శబ్దశక్తి అతనిలో వుంది; నవ కవుల భావశక్తి వుంది; గురజాడ సాంఘిక దృష్టి వుంది. మార్క్స్, ఎంగెల్స్, మయకోవ్‌స్కీ, బ్రెక్ట్, ఎడ్గార్ అలెన్‌పో, ఫ్రెంచి సింబలిస్టులు, సర్రియలిస్టులు, స్విన్‌బర్న్, ఇలియట్ — ఇంకా ఎందరెందరి ప్రభావమో అతనిపై వుంది.

ఇందరి ప్రభావాలను అతడు గుండిగలో పోసి వండిన కవిత్వం తెలుగు దేశంమీద తుపానులా వ్యాపించి, తుపాకులు పేల్చి, సంక్షోభం పుట్టించింది పాతదన్న ప్రతిదాన్ని డొక్క చించి డోలుకట్టి వాయించాడు. ఆ డోలు తాళానికి సరిపడే ఛందస్సును సృష్టించుకుని, కనీసం తెలుగులో, ఇంతవరకెవ్వరు తొంగిచూడని అగాధాలను వర్ణించాడు.

శ్రీశ్రీ ఒక అపకారం చేయక పోలేదు. తన తరవాత మరోలా రాయడానికి వీలు లేకుండా చేశాడు. తనలా వ్రాసినవన్నీ తెలుగు కవితకు శుష్కాలంకారాలు కూడా కాలేకుండా చేశాడు. తన మార్గం అనితర సాధ్యమే కాదు, తనకైనా సాధ్యం కాకుండా చేసుకున్నాడు. ఈ లోగా ప్రపంచం తెలుగు కవిత్వంలోని ఈ స్తబ్ధతను, శ్రీశ్రీని, అతని అనుయాయులను, కమ్యూనిజాన్ని దాటి, తెలియని ఏ నిజం వైపో ఎదిగిపోతోంది.

— సవ్యసాచి

ఆ వేళ విమెన్స్ కాలేజీడే! వాసంతి నడక ప్రారంభించింది అర గంటకి కాలేజి ఆవరణ చేరింది. అక్కడ అలంకరణలన్నీ చూడగానే, 'అది తను ఇన్నాళ్ళ నుంచి చదువుతున్న కాలేజీయేనా?' అని అనుమానం కలిగింది వాసంతికి. వాసంతి ప్రీయూనివర్సిటీ కోర్సు చదువుతోంది. తను కాలేజీలో చేరిన మొదటిరోజు కాలేజీ చాలా అందంగా కనిపించింది ఏ అలంకరణలు లేకపోయినా. ఆనాడు తను ఒక మహోన్నత శిఖరాన్ని ఆరోహిస్తున్నట్టు భావించి గర్వించింది. ఈ నాడు మళ్ళీ యిన్నాళ్ళకు అదే. కాలేజి ఇంకా అందంగా కన్పిస్తోంది -

కాలేజి ఆవరణలో తన స్నేహితురాళ్ళంతా చాలా ఆనందంగా తమ తమ తల్లి దండ్రులతో ముచ్చటించుకొంటున్నారు. మరి కొంతమంది చాలా బిజీగా అటూ ఇటూ తిరుగుతున్నారు. తన రాకను వాళ్లెవరూ గమనించలేదు. గమనించినా ఎవరూ పలకరించలేదు.

తన స్నేహితురాళ్ళంతా అంతటి మంచి మంచి దుస్తులతో మెరిసిపోతుంటే మురిసిపోయింది వాసంతి మొదట. తర్వాత వారి అదృష్టానికి అసూయ పడింది. చివరికి తన మామూలు ప్రింటెడ్ వాయిల్ చీరె చూసుకొని తనమీద తను జాలిపడింది. 'ఎవరికెంత ప్రాప్తమో అంతే!' అనుకొని సమాధాన పడింది. ఆ సమయంలో ఆమెకు భగవంతునిపై కించిత్ కోపం కలిగిన మాట మాత్రం వాస్తవం!

అంతలో 'హల్లో వాసంతీ! మీ పేరెంట్స్ ఏరి?...' అని అడిగింది ఒక స్నేహితురాలు.

'రాలేదే! రావడానికి తీరిక



ప్రథమ బహుమతి రూ. 50

మాలిని రావు
బి. ఎస్‌సి. 3 వ సంవత్సరం
విమెన్స్ యూనివర్సిటీ కాలేజీ,
హైదరాబాద్

లేదన్నారు మా నాన్నగారు. మా అమ్మ లేదని నీకు తెలుసుగా."

"సరేగానీ, యిదేమిటి యివాళ కూడా యిటువంటి చౌకబారు చీర కట్టుకొచ్చావు?" అన్నది మామూలుగా ఆ స్నేహితురాలు. కానీ ఆ మాటలు చాలా పరుషంగా, హేళనతో అన్నట్లు వినిపించింది వాసంతికి. జవాబు ఏమీ ఆశించకుండానే నిష్క్రమించింది ఆ స్నేహితురాలు

తన చీరెవైపు ఒకసారి చూసుకొంది వాసంతి. నిజానికి తనకున్న చీరెలలోకల్లా బాగున్నదీ చీరె ఒక్కటే. కానీ అదీ చెత్త చీరె అనేసి వెళ్ళిపోయింది ఆ మహాత్మురాలు. అంటే అర్థం రోజూ కట్టుకొనే వింతకంటే చెత్తవనేనా?...

తనమీద, తన దారిద్ర్యంమీద చాలా కోపం వచ్చింది వాసంతికి. తను యింటి దగ్గిరే ఒక మూలకూర్చోక తగుదునమ్మా అని ఎందుకు బయల్దేరాలి? ఛ ఛ! అనుకుంది.

టీ పార్టీ అదీ పూర్తయింది. వాసంతికి తను ఏం తింటున్నదో కూడా పట్టలేదు. తన స్నేహితురాలు అన్న మాటమీద ఆలోచిస్తూ కూర్చొంది. అంతవరకూ ధనవంతులమీద ఆమెకు అసూయే గాని, కక్ష లేదు. ఇప్పుడు మనస్సులో వారిమీద ఏదో తీరని పగలాంటి భావం మెదిలింది. కాని వారిమీద తను పగ ఎలా తీర్చుకోగలదు?

పార్టీ తర్వాత నాటిక జరుగుతుండగా సన్నని తుప్పర ప్రారంభమైంది. అది పెద్దది కాకుండానే నాటిక అయిపోయింది.

వాసంతి దర్బార్ హాలుముందు నిలబడింది, ఎవరైనా కారుగల సహవిద్యార్థిని తనను యింటివద్ద దింపుతుందేమోనని ఎదురుచూస్తూ. పావుగంట గడిచింది. ఆశ నిరాశ చేసుకుంది. గేటు వరకు వచ్చింది. బైట అయిదారుగురు రిక్షావాళ్ళు మాత్రం వున్నారు. తుప్పర కాస్త పెద్దదవటంతో రిక్షావాళ్ళు మరీ యెక్కువ అడిగారు. మామూలు పావలా అర్థరూపాయ చేశారు. వాసంతికి వేరే మార్గం లేకపోయింది. చీరె భుజాలనిండా పూర్తిగా కప్పుకొని నడక సాగించింది.

తను నడుస్తొంటే రిక్షావాళ్ళు నవ్వుకుంటున్నట్టు అనిపించింది. ఆమెకు తన తండ్రి మీద ఒక్కసారిగా విపరీతమైన కోపంవచ్చింది. "ఏదో గొప్పగా ఇస్తున్నట్టు ఒక ముష్టి పదిరూపాయలు తన ఖర్చులకని ఇస్తారు — ప్రతి నెలా తను జీతం అందుకోగానే. అది తన రిక్షా ఖర్చుకికూడా సరిపోదు. తన స్నేహితురాళ్ళంతా ఎగతాళిగా చూస్తారు. నవ్వుతారు. "రోడ్లమీద నెళ్ళే మగాళ్ళంతా తన అందాన్ని చూడాలని మహా కోరికే మన వాసంతికి" అంది ఒకమ్మాయి ఒక రోజు తను వింటుండగా. తనకు అరికాలిమంట నెత్తికెక్కింది. దాన్ని చితక్కొడదామన్నంత కోపం వచ్చింది. కాని తన్ను తానే నిగ్రహించుకొంది. అది తలచుకొంటే ఆ నాడు ఆ పిల్లను ఎందుకు వదిలిపెట్టానా అని బాధగా వుంటోంది. మళ్ళీ యీ రోజు అదే తలపుకు వచ్చింది. కానీ ఈ సారి ఆ పిల్లమీద కోపంరా లేదు. ఆ కోపం అంతా తండ్రిమీదకు తిరిగింది. ఈ సారినుంచి పది రూపాయలు తీసుకోకూడదు. పదిహేను... కాదు, కాదు ఇరవై రూపాయలు తీసుకోవాలి. అప్పుడు తనూ అందరిలాగే 'లంచ్ అవర్'లో తాజ్‌కు వెళ్ళి అయిస్‌క్రీములు, కాఫీలు తీసుకోవచ్చు. ఏమైనా యివాళ నాన్నతో దెబ్బలాడాలి, ఎలాగైనా నెలకు ఇరవై రూపాయల చొప్పున తీసుకోవాలి!... ఇంతలో వాసంతి యిల్లు చేరింది.

అంతవరకు దిగులుగా కూతురు రాకకోసం ఎదురుచూస్తున్న రామయ్యగారు, "ఏమమ్మా యింత ఆలస్యమైంది? తమ్ముడు, చెల్లి ఇంతవరకు నీకోసం గొడవచేసి యిప్పుడే నిద్రపోయారు" అన్నారు.

వళ్ళు మండిపోయింది వాసంతికి.

"ఎందు కాలస్యం కాదు? రిక్షా డబ్బులు చాలక నడిచి రావలసి వచ్చింది. అమ్మ వుంటే యింత దూరం ఇట్లా నడిపించేది కాదు. మా క్లాసు మేట్సెవరూ నడిచిరారు. అంతా టాక్సీలలోగాని, రిక్షాలలోగాని వస్తారు. ఇకనుంచి ఎప్పుడూ నడిచి వెళ్ళను. రోజు రిక్షాలోనే వెళ్తాను. నాకీ నెలనుంచి యిరవై చొప్పున యివ్వాలి" అంటూ గుడ్లలో నీరు గ్రుక్కుకుంది.

"నీకు తెలియనిదేముంది తల్లీ? నా దగ్గిరే వుంటే నీకివ్వనా? సరే పోనీలే. ఇవాళ నుంచి నీ యిష్టమే కానీ. ఎంత అవస్థపడైనా నీకు సర్దుబాటు చేస్తాను" అన్నారాయన.

ఈ మాటలకి కోపం తగ్గలేదు గానీ మనస్సు కాస్త చివుక్కుమంది. తడిసిపోయిన చీరె మార్చుకుందామని గదిలోకి వెళ్ళింది. ఎదురుగా కోటు స్టాండుమీద నాన్న రోజూ ఆఫీసుకు వేసుకు వెళ్ళే చిరుగుల గళ్ళకోటు వేళాడుతూ కనిపించింది. దాన్ని చేతుల్లోకి తీసుకుంది వాసంతి. తండ్రి దుస్థితి తలచుకోగానే కళ్ళవెంబడి నీళ్ళు జలజల రాలాయి. తను యిష్టం వచ్చినట్లు తండ్రిని తూలనాడినందుకు చాలా నొచ్చుకుంది.

ఒక్కపరుగున తండ్రి దగ్గరకు వెళ్ళింది.

"ఏమిటమ్మా" అన్నారాయన.

ఏం చెప్పాలో తోచలేదామెకి.

"ఏంలేదు నాన్నా! ఇందాక పొరపాటున ఏదో అన్నాను. నాకు పది రూపాయలు చాల్లే. అందులోనే సద్దుకుంటాను" అంది.

□□□

పెద్ద మనుషులు

సాయంత్రం అయిదున్నర దాటిపోయింది. ఆఫీసునుంచి సరాసరివచ్చి గవర్నర్‌పేట సెంటర్ చేరుకున్నాను. సిటీ బస్సింకా రాలేదు. కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ, పక్కకి చూశాను. అక్కడ బస్సుకోసం నిలబడివున్న ప్రయాణీకుల్ని చూసేసరికి గుండె గుభేల్‌మంది. ఇంతమందిలోనూ, కనీసం బస్సెక్కడానికైనా అవకాశముంటుందా?—ఆలోచనల్తో మనస్సు సందిగ్ధావస్థలో పడి ఓ క్షణం కొట్టుమిట్టులాడింది.

ఫస్ట్‌పిరియడ్‌లో 'ఎకనామిక్స్' పరీక్ష వుండడంవల్ల, పొద్దుట్నుంచీ మనస్సంతా దానిమీదే వుంది. అదీగాక, అరు పదిహేను నిముషాల కే మాత్రం ఆలస్యంగా వెళ్ళినా, అబ్‌సెంట్ మార్క్ చేస్తారు—ఎటెండెన్స్ రిజిస్టర్‌లో. మనస్సు పరీక్ష గురించి కలవరిస్తోంటే, కళ్ళు బస్సుకోసం నిరీక్షిస్తున్నాయ్.

మరో రెండు నిముషాలవకముందే, రెండో నెంబరు బస్సొచ్చింది. ఆగిందే తడవుగా, అక్కడ నిలబడ్డ జనమంతా 'హోలో'మంటూ ముందుకు చొచ్చుకవచ్చి, దిగేవార్ని దిగనియ్యకుండా నే ద్వారాన్ని చుట్టుముట్టేశారు. కండక్టర్ గొంతుచించుకొని అరుస్తోన్నా, ఎవరూ లక్ష్యపెడుతున్నట్టు లేదు. అది దాటిపోతే, మరో యిరవై నిముషాలగ్గానీ యింకో బస్సురాదు. ఏమైతే అయింది – సాహసించాలనుకున్నాను. జనాన్ని తప్పించుకొని అతి కష్టంమీద లోపలికి జొరబడి, ద్వారపు చువ్వలు పట్టుకొని, కుడికాలు మెట్లమీద మోపాను. నా ముందెక్కే వారంతా ఆడవారవడంవల్ల, వారు లోపలికెళ్ళందే, నాకు దారేర్పడేటట్టు లేదు. ఏం చేయను? ఆలోచిస్తూండగానే, కండక్టర్ 'రైట్' చెప్పేశాడు. "ఏమమ్మా! బస్సు కదుల్తుంది దయచేసి త్వరగా లోపలికెల్తారా?" అంటూ, నా ముందున్న వార్ని, హెచ్చరించి, నేను సర్దుకోబోయేంతలో, నా షర్టు పట్టుకొని, ఎవరో వెనక్కి గుంజారు. దాన్తో, ఒక్కూపున, బేలన్స్ తప్పి, కిందికి తూలిపోయాను. చేతిలోని పుస్తకాలు జారిపోయాయి. బస్సు కదిలింది.

"ఎందుకబ్బాయ్ ఆ తొందరపాటు! అంతమంది ఆడకూతురెక్కుతుండగా, తోసుకుపోవడమేనా? పైగా చదువుకుంటున్నావు. కొంచెమన్నా మంచీ, మర్యాద తెలీకపోతే ఎట్లా?"

పడిపోయిన పుస్తకాల్ని చేతులోకి తీసుకొని, కోపంతో తిరిగిచూశాను. ఏభై ఏళ్ళుంటాయతనికి. గ్లాస్కో పంచెమీద సిల్కుచొక్కా వేసుకొని కుడి చేతిలో వ్రేలాడుతోన్న బ్లూ కలర్‌సంచితో, రిమ్‌లెస్ తెల్ల కళ్ళద్దాలు పెట్టుకొని ఫక్తు 'పెద్దమనిషి' లా వున్నాడు. కొరకొరలాడుతోన్న అతనిచూపులు నామీదే వున్నాయ్. దాన్తో, నన్ను వెనక్కి గుంజింది అతనేనని గ్రహించాను. శరీరం కుతకుత లాడింది నాకు, అమాంతంగా మింగేయాలన్నంత కోపం వచ్చేసింది. "నీ కెందుకుపోవయ్యా!" అందామనుకొని నోరుతెరచి, "ఎందుకులే, ఏదో పెద్దమనిషిగదా" అని "పరీక్షలండీ" అన్నాను నిర్లిప్తంగా ముఖాన్ని పక్కకు తిప్పుకుంటూ.

"పరీక్షలైతే రిక్షా కట్టించుక వెళ్ళాలి. అంతేగాని, అందర్నీ అలా తోసుకుపోతే ఎట్లా?" మందలిస్తూ బుద్ధిచెప్తున్నట్లుందతని ధోరణి. ఈసారి నిజంగానే కోపం, కళ్ళు మొయ్యొచ్చేసింది నాకు. జేబులు తడిమి చూసుకున్నాను. పన్నెండు పైసలుమాత్ర మున్నాయి.

"ఆc! ఏం చదువులు పోనిద్దురూ! అవి పెరిగినకొద్దీ సంస్కారం ఇలా మండిపోతోంది."

వెన్నుమీద ఛెల్లున చరిచినట్టయింది. చట్‌మని దృష్టిని మరల్చాను. ఆ పెద్దమనిషే! పక్కగా నిలబడ్డ మరో బట్టతల అసామితో అంటున్నాడు. ఆ మాటలు నన్నుద్దేశించి అన్నవే నని యిట్టే గ్రహించాను. బస్సెక్కనియ్యకుండా చేసిందేగాక పరోక్షపు విమర్శ కొంతా? హృదయం భగ్గుమంది.

"మా బాగా చెప్పారు" అంటూ బట్టతల అసామీ మొదలెట్టాడు. "సంస్కారమూ, సభ్యతా అన్నవి చదువుకున్నంత మాత్రాన అబ్బుతాయటండీ! అవసలు పుట్టుకతో కదుటండీ రావాలి! అందుకే పాశ్చాత్యులు రోజురోజుకి ముందుకు పోతోంటే, మనం వెనక్కి జారిపోతోన్నాం. ఏమం



ద్వితీయ బహుమతి

రూ. 25

భీశెట్టి లక్ష్మణరావు

బి. యు. సి.
యస్. ఆర్. ఆర్. అండ్
సి. వి. ఆర్, కాలేజి,
మాచవరం
విజయవాడ - 4.

టారు ?" అన్నాడు — బట్టతలను కుడి చేత్తో సవరించుకుంటూనే, చుట్టూ ఓ పోజు పారేశాడు; తన మాటలు అందరూ వింటున్నారో లేదోనని.

"మెల్లగా అంటారేంటండీ. చూశారూ ..." అంటూ ఏదో చెప్పడానికి నోరు తెరిచాడో లేదో, అప్పుడే బురద నీటిలో స్నానమాచరించి గాబోలు బయటి కొచ్చిన ఓ పిల్లకారు 'వరహావతారం' పెద్ద మనిషి వెనగ్గాపోతూ, ఓ చిన్న డేష్ యిచ్చి మరీ పోయింది.

దాన్తో అతను చిందులు తొక్కడం మొదలెట్టాడు. "ఛ ఛ! ఈ పందుల్తో మహా బెడదొచ్చి పడింది. ఊరే చిన్న చిన్న సందులైతే, ఆ సందుల్నిండా యీ పందులు. కొంత అసలీ వూర్లో మున్సిపాలిటీ అన్నది వుందో లేదో కూడా తెలీదు" కోపంతో చిరబురలాడుతూ, సణుక్కుంటూ, పంచె కంటుకున్న మురికిని తుడుచుకుంటూ అన్నాడు.

బస్సెక్కనియ్యకుండా చేసిన పనికి, బలేశాస్తి జరిగిందిలే అనుకున్నాను నేను—మనసులో.

"అబ్బెబ్బే! మీరు పొరబడుతున్నట్టున్నారు. అసలు 'పంది' పరమాత్మునికి మారుపేరు కాదుటండీ! అదీగాక, మున్సిపాలిటీ వారికి, ఆపద్బంధువాయే మరి. ఎంచేతంటే, రోడ్ల సైడ్లను కాలవగట్లను శుభ్రపర్చాలంటే, మున్సిపాలిటీ వారికి కొంత అదనపు సిబ్బంది అవసరమాయె! ఆ అవసరం లేకుండా, యివి వుపయోగపడుతున్నాయ్ గదా!" అన్నాడు బట్టతల వ్యక్తి పళ్ళికిలిస్తూ.

'బ్రహ్మాండంగా వ్యాఖ్యానించావు బాబూ' అనుకున్నాను మనసులో — పక్కనుంచి వింటున్న నేను.

"మా బాగా సెలవిచ్చారు. విదేశాల్లో చూడండి. పట్టణాలు, పల్లెలూ, వీధులూ ఎంత పరిశుభ్రంగా, అందంగా వుంటాయో!" అంటూ స్వయంగా చూచివచ్చినట్టు టకటక వల్లించేశాడో రెండు నిముషాలు పెద్దమనిషి.

ఇద్దరూ లోకాభిరామాయణం మొదలెట్టారు.

పెద్దమనిషి చెప్పేది సొంతంగా బట్టతల మనిషి వినడంలేదు బట్టతల మనిషి చెప్పేది పెద్దమనిషి వినడంలేదు. ఇద్దరికిద్దరూ ఒకరి కొకరు ఏ మాత్రంతీసిపోకుండా ఏమిటేమిటో చెప్పుకపోతున్నారు. పాక్ చైనాల దురాక్రమణను గురించి చెప్తున్న పెద్దమనిషి, ఠక్కున దాన్నే పేసేసి, తన వూరి పంచాయితీ వ్యవస్థను గూర్చి చెప్పటం మొదలెట్టాడు. అది పూర్తవకముందే, దారినపోతున్న ఒక ఆంగ్లో ఇండియన్ యువతిని చూసిన బట్టతల మనిషి, నాగరికత అంటే ఏమిటో చెప్తూ విమర్శించడం మొదలెట్టాడు.


ఇలా మహా ప్రవాహంలా సాగిపోతోన్న వాళ్ళిద్దరి సంభాషణ, అమెరికా గురించి చెప్పుకుంటూ, అనకాపల్లిని వర్ణిస్తున్నట్టుగా వుంది. పక్కన నిలబడ్డమనుష్యులువింటున్నట్టు కూడా వారు గ్రహించినట్టులేదు.

ఇంతలో పెద్దశబ్దం చేసుకుంటూ బస్సొచ్చింది. చూస్తే అదికూడా కిక్కిరిసేవుంది. అందరికంటే ముందుగా, గబగబా నడిచివెళ్ళాను. కండక్టర్‌కి పక్కగా నిలబడ్డాను. లోపలివారు దిగేసినతర్వాత, పైకెక్కడం కోసం చువ్వలు పట్టుకున్నాడు.

'అంతతొందరైతే ఏలా! వుండబ్బాయ్!" అంటూ ముందు 'పెద్ద మనిషి', వెనుక బట్టతల మనిషి, గబగబావచ్చి నన్ను పక్కకి నెట్టిమరో బస్సెక్కేశారు. నిర్ఘాంతపోయి చూస్తూ ఉండిపోయాన్నేను.

[రచయిత సాయంత్రపు కళాశాల విద్యార్థిగా గమనింప మనవి.]

□□□



నిషా

అప్పుడే వంటపని పూర్తిచేసిన ఆమె, తడైన చేతులు తుడుచుకుంటూ బయటకువచ్చి, బజారు చివరకు చూపు సారించింది. ఆమె ఆ ఎర్రటి సిల్కుచీరెలో మరింత అందంగా ఉంది. తెల్లటి మల్లెలు ఆ నల్లటి కురులలో విప్పారి ఆ ప్రదేశాన్నంతా సువాసనతో నింపింది. ఆమె కాటుక దిద్దిన కళ్ళతో నిరీక్షిస్తుంది ... ఎవరికోసం? ... నిరీక్షణ నిస్పృహగా మారింది. లోపలకు బరువుగా అడుగులువేసింది.

'... రేపు సాయంత్రం అయిదు గంటల బండికి క్యాంపునుండి వచ్చేస్తున్నాను ...' అవి ఉదయం అందిన ఉత్తరంలోని చివరిమాటలు. అందుకోసమే ఆమె అంతగా ముస్తాబైంది. నిరీక్షిస్తోంది.

ఆరున్నరైనా ఇంకా రాలేదేమిటి?

లేకపోతే ఏదైనా పనుండి ఆగిపోయారేమో!

బండి లేటయినా యింత సేపు కాదు. .

'ఒకవేళ నేను ఉత్తరం చదవడం పొరపాటు చదివానేమో!' ఆలోచనకు అందిన సంశయాన్ని తీర్చుకోడానికి మళ్ళీ మళ్ళీ చదివింది, ఉత్తరంలోని ఆ చివరిమాటలు.

'నేను చదవడం పొరపాటు కాదు.'

ఒకవేళ నే నడిగిన చీరె దొరకక ఊరంతా తిరుగుతున్నారేమో!, దొరకక పోవడానికి ... అదేమంత గొప్పది! కాదుగా?' అలా ఎన్నో ఆలోచనలు ఆమెలో సుడులుగా తిరిగాయి. తిరుగుతున్నాయి. కాని ... పరిష్కారం కాలేదు.

గడియారం ఏడు గంటలు కొట్టింది.

ఆమె విచారంగా, ఒంటరిగా కుర్చీలో కూర్చునే ఉంది.

మరో అరగంట ... ఆపైన ఐదు నిమిషాలు అలానే గడిచిపోయాయి. బయట తలుపు చప్పుడైంది. ఆమె మనస్సు ఉప్పొంగి ఉరకలు వేసింది. 'ఆయన వచ్చేశారు' అనుకుంటూ గబగబా వెళ్ళి తలుపు తీసింది.

ఆయనే! ఆమె భర్త!

తడబడుతున్న అడుగులతో లోపలకు నడిచాడు అతడు. ఆమె ఎంతసంతోషంపొందిందో, అదంతా ఒక్కసారిగా విచారంలోకి మారింది. ఆ మార్పుకు సూచనగా ఆమె మనస్సు ఆవేదనతో మూల్గింది. కళ్ళు నీళ్ళతో నిండాయి. భయంతో వణికిపోయింది. మరొకవైపు ఆశ్చర్యంగా ఆమె అతనిని చూసింది.

బయట బెడ్డింగ్, సూట్‌కేస్ అలాగే ఉన్నాయి.

"ఏయ్! ... ఏమిటలా చూస్తున్నావ్?" అడిగాడు అతడు. నిషా సూచిన్నాయి ఆ మాటలు. మనిషి తూలుతున్నాడు.

ఆ పిలుపులోని మార్పు చూసి ఆమె మరింత ఆశ్చర్యపోయింది. 'ముద్దుగా పేరు పెట్టి పిలిచే ఆయనేనా, ఈరోజు ఇలా మాట్లాతుతున్నది. ఇంతకుముందెన్నడూ ఆయన ఇలా పిలవలేదే!" అనుకున్నది.

"ఓహో! ... సాయంత్రం వస్తానని చెప్పాను కదూ ... పొద్దున వచ్చానని ఆశ్చర్య పోతున్నావా?" అంటూ గడియారం చూసుకుని, "ఇంకా ముందే వచ్చేద్దామనుకున్నాను ... ఏం చెయ్యను ... రైలు వెనక్కి నడుస్తూ ముందుకు వచ్చింది ... అది సరేగాని ఏడున్నరైనా ఇంకా తెల్లవారలేదేమిటి ...? అదిగాక ఇంకా బజార్లో లైట్లు వెలుగుతున్నాయి ... మన కెందుకులే సామాను లోపల పెట్టు" అంటూ కుర్చీలో కూలబడ్డాడు.

వచ్చేకన్నీటిని ఆపులేకపోయింది ఆమె.

"ఆయనేనా ఇలా మాట్లాడుతున్నది?"


"నేను కష్టపడుతుంటే చూడలేని ఆయనేనా ఈ మోయలేని బెడ్డింగ్ లోపల పెట్టమంటుంది. ఏమి విదంతా! ... భగవంతుడా!"

అతని ప్రవర్తన చూసి ఆమె మనస్సు మరింత బెదరిపోయింది.

ఆ నలిగిన గుడ్డలు ... చెదరిన జుట్టు, ఎర్రబడిన కళ్ళు ... మూసుకుపోతున్న కను రెప్పలు ... చూచినప్పుడు ఆమె గుండె ఆగిపోయినంత పనైంది. ఏమీ మాట్లాడలేకపోయింది.

"ఆయన తాగారు"

"ఛీ! ఆయన అటువంటి పని



ద్వితీయ బహుమతి

రూ. 25

పసుపులేటి సాంబశివరావు

బి. యస్ సి. ఫైనల్

వి. యస్. ఆర్. కాలేజీ,

తెనాలి

చెయ్యరు" తనకుతాను సమర్థించుకొన్నది. కాని ... ఎదురుగా తను చూస్తున్న దృశ్యాన్ని నమ్మకుండా ఉండలేకపోయింది.

ఏవో పిచ్చిపిచ్చి పాటలు పాడుతున్నాడు అతడు.

"ఏయ్! ఏడుస్తున్నావ్ దేనికి?... గంటైంది వచ్చి ... కాఫీ ఇవ్వాలని తెలియదూ? ..." అంటూ లేచి కోపంగా కుర్చీని ఒక తన్ను తన్ని దానితోపాటు తానుకూడాపడ్డాడు.

ఆమె అతనిని పడక గదిలోకి తీసుకువెళ్ళింది. గభాలున వెళ్ళి మంచంమీద పడ్డాడు అతడు.

"ఇలా వచ్చి కూర్చో" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

"ఇలారా! ..." అంటూ పెద్దగా అరిచాడు.

భయంగా వెళ్ళి మంచంమీద కూర్చుంది.

"చూశావా! ... నేను తాగాను."

"మీరా ? !"

"అవును నేనే ... ఇందాక బజారులో ఒక స్నేహితుడు నువ్వు... నువ్వేరోయ్ ... అన్నాడు ... వాడూ తాగాడులే ... వాడిమీద నమ్మకం లేక నిన్ను అడుగుతున్నా ! ... నేను తాగానుకదూ !"

"అవును ... మీరుతాగారు" ఆమె అతడిని అపి, అన్నది.

నిషాలో అతడు ఏవేవో మాట్లాడుతున్నాడు. నిషాలో అతని కళ్లు మూసుకుపోతున్నాయి.

ఆమె తలవంచుకుని, కొంగులో తలదూర్చి, వచ్చే ఏడ్పును ఆపుకోలేక, పెద్దగా ఏడ్చింది.

ఆమె చేతులు పట్టుకొని పైకి తలెత్తి "ఏడుస్తున్నావా ? ఛీ ! ఊర్కో !" అంటూ దగ్గరకు తీసుకున్నాడు. ఆమె ఆశ్చర్యపోయింది.

"పిచ్చిదానా ! ఎందుకలా ఏడుస్తావ్ ? నిన్ను తమాషాకి అలా ఆడించానుగాని ... నేను నిజంగా తాగలేదు ... అది తెచ్చి పెట్టుకున్న నిషా"

"నిజంగా !" అతని ముఖంలోకి చూచి, ఆమె అడిగింది.

"నిజం" అంటూ ఆమెను అతడు హృదయానికి హత్తుకున్నాడు. ఆమె కంటినుండి వెలువడిన అశ్రువులు ... ఆనందాశ్రువులుగా మారాయి.

● ● ●

ఆ సంఘటన జరిగి రెండేళ్ళయింది.

అతడు ఆనాడు నిజంగా తాగలేదు ... కావాలని నిషాను నటించాడు ... ఆమెను ఆడించాడు.

ఇప్పుడది రెండు రోజులనుంచి జరుగుతున్న నిజం.

అతడు నిజంగా తాగుతున్నాడు ... వద్దన్నా నిషా అతన్ని వరిస్తోంది ... కాని ... ఆడించడానికి ఆమె లేదు ... ఆమె ఫొటో మాత్రం గోడకు వ్రేలాడుతూ అతని నే చూస్తోంది ... ఆమె వెళ్ళిన లోకం నుంచి మరెన్నటికీ రాలేదు. రాదు.

□□□

అపదైన ఆత్మహత్య

అవసరాల రామకృష్ణారావు

కాలేజ్ కమిటీ సెక్రటరీ నుంచి వచ్చిన ఎపాయింట్‌మెంట్ ఆర్డరు చూస్తే వెంకటేశ్వరరావు ఉత్సాహం సగం చచ్చిపోయింది. అతను అనుకున్నట్టు ఉద్యోగం టౌనులో కాదు-అక్కడికి పదిమైళ్ళ దూరంలో ఉన్న ఒక పల్లెటూళ్ళో. వాళ్ళ మేనేజిమెంటు కిందే ఉన్న మరో కొత్త కాలేజీటు అది. ఇంటికి రాగానే రంగ పై ఎడ్రసు చూసీ, మొగుడి మొహం చూసీ అర్థం చేసుకోలేక మరింత ఉక్కిరిబిక్కిరి అయింది... రావు జరిగింది చెపుతూ అన్నాడు:

"మనం ఈ మారుమూల పల్లెటూళ్లో ఉండలేక దీనికి ఎప్లై చేశాం. పట్నం ఏమోనని ఆశపడ్డాను. ఇంతాచేస్తే మళ్ళీ ఇలాంటి దిక్కుమాలిన ఊరేనా ? వద్దని రాసేస్తాను"

"తొందర పడకండి. అంత మరీ పల్లెటూరు అయితే అందరు స్టూడెంట్సూ లెక్చెరర్సూ అక్కడలా ఉండగలరు ? ఒకవేళ టౌన్ నుంచి కాలేజీ బస్ ఏర్పాటు ఏదైనా ఉందేమో ..."

"నోర్మూయ్. నిన్నెవరూ అడగలేదు. ఆడదాంతో ఆలోచిస్తే అఘోరించినట్టే" అన్నాడు రావు ఆ కోపాన్నంతా భార్యమీద చూపిస్తూ. అలాంటి కోపం అతని కళ్ళలోంచి వస్తుందో, నోటిలోంచి వస్తుందో, లోపల్నుంచి వస్తుందో రంగకి బాగా అనుభవమే గదిలోకి వెళ్ళి ఓ పచ్చనోటు పట్టుకొచ్చింది. పొద్దుటమనియార్డరొచ్చింది. "నాన్న పంపేడు, దీపావళికి మనం వెళ్ళలేదుగా, బట్టలు కుట్టించుకో మన్నాడు."

"ఆయనంతలా ప్రాధేయ పడతాడు కాబట్టి పుచ్చుకోవలసి వచ్చింది. లేకపోతే నీ సొమ్ము అందుకోడానికి నాకేంఖర్మ? అలా బల్లమీద పెట్టి లోపలికి వెళ్ళు, మా ఫ్రెండ్సు వచ్చే వేళయింది." అన్నాడు రావు అటు తిరిగి. రంగ నోటక్కడ ఉంచి లోపలికి వెళ్ళిపోయింది. రంగా వాళ్ళ నాన్న అంటూంటాడు 'ఆత్మాభిమానులమని తమంతతాము అనుకునే కొందరు మొగవాళ్ళు అత్తగారివైపు పూచికపుల్ల పుచ్చుకోరు. మంచిదే. కాని పుట్టింటినుంచి ఏమీ తేలేదని భార్యలను సాధించని క్షణం ఉండదు ... ఇలాంటి వాళ్ళం

దరికన్నా మా అల్లుడు కాస్తనయమే.' ఆ మాట జ్ఞాపకంవచ్చి రంగకి నవ్వొచ్చింది. ఆ చప్పుడు వినబడి రావు లోపలికొచ్చాడు.

'ఎందుకా నవ్వు?'

రంగ తలెత్తి మొగుణ్ణి చూసింది. ఆ మొహం చూడగానే మరింతగా నవ్వింది. ఇంతలో ఎవరో వచ్చి అతన్ని పిలిచారు.

"సంసారికి అంత విరగపాటు పనికిరాదు. కాస్త అణచుకో" అతను వీధిలోకి వెడుతూండగా ఆమె పైట చెంగు నోట్లో దోపుకుంది. తలుపులు మూసి ఉన్న ఒక గదిలో కూచుని ఇలా అనుభూతుల్ని అణచుకోవలసిన అవసరం తనకేముంది? కాపురానికి వచ్చిన కొత్తలో రంగని ఈ ప్రశ్న చాలా బాధించింది.

మొట్టమొదటి రోజుల్లో ఒకసారి వెంకటేశ్వర్రావూ అతని క్లాసుమేట్సూ వీధిలో డ్రాయింగ్ రూంలో కూచుని ఏదో మాటాడుకుంటున్నారు. రంగ కాఫీ టిఫినూ తెచ్చి అక్కడ బల్లమీద పెట్టింది. ఎవరైనా పలకరిస్తారేమో, భర్త తన్ని ఎవరికైనా పరిచయం చేస్తాడేమో అని అయిదు నిమిషాలు అక్కడ ఆగి చూసిందికూడా. నిరాశతో లోపలికి వెళ్ళిపోయింది. వాళ్ళని వెళ్ళనిచ్చి రావు చరచరా లోపలికి వచ్చాడు.

"నీకేమైనా మతుండా పోయిందా?"

"ఆదే నేను మిమ్మల్ని అడగదల్చుకున్నాను. అలా నేను నిలబడిపోతే, వాళ్ళందరూ నన్ను గుచ్చి గుచ్చి చూస్తుంటే, కూర్చోమనైనా అనరేం, నన్ను వాళ్ళకు యింట్రడ్యూస్ చెయ్యరేం?"

"పరాయి మొగాళ్ళ పరిచయానికి ఎగబడే నీకు బుద్ధిలేకపోతే పోయింది, అలా ఎంకరేజ్ చెయ్యలేదేమని నన్ను తప్పుపడుతున్నావా? గృహిణికి ఉండవలసిన ఆ మాత్రం సిగ్గూ లజ్జా కూడా వదిలేశావా? ఇంట్లో ఇద్దరు నౌకరీ వెధవలుండగా అసలు నలుగురు మొగాళ్ళ మధ్యకి వచ్చే అవసరమేం కలిగిందంట నీకు?"

మలినమైన హృదయంతో వికారమైన మొహంతో రంగ తలెత్తింది.

"చూడూ, ఇలాంటి వేషాలేం నాకు నచ్చవు. ఇంకేమీ అడక్కు. చెప్పించుకోకు – తెలిసిందా?"

తాత్కాలికంగా నోరు అవునన్నా కాదు కాదని మనసు రొదచేసింది. ఎత్తుగా, తెల్లగా, ఒళ్ళుగా ఉన్న తన మొగుడునుంచి కొన్ని వందల ఏళ్ళ క్రిందటి భావాలు ఆమె ఆమోదించ లేకపోయింది.

'అలా ఇద్దరం కలసి చల్లగాలిలో కొంతదూరం నడిచివద్దామా?' అంది ఒకనాడు సాయంకాలం భర్త యింటికిరాగానే. చూస్తుండగా అతని కనుబొమలు ముడిపడి పోయాయి.

'ఏం, మనం యిలా చల్లగా సంసారం చెయ్యడం నీ కిష్టంలేదా?'

ఎదురుచూడని ఈ జవాబుకి రంగ గిలగిల్లాడి పోయింది.

"ఇందులో తప్పేముందండీ, నేను మీతో వస్తానన్నానుగాని మరెవరితోనైనా ..." అంటూ నాలిక కరుచుకుంది.


"పోనీ నీకంత సరదాగా ఉంటే ఆలాగే చెయ్యకూడదమా?"

అయినా రంగ ఊరుకోదలుచుకో లేదు.

"మొగుడూ పెళ్ళాం అన్నతర వాత సరదాలే ఉండవుటండీ?"

"అవి కథల్లో, సినిమాల్లో. సంసారాల్లో మాత్రం కాదు."

"మరి చెయ్యీ చెయ్యీ పట్టుకుని చిలకా గోరింకల్లా తిరుగుతున్న ఈ అశేష జనానికి ఈ మాత్రం జ్ఞానం లేదంటారా?"



'ఒకళ్ళసంగతి నాకు అనవసరం. వెధవ్వేషాలేసి లోకం ఎలా తగులడి పోతోందో యింట్లో కూచున్న ఆడకూతుళ్ళకేం తెలుస్తుంది.'

'అందుకనే కాస్త మీరు కూడా నాలుగు వీధులూ చూపెడితే...'

రంగ వీపు చుర్రుమంది.

'ఇలాంటి బుర్ర తిరుగుడు కబుర్లు యిప్పుడు చెబితే చెప్పేవ్ మరెప్పుడూ చెప్పకు...'

రంగ భర్తతో మరెప్పుడూ అలా చెప్పలేదు. కాని పక్కింటి శంకరిబాయి ముందు దుఃఖమంతా వెళ్ళగక్కుకుంది. ఆమె ఫకాలుమని నవ్వింది.

'మళ్ళీ పెద్ద వ్యాపారస్థుడి కూతురి నంటావ్, ఆ మాత్రం వ్యవహార జ్ఞానమైనా ఒంటబట్టలేదుటే అమ్మాయ్, నీకూ? పొద్దున పదింటికి వెడితే మళ్ళీ అయిదింటికిగాని యిళ్ళు చేరుకోరు మొగాళ్ళు. వాళ్ళతోనే ప్రపంచం అనుకుంటే మన కెలా కుదురుతుందీ? వాళ్ళున్న కాస్సేపూ మాటకి మాటా అని కోపం తెప్పించడం ఏం గడుసుతనం? ఇక వాళ్ళు యిల్లు దాటేక అన్నావా—వాళ్ళ ఏడుపు వాళ్ళదే, మన ఏడుపు మనదే.'

'అంటే?' అంది రంగ భయం భయంగా. పక్కింటి ఆవిడ మళ్ళీ అర్థయుక్తంగా నవ్వింది. ఆ నవ్వులో ఏదో అపస్వరం లేచింది రంగకి. ఇంక అక్కడ ఉండబుద్ధి పుట్టలేదు.

అయితే ఆమె హితోపదేశం ఊరికే పోలేదు. క్రొత్తిగా తన ప్రపంచం తనదే అనుకోకపోయినా, రంగ తెలిసి కలిగి ప్రవర్తించడం మరిగింది. నిజం చెప్పి బతకడం కన్న చిన్న చిన్న అబద్ధాలు చేర్చడమే హాయి అని గ్రహించింది. దూరమైపోతాడేమో అని బెంగపెట్టుకున్న భర్తను మరింత దగ్గరగా తిప్పుకోడం నేర్చుకుంది. లేకపోతే పాతకాలవు బూజుల్ని పటుంకట్టి భద్రపరచే తన భర్త పల్లెటూరి కాపురం తను వద్దని పట్టుపడితే మాత్రం వినేవాడేనా? 'ఈ పరాయి పల్లెటూళ్ళో మన వైపు మంత్రాలు వచ్చిన ఒక్క బ్రాహ్మణుడైనా కనపడ్డు. పూజా, వ్రతకల్పమూ చెప్పేవాళ్ళులేక ఆ మధ్య మంగళగౌరీ వ్రతమూ చెయ్యలేకపోయాను. శ్రీరాఘవుడికి దీపం పెట్టుకుందామనుకున్నాను. అదీ కుదిరిందికాదు. మొన్నటికి మొన్న కార్తీక సోమవారం పూజా యిలాగే చేజేతులా చెడింది. భాష తెలియని ఈ దిక్కుమాలిన ఊళ్ళో ఏ నోమూ నాకు కుదరదు. పుణ్యమూ, పురుషార్థమూ కలసివచ్చే మరో చోటికి నన్ను తీసికెళదామని యీయనకి తోచాతోచదు...'

ఈ మాట భర్త చెవిని పడ్డానికి వీలుగా మరికాస్త గట్టిగానే అంది రంగ. పట్నవాసమనేది పతివ్రతా ధర్మానికి ఏమంత వ్యతిరేకంగా తోచలేదు వెంకటేశ్వర్రావుకి. వెంటనే అప్లై చేశాడు.

2

పోనీ ఓసారు వెళ్ళి చూస్తే ఏం పోయిందని వెంకటేశ్వర్రావు తను పని చేస్తున్న పల్లెటూరునుండి ఆ టౌనుకి వెళ్ళేడు. టౌనులో ఉండి ప్రతిరోజూ బస్సుమీద పది మైళ్లూ వెళ్ళిరావడానికి అవకాశం ఉందో లేదో కనుక్కున్నాడు. కాలేజి బస్ అంటూ ఏమీ లేదుటగాని, ప్రతి అరగంటకీ ఆ టౌన్నుండి ఆ కాలేజీ ఉన్న గ్రామానికి బయలుదేరే స్టేట్ బస్‌లు ఉన్నాయట.


'ఇంత మరీ పల్లెటూళ్ళలో కాలేజీలు పెట్టడం దేనికో వీళ్ళు?' అన్నాడు రావు, అప్పుడే పరిచయమైన బోటనీ లెక్చరరు భాస్కరమూర్తితో. అతను మొదట్నుంచీ రాష్ట్రేతర ఆంధ్రుడే. అతను చెప్పేడు 'పల్లెటూరని ఆ పేరు గల ఒక ఊరు పిల్లలే ఆ కాలేజీలో చదవరు. ఆ చుట్టుపక్కల అన్ని పల్లెల నుండీ వచ్చి చదువుకుంటారు. వీళ్ళల్లో యిప్పుడిప్పుడే విద్యాసక్తి పెరుగుతోంది.'

ఆ అన్యరాష్ట్రం గురించి వెంకటేశ్వరరావుకి మంచి అభిప్రాయం లేదు. దాని గురించి అట్టే పొగడ్డం వినలేకపోయాడు. 'దానికేంగాని మీరు యిక్కణ్ణుంచి రోజూ వెళ్ళి వస్తారా? అథారిటీస్ ఎలా చేస్తారా?'

'ఇప్పటికేం అబ్జెక్ట్ చెయ్యలేదు మరి. అదిగాక యీ టౌన్‌లో మా ఓన్‌హౌసుంది. పొద్దుటెళ్ళి సాయంకాలం వచ్చేస్తూంటాము.'

'బహువచనం వాడుతున్నారు.'

'అవును నేనొక్కణ్ణీ కాదు. ఇంకా కెమిస్ట్రీ లెక్చరరూ, ఆయనా తెలుగాయనే–సినిమాల వెర్రెక్కువ... అందుకని కంట్రీలైఫ్ లైక్ చెయ్యడు. తక్కిన యిద్దరు లెక్చరర్లూ మనభాషవాళ్ళు కాదనుకోండి, ఇద్దరూ ఇంగ్లీషు చెబుతారు. వాళ్ళతనే ఒక ఫిజిక్సు డిమాన్స్ట్రేటరు



ఉన్నాడు. ఇందరం ఇక్కణ్ణుంచి వెళ్ళి వచ్చేవాళ్ళమే...'

'ఏమోబ్బాబూ...నా మటుకు నాకు తల్చుకుంటే భయంవేస్తోంది. ఉద్యోగం లేకపోతే పీడాపోయిరి. ప్రతిరోజూ ఇరవైమైళ్ళు ట్రావెల్ చెయ్యడం, అందులో బస్సుమీద, మీకెంత ఓపికో ఏమో...నా వల్ల మాత్రం కాదు!'

భాస్కరమూర్తి చిన్నగా నవ్వేడు.

'ఇది ఇవాళ నిన్నా పుట్టిందికాదు సార్. ఎటొచ్చీ సమస్య జటిలమైతే అది వేరే విషయం. స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్. కలకత్తాలో పనిచేస్తున్న మా పెద్దబావకి ఆఫీసుకీ యింటికీ పద్దెనిమిదిమైళ్ళ దూరం. కిక్కిరిసిన బస్సుల్లో ట్రాముల్లో ఎలా వెళ్ళివస్తున్నాడంటారు? అతని సర్వీసంతో తెలుసా, పదిహేనేళ్ళు! మెడికల్ రిప్రజెంటెటివ్సూ, సేల్సుమెన్ వీళ్ళంతా మైళ్ళకొద్దీ తిరక్కపోతే వీళ్ళ ఉద్యోగాలు ఎలాగ?'

ఇంతలో ఒకామె అక్కడికొచ్చింది.

'మిస్ మనోరమా చటర్జీ... బెంగాలీ చెబుతారు.'

'గ్లాడ్ టు మీట్ యు' అని ఆమె చెయ్యి జాపింది. అటు చూడనట్టు నటించి వెంకటేశ్వరరావు పక్కకి తిరిగిపోయి, అక్కణ్ణుంచి రహస్యంగా ఆమెను చూడ్డం ప్రారంభించాడు.

'ఆ మొహం అంత తెల్లగా ఉంది. ఇంకా అంత పౌడరెందుకు? ఆ మెడ అంత తెల్లగా ఉంది. ఆ ముత్యాల దండ కూడా ఎందుకు? ఆ చేతులు అంత తెల్లగా ఉన్నాయి. ఆ దంతపు గాజులు దేనికి? అసలు మనిషే అంత తెల్లని మనిషి. అంత మరి తెల్లచీర ఎందుకు?'

వెంకటేశ్వరరావు తెల్లబోయాడు. ఇంతకుముందు ఏ ఆడదాని వల్లా తనిలా ఆకర్షితుడయిందిలేదు. ఎవరి గురించీ ఇలా ఆలోచించిందీ లేదు!

ఆమె భాస్కరమూర్తితో ఏదో అంటోంది. ఆ భాష రావుకి వచ్చిచావదు. 'ఏమిటంటుంది ఆవిడ?' అని అడిగాడు.

'చెప్పమన్నారా?' అని మూర్తి ఆవిడ్ని అడిగాడు.

'చెప్పండి నేనేం లేని మాటంటే కదా, నాకేం భయం?' అందావిడ.

'మరేంలేదు. నన్ను చూసి తెలుగు వాళ్ళంతా నల్లగానే ఉంటారని ఆవిడ అనుకుందిట. ఇప్పుడు మిమ్మల్ని చూస్తే ఆ అభిప్రాయం మార్చుకోవలసి వచ్చిందిట. ఎండబడితే ఎరుపెక్కేంత తెలుపుతనం మొగాళ్ళకుండడం ఎంతైనా చిత్రమంట.'

'బాగుంది వరస' అన్నాడు రావు.

'ఏమిటంటూరు ఆయన?' మనోరమ అడిగింది.

ఇద్దరూ గట్టిగా నవ్వేశారు. మూర్తి కాస్త మార్చి చెప్పేడు

'ఆవిడకు ఈ టౌనులో బంధువులున్నారు కాబోలు... చూడ్డానికి వచ్చిందా ఆ గ్రామం నుంచి?' అని రావు అడిగాడు.


'లేదే! ఆవిడా రోజూ మాతో పాటు బస్సులో వస్తూ పోతూ ఉంటుంది.

ఈసారి వెంకటేశ్వర్రావుకి తల తీసేసినట్టయింది. మొదటి పరిచయంలోనే ఎండ కన్నెరుగని సుకుమారుడుగా ఆవిడ తన్ను వేళాకోళం చేసింది. ఎందుకూ పనికిరాని ఆడకూతురే ఈ బస్సు ప్రయాణానికి సిద్ధపడితే తనకైనా అంత చేతకానిది? ఆఖరికి యీవిడకన్న తీసిపోయాడా తను? డేమ్ ఇన్సల్టు. తన కొకడికే కాదు. యావత్ మగ జాతికి.

'ఏమిటండీ, ఏం డిసైడ్ చేశారు? మా కాలేజీలో జాయిన్ అవుతారా లేక అక్కడే కంటిన్యూ చేస్తారా?' భాస్కరమూర్తి అడిగాడు. 'వచ్చేస్తానండీ... బస్ జర్నీ టీడియస్‌గా ఉంటుందేమో అనుకున్నా. ఇందరుండగా నాకేం లోపం? ఇవాళే కాలేజీ అథారిటీస్‌కి నా అంగీకారం తెలియబరుస్తా. ఈలోగా ఈ టౌన్‌లో నాకో మంచి యిల్లు చూసిపెట్టాలి. ఆర్టీసీ కన్సెషన్ టికెట్‌కి ఎలా అప్లై చెయ్యాలో చెప్పాలి...' అనేశాడు వెంకటేశ్వర్రావు గబగబా...

3

కొత్తకాలేజీ, కొత్త ప్రిన్సిపాలూ కొత్త స్టూడెంట్సూ - పట్నంలో కొత్త యింట్లో తమ కాపురమూ - యివేవీ తరువాతి ఆరు నెలల్లో





వెంకటేశ్వర్రావు ప్రిన్సిపుల్సుకి ఏ మాత్రమూ అడ్డు రాలేదు. ఒకరి జోలికి వెళ్ళకుండా తన పనేదో తను చూసుకుపోతాడనీ, ఇచ్చిన లెక్చరయినా బాగా ప్రిపేరయి స్టూడెంట్సుకి బాగా అర్థమయేలా చెబుతాడనీ అతనికి పేరు కూడా వచ్చింది. అయితే మానసికంగా అతని పరిస్థితి వేరు. ప్రతి క్షణం మనోరమ అతనికి ఓ పెద్ద సమస్యై కూచుంది. అదెలా పరిష్కరించడమో అతనికి అర్థంకూడా కాలేదు. ప్రతీరోజూ బస్సులో ఆమెతో ప్రయాణమూ అతనికి తప్పలేదు. ఎంత తలొంచుకుని కళ్ళు మూసుకుని కూచున్నా ఆమె ఆలోచన్లు అతన్ని విడలేదు.

విషయమేమిటంటే స్త్రీల విషయంలో వెంకటేశ్వర్రావు మనసులో కొన్ని పరిమితాలైన పరిధులున్నాయి. అవి మార్చుకోవలసిన అవసరం లేకుండా అతనికి ఈ పాతికేళ్ళూ గడిచిపోయింది. "మొగవాడు ఎంత పెద్ద పదవిలో ఉంటేనేం, అతన్ని నడిపించేది ఆడదే" అనే అభిప్రాయం అతను ఏమాత్రమూ ఆమోదించడు. గృహ నిర్వహణ పురుషులూ, ఉద్యోగ నిర్వహణ స్త్రీలూ పూర్తిగా నిర్వహించే రోజులు ఒకవేళ వచ్చినా వెంకటేశ్వర్రావు ఒప్పుకోడు. వంట చెయ్యడం, పిల్లల్ని కనడం యింతకు మించి ఆడదానికి ఉద్యోగమేమిటని అతని ప్రశ్న. మొగాడు బొత్తిగా చేతకానివాడైతేనే పెళ్ళాంచేత ఉద్యోగం చేయిస్తాడని అతని నమ్మకం. భర్త చనిపోయినా, లేదా ఉన్నా పరమ చవట దద్దమ్మ అయినా — తప్పని పరిస్థితుల్లో జీవనోపాధికోసం ఆడది సంపాదించ వచ్చునని, అదయినా ఏ అప్పడాలు వత్తో, ఏ వంటపని చేసో — అంతకుమించి ఆడదాని ఉద్యోగం అతను భరించలేడు. రావులో చెప్పుకోదగ్గ లక్షణం ఉంది. అతని భావాలు సాధారణంగా పైకి వెలిగక్కడు. ఎవరితోనూ వాదించడు. కనీసం ప్రస్తుత పరిస్థితులతో పోల్చుకోడు. ఇంటిదగ్గిర కూడా అతనికి అపజయం లేదు. ఆట్టే చదువుకోక సంసారపక్షంగా ఉన్న రంగనాయకిని తను చేసుకున్నాడు. మొదట్లో కొద్దిగా తెలివి తక్కువతనం చూపించినా తరవాత తరవాత రంగ తనకెన్నడూ మనః క్లేశం కలిగించలేదు. తన మానసిక చిత్రం చెరుపుకోవలసిన అవసరం వెంకటేశ్వర్రావు కెప్పుడూ కలగలేదు. కాని ఇదేమిటీ మనోరమ? తను మనోరమను ప్రేమిస్తున్నాడా? మానసికంగా వ్యభిచరిస్తున్నాడా? లేదు. ఎంతమాత్రం లేదు. ప్రేమించడం మాట దేముడెరుగు; మనస్ఫూర్తిగా ద్వేషిస్తున్నాడు. ఆ ద్వేషాన్ని నిలుపుకొనే అవకాశాలు దొరక్క విచారిస్తున్నాడు.

ఆవిడ బెంగాలీ ఎమ్మేట. రావుకేమో ఆ భాష కొద్దికొద్దిగా వచ్చు. అప్పుడే ఏడాదై ఆ ప్రాంతాల్లో ఉన్నాడు గనక ఒహారు

మాటాడితే ఓ మోస్తరుగా అర్థ మౌతుంది. తను తిరిగి చెప్పలేడు. పోనీ ఇంగ్లీషులో మాటాడదా మంటే అతని ఉచ్చారణ ఆమెకూ, ఆమె ఉచ్చారణ అతనికీ ఇంపుగా ఉండక ఏమిటో మాటాడుకున్నా మన్న సంతృప్తి మిగలదు. భాస్కర మూర్తయితే కొంచెం సీరియస్‌నెస్ ఉన్నవాడుగనక ఉన్నదున్నట్టు యింటర్‌ప్రెట్ చేస్తాడు. కెమిస్ట్రీ లెక్చరర్ మోహనరావు మాత్రం లేనిపోనివి చెప్పి-వేళాకోళం పట్టిస్తాడు. అయినా పరాయిఆడది ఆవిడతో తనకి మాటలేమిటి? కాని ఈ మనోరమ అలా బతకనివ్వదే? తను ఒక్క క్షణమైనా నిశ్శబ్దంగా ఉండలేక పోవడమే కాకుండా ఎదుటివార్ని కూడా నిశ్శబ్దంగా ఉండనియ్యదు. తన ప్రతీ అనుభూతీ ఎదుటివారు పంచుకోవాలి. చిన్నా, పెద్దా; ఆడా, మొగా; కొత్తా, పాతా ఈ భేదమే లేదు ఆమెకి. నోరు మూసుకుని విని చెప్పిన దానికల్లా అవునని తల లూపే చచ్చురకం శ్రోతల్ని ఆమె ఏ మాత్రమూ భరించలేదు. అలాంటి ఆమెను రావు ఏ మాత్రమూ భరించలేడు!

"చలనమూ, చైతన్యమూ, సౌందర్యమూ ఉన్న మానవులం మనం ఊరికే ఎలా పడుండగలం!" అన్న ధోరణిలో మాటాడుతుంది ఆమె.

"బరితెగించిన రకం!" అని అర్థం చేసుకుంటాడు వెంకటేశ్వర్రావు. చాలా నీటుగా ముస్తాబై వస్తుంది మనోరమ. ఎంతో అందంగా హుందాగా కనబడుతుంది. ఎక్కడా చెక్కు చెదరకుండా, ముడత నలగకుండా అలంకరించుకుంటుంది. కాని బస్సు ప్రయాణం ఆమె 'ఎలిగెన్సును' హరించి వేస్తుంది. నిజం చెప్పాలంటే ఆమె నలిగిపోవడం బస్సు కుదుపువల్ల కాదు. అంతూ దరీలేని ఆమె కబుర్లవల్ల. అలా కబుర్లు చెబుతున్నపుడు ఆ కళ్ళు, ఆ జడలు, ఆ చేతులు అలా నాట్యం చెయ్యవలసిందే. అయితే చిత్రమేమిటంటే అలా బస్సు దిగిన మనిషి తిన్నగా లేడీస్ వెయిటింగ్ రూంలోకి—కాలేజీలో ఆమెకు ప్రత్యేకించినది—వెడుతుంది. లోపల అంత తక్కువ టైంలో ఎలా ఏం చెయ్యగలుగుతుందో యువతిలికి వచ్చేసరికి—రాత్రంతా అమ్మని తెగ బరికి, కడుపునిండా పాలు ఊనట్టి, ఒళ్ళు తెలియని నిద్రతీసి, అప్పుడే మేలుకున్న పసిపాప కళ్ళలోని వెలుగులా—నిర్మలంగా తయారయి వస్తుంది. "లోపల ఎంతెంత లోపాలు లేకపోతే ఇన్నిన్ని పై మెరుగులు దేనికి? ఆడదానికి అతి ముఖ్యమైనది శీలం. పాతికేళ్లు పైబడినా యీమెకు పెళ్ళికాలేదంటే—అలా కాకపోయినా ఇంత పైలా పచ్చీసుగా తిరుగుతోందంటే ఏనాడో చెడిపోయి ఉంటుందని స్పష్టంగా తెలుస్తోంది. అవి కప్పెట్టుకోడానికే ఇన్ని నాటకాలు ఆడుతోంది!" అనుకున్నాడు వెంకటేశ్వర్రావు. కాని దానికి ఒక్క రుజువు దొరక్క అతని మనసు బాధపడింది. "ఇలాంటి వాళ్ళు పైకి తేలతారా నా వెర్రి గాని!" అని సమాధాన పరుచుకుందా మన్నా అతనికి ఉండబట్టలేదు. ఎప్పుడూ ఏ విషయమూ వంత తెలిసిన వాళ్ళదగ్గరైనా ఎక్స్‌ప్రెస్ చెయ్యడం ఎరగని అతను యీ విషయం తెలిసిన ఇద్దరు ఆంధ్రా లెక్చరర్సు దగ్గిరా వెలిగ్రక్కక తప్పలేదు.

"రామ, రామ! ఆమె గురించి అంత నీచంగా మాట్లాడ్డం ఘోరం!" అన్నాడు భాస్కరమూర్తి. అంతే కాదు. ఆమె గొప్పతనాన్ని గంటల తరబడి చెప్పడం ప్రారంభించాడు. రెండేళ్లై ఆమెను ఎరుగునట. వెకిలితనం మచ్చుకైనా లేదుట. వాళ్ళది చాలా సాంప్రదాయమైన పెద్ద కుటుంబమట. వాళ్ళ కుటుంబానికి మనోరమ కొంతవరకు ఆర్థికసాయం కూడా చేస్తున్నదట.

"ఆ చల్లని చిరునవ్వు వెనక, ఆ తెల్లని బట్టలవెనక, చక్కని హృదయంకూడా ఉంది. ఓసారి బస్సులో ఏం జరిగిందనుకున్నారు? బస్సు



బజారుకి స్వార్లోచ్చారంటే వెళ్ళా
ఏం జనమండీ - ఏం జనం! బహటే తొక్కిడి

కుదుపుకి, అది రాత్రయినా, పట్టపగలయినా, సగం పైగా ప్రయాణీకులు నిద్రకి ఉపక్రమించడం మీకేం తెలియని విషయం కాదుగదా, రావుగారూ? అవాళ మనోరమ పక్కసీట్లో ఓ పదేళ్ళ కుర్రాడు కూచున్నాడు. తల నిండా బాగా నూనె రాసుకున్నాడు. మనోరమ అవాళ కొత్తచీర కట్టుకొచ్చింది. వాడు నిద్రలో జోగిజోగి ఆమె మీద పడడం, ఆమె చీర భుజం దగ్గిర పెద్ద నూనె మరక అయిపోయింది. ఈ సంగతిచూసి పక్కనే ఉన్న ఆ కుర్రాడి తల్లి వాణ్ణి ఓ లెంపకాయ వేసింది. మనోరమ ఏమాత్రమూ విసుగయినా కనబరచకపోగా తన గురించి ఆ కుర్రాడు దెబ్బతిన్నందుకు ఎంతో బాధపడి, బస్సుదగ్గిరకి అప్పడాలు అమ్మొస్తే వాడికి కొనిపెట్టి ఊరుకోపెట్టింది. ఇంకా అదినయమే. మరోసారి..."

"ఎందుకులెద్దురూ... నేను కొంతవరకూ చూస్తున్నానుగదా..."

"అలాకాదు... వినండి... ఒకావిడ ముగ్గురు పిల్లల్ని వెంటబెట్టుకుని బస్సెక్కింది. మనోరమ పక్కనే కూచుంది. ఇద్దరుపిల్లల్ని ఒకవైపు కూచోపెట్టుకుని మూడోవాణ్ణి—చంటిపిల్లాణ్ణి—తొడమీద బుర్రపెట్టి జోకొట్టింది. వాడు కాళ్ళు దర్జాగా మనోరమ తెల్లనుచీరమీదకు జాచాడు. ఆమె ఏమీ అనకపోగా ఆ కాళ్ళని తన ఒడిలోకి లాక్కుని మృదువుగా వాణ్ణి జోకొట్టింది. వెల్లకిలా పడుకుని ఇంద్రభోగం అనుభవిస్తున్న ఆ గుంట నాగమ్మ ఊరుకోవచ్చా? మరుక్షణం ఫౌంటెన్‌లోంచి వచ్చినట్టు, ఆమె కళ్ళూ బుగ్గలూ పావనం చేశాడు. అక్కడ మనోరమ కాక మరెవరున్నా పెద్ద రాద్ధాంతం జరిగిఉండేదే! బట్టలు పాడయినందుకు కాకపోయినా బస్సులో వాళ్ళు నవ్వినందుకయినా మరొకరు ఆ పాపను బజాయించి ఉందురు. "మిస్చువస్ రాస్కెల్!" అంది నవ్వుతూ. పాపం పక్కనున్న ఇల్లాలు మరీ మరీ క్షమాపణ చెప్పుకుంది.

"డోన్ట్ వర్రీ సిస్టర్ ... మనం ఆడవాళ్ళం ... ఎప్పుడో అప్పుడు ఇలాంటి అవస్థలకు సిద్ధంగా ఉండవలసిందే!" అంది తేలికగా.

"పిల్లల్ని కన్నవారు కాబట్టి మీరు అర్థం చేసుకున్నారు. ఇంకొకళ్ళయితే ఎంతగొడవ చేద్దురో!" అంది ఆ పిల్లలతల్లి ఆమెగురించి తెలిక. మనోరమ నవ్వేసిఊరుకుంది.

"ఎందరమ్మా మీకు పిల్లలూ?" అని మళ్ళీ ఆవిడే అడిగింది. మనోరమ ఏం జవాబు చెప్పి ఉంటుందో మీరుఊహించగలరా రావుగారూ?"

భాస్కరమూర్తి ప్రశ్నకు వెంకటేశ్వర్రావు కళ్ళు చిట్లించి జవాబు చెప్పేడు.

"దీనికి పెద్ద ఊహించలేనిదంటూ ఏముంది! జవాబుగా మళ్ళీ నవ్వేసి ఉంటుంది."

'అదేంకాదు, మనోరమచెప్పిందీ—ప్రస్తుతం నాకు రెండొందల యాభై మంది పిల్లలు అని!"

"అంటే?"


"ఆ మాత్రం పోల్చుకోలేరా? మన కాలేజీ స్టూడెంట్సు మొత్తం అంతేగదా" భాస్కరమూర్తి మనోరమ గురించి యింకా చెప్పబోతుండగా వెంకటేశ్వర్రావే వినలేక అక్కణ్ణుంచి ఏదో వంకపెట్టుకుని బయటకు వెళ్ళిపోయాడు. అతనిలో పుట్టిన అగ్నిహోత్రం మరింత ప్రజ్వలించింది. మోహనరావుతో మాటాడినపుడు మాత్రం అంత బాధపడలేదు. కారణం మోహనరావు యింకా బాగా కుర్రాడు. ఎలాబడితే అలా మాటాడగలవాడు. "భాస్కరమూర్తి అవిణ్ణంతలా వెనకేసుకు రావడంలో అర్థం లేకపోలేదులెండి" అన్నాడతను అదోలా నవ్వుతూ. వెంకటేశ్వర్రావుకి కాస్త ప్రాణం తెప్పరిల్లినట్లయింది.

"మనం ఎందరుండనీండి. షి ప్రిఫర్స్ టు సిట్ బై హిజ్ సైడ్ ఇన్ ది బస్, ఏంచేతంటారు?"

రావు మోహన్‌తో కలిసి హాయిగా నవ్వేడు.

"మరి చెప్పరేం?" అంటూ స్పెషల్ టీకి ఆర్డరిచ్చేడు. ఐతే దానికి రుజువు ఆ మర్నాడే దొరకడంతో, రావుకి ఇంకా ఈ ప్రపంచం ఎందుకు భగ్గని మండిపోలేదో అర్థమయింది. ఆవేళ లాస్టు పిరియడ్ క్లాస్ పూర్తి చేసుకుని రావు మోహన్‌తో కలిసి బస్సు దగ్గిరకి వచ్చేసరికి కాస్త ఆలస్యమైంది. బస్సు నిండిపోడంచేత నిలబడవలసి వచ్చింది. ఎక్కడో ముందుసీట్లో మనోరమా, భాస్కరమూర్తీ ఉండడంచేత, బస్సుకిక్కిరిసి ఉండడంచేత వీళ్ళకి వాళ్ళెక్కడ ఉన్నారో సరిగా కనబడలేదు. ఇంక కొను ఒకటి రెండు మైళ్ళుందనగా మోహన్ అటుచూడమని రావుని మోచేత్తో పొడిచాడు.

'ఫరవాలేదు. యు కెన్ రెస్ట్ ఆన్ మి' అంటోంది మనోరమ. భాస్కరమూర్తి కళ్ళు మూసుకుని ఆమె భుజంమీద తల వాల్చుకుని పడుకున్నాడు!



రైలుస్టేషన్లో, బండి లేటుకదా అని ఒక లావుపాటి ఆసామీ నిద్దరోతున్నాడు. ఒక జేబుదొంగ అతని ప్యాంట్ జేబులో చెయ్యి పెట్టే వేళకి అతను అటునుంచి ఇటు ఒత్తిగిలడం సంభవించింది.

అంతే. ఆ చెయ్యి మరి రాలేదు. ఇద్దరు పోలీసులు సాయంపట్టి విడిపించారు చివరికి.

'నిండు బస్సులో పట్టపగలు ప్రేమ పారవశ్యం! ఆ రెండూ ఒదిలేస్తేసరి ప్రపంచంలో ఎలాగేనాబతకొచ్చు'అన్న మోహన్ ఆ క్షణంలో రావుకి ఆప్త మిత్రుడయి పోయాడు.

"కేవలం లెక్చరర్సేకాక కౌను నుంచి ప్రతీరోజూ విలేజికివచ్చి చదువుకునే స్టూడెంట్సూ ఎప్పుడూ బస్సులో ఉంటారు. కనీసం వాళ్ళున్నారనయినా..."

"దీనికి ఏదో ఒకటి చెయ్యాలి. ఈ మనోరమలాంటి వాళ్ళని రూపుమాపుతేగాని ఈ దేశం బాగుపడదు" అన్నాడు రావు.

బస్సు దిగి వాళ్ళు వెళిపోయాక అతను ఉండబట్టలేక పక్కనున్న స్టూడెంట్‌తో అన్నాడు.

"చూశావుటోయ్ వైకుంఠం, ఈ మూర్తి సంగతి వినున్నా బాగుందీ?"

"ఏం బాగులేదుసార్. పాపం బస్సులో చాలా బాధపడిపోయారు. బెంగాలీ లెక్చెరరు ఆయన్ని హాస్పిటల్‌కి తీసికెళ్ళేరు. ఉన్నట్టుండి ఒక్కసారి వచ్చేసింది. నూట నాలుగు జ్వరం!"

"ప్రేమ జ్వరం కాబోలు!" అన్నాడు మోహన్, రావు చెవిలో. కాని రావుకి ఆ సమాధానం ఏ మాత్రమూ తృప్తి నివ్వలేదు!

4

"ఏమోగాని మీరు మునపట్లా ఉండడంలేదు...పరధ్యానం ఎక్కువై పోయింది" అంది రంగనాయకి ఒకనాడు భర్తతో. అతనేమీ మాటాడలేదు "మునపటి కొలేజీల్లోనైయ్యం. నిక్షేపంలా ఉండేవారు. ఇక్కడ నీళ్ళూ అవీ ఒంటుబట్టలేదేమో, సన్నపడి పోతున్నారు. అనవసరంగా నేనే పల్లెటూరు పల్లెటూరని మిమ్మల్నిక్కడికి లాక్కొచ్చాను... నిత్యం మైళ్ళకు మైళ్ళు యీ బస్సు ప్రయాణం మీకు పడ్డట్టులేదు"

రావు అప్పటికీ మాటాడలేదు.

"మునపటి ప్రిన్సిపాలుకన్న ఇతనెంతో మంచివాడన్నారు. ఎవళ్ళ పని వాళ్ళు చేసుకు పోడమేగాని కాలేజీలో ఎలాంటి రాజకీయాలూ లేవన్నారు. మరి మీ కొచ్చిన చికాకు ఏమిటి?"

"నీతో చెప్పవలసింది కాదు. నువ్వు తీర్చేది కాదు. నీ పనేదో నువ్వు చూసుకో—లోపలికి పో... నాకు కాలేజీకి వేళయింది. ఎప్పుడూ ఆ వీధిగుమ్మంలోనే అఘోరించకు. కాస్త అప్పుడప్పుడు లోపలికి కూడా తగులడుతూండు."

వెంకటేశ్వర్రావు బస్సుస్టాండు వైపు గబగబ నడచిపోయాడు. అయిదునిమిషాలు అక్కడే నిలుచుని చూసింది రంగ. మూతి విరిచింది. చేతులు వెక్కిరించినట్టు తిప్పింది. తళ్ళని తలుపు వేసేసింది. అరగంటలో భోజనమూ పైపనీ ముగించింది. పెట్టెతెరచి పర్సుతీసింది. రెండు పదిరూపాయల నోట్లూ, నాలుగు రూపాయల నోట్లూ, రెండ్రూపాయల చిల్లరా పర్సులో వేసుకుని పెట్టెతలుపు వేసేసింది. శుభ్రమైన చీరా జాకెట్టూ వేసుకుని మరోమారు తలదువ్వుకుని, పౌడరద్దుకుంటే బాగుణ్ణేమో అనిపించింది ఆమెకు, బీరువాలో బిగించబడిన అద్దంవైపు చూసుకుంటే, "ఎబ్బే. ఇప్పటికే ఆలస్యమైపోయింది" అనుకుని గబగబా వీధితాళాలు వేసుకు వీధినిబడి తొందరగా నడవసాగింది, దారిలో దాసీమనిషి ఎదురుబడి ఆ స్పీడుచూసి నవ్వుతూ అంది.

"పరుగేనా పెట్టండి తల్లీ. ఆనక పని చెడిపోయేను."

"ఒసే మంగీ నోరుముయ్యి... నేనిలా వెడుతున్నానని బాబుగారికి ఎవరివల్ల తెలిసినా సరే ముందు నీ పీక నొక్కుతాను తెలిసిందా?"

"అలాగే. చెప్పకుండా ఉన్నందుకు లంచం ఏమిస్తారు?"

"పీక నొక్కకపోడమే! వెళ్ళు అంటుగిన్నెలు ఎదురుచూస్తున్నాయి"

రంగ తాళాలగుత్తి తీసి ఒక తాళం వేరే తీసియిచ్చింది. అది అందుకుని మంగి వెళ్ళిపోయింది రంగ మరింత చకాచకా నడుస్తూ ఒక యింటి ముందు ఆగింది. ఒక్కసారి అటూ యిటూ చూసి లోపలికి వెళ్ళిపోయింది. అది ఆదర్శమహిళా మండలి. అక్కడ ఉదయము పది మొదలు సాయంకాలము నాలుగు వరకు ప్రతిదినము దబ్బేసి పేకాట ఆడబడును.

సరిగ్గా ఇదే సమయంలో వెంకటేశ్వర్రావుతో మనోరమ బస్సులో అంది;

"ఎన్నోసార్లు మీ మిసెస్‌ని చూపిస్తానన్నారు. ఒకే ఊళ్ళో ఉన్న మనకు ఇది యింత యింపాజిబుల్ థింగ్ అంటే ఎవరేనా నవ్వుతారు. ఈ ఆదివారం మీ ఇల్లెక్కడో నేనే వెతుక్కువస్తాను. వస్తే తగిలెయ్యరు గదా! ఏమో ఆవేళకి మీ శ్రీమతిని ఎక్కడికైనాపంపించేస్తే! అలాకాదు. చెప్పాపెట్టకుండా నేనే ఎప్పుడో వచ్చి మీ ఆవిణ్ణి ఎత్తుకుపోతాను.





అప్పుడప్పుడు మీరే నన్ను బతిమాలుకో వలసి వస్తుంది. అయినా ఈ ఇరవైయో శతాబ్దంలో యింకా యింత ఆర్థోడాక్సు ఏమిటండీ మీరు? ఒక్కసారైనా అవిణ్ణి మీతోడా పైకి తీసుకురారేం? అసలు ఈయనికి పెళ్ళైందా అని? భాస్కరమూర్తి గారూ! మీరు మిసెస్ వెంకటేశ్వ్రరావ్‌ను చూశారూ?'

'బాగుంది, ఆడాళ్ళ కంటపెట్టడానికే ఆయనికి భయం. ఇక మీ లాంటి మొగ ముండాకొడుకులికి చూపిస్తాడూ, ఇంకేమైనా ఉందా?' బుగ్గలేకాక మెడంతా ఎఱ్ఱపడేదాకా మనోరమ నవ్వింది. అలా విరగబడి నవ్వుతున్న మనోరమ పక్కని రంగని తలుచుకుంటే ఒక్కసారి అసహ్యంతో రావు మనసు వికలమైపోయింది. 'నేనే ఎప్పుడో వచ్చి మీ ఆవిణ్ణి ఎత్తుకు పోతాను' అన్న ఆమె మాట తరతరాల మన భారతీయ సంస్కృతికి గొడ్డలి పెట్టుగా అతనికి తోచింది. "నీతికి నిబంధనకి ఎప్పుడయితే కట్టుబడి వుండదో అప్పుడే ఆడది చెడింది, ఆడది ఎప్పుడిలా రెచ్చకెక్కిందో ఆనాడే దేశం నాశనమయింది. అనుకున్నాడతను, "రేపొద్దున నాకూ ఆడపిల్లలు పుడతారు. ఇలాగే చేతులా భ్రష్టుల్ని చేస్తానా? ఇంట్లోనే తెలుగూ లెక్కలూ చెప్పిస్తాను. పదహారు వెళ్ళకుండా పెళ్ళిళ్ళు చేసి అత్తారిళ్ళకు సాగనంపుతాను. పతివ్రతా తిలకాలైన నా కుమార్తెలు ఏ యింట్లో పాదం పెడతారో అక్కడ మళ్ళీ మన సత్సాంప్రదాయం జీవంపోసుకుంటుంది ... భారతమాత మొహం మళ్ళీ కళకళలాడుతుంది.' రావు తెల్లని బుగ్గల్లో తగు మాత్రం అరుణిమ తొంగిచూసింది.

'మనం చెప్పిందంతా విని రావు గారు 'తెలిపతి' ద్వారా వారి భార్యకు అందచేస్తున్నారనుకుంటాను. కావలస్తే ఆ మొహం చూడండి.'

భాస్కరమూర్తి మోహన్ నవ్వేరు. మోహన్ అన్నాడు.

'అతని తియ్యని కలలు పాడు చెయ్యకండి పాపం'

అక్కర్లేదు. మనం ఎన్ననుకున్నా ఆయన ధోరణి ఆయనదే'

వెంకటేశ్వ్రరావు గట్టిగా జవాబు చెబుదామనుకున్నాడు. కాని సమయానికి అతని నోటంట మాట పెగల్దు, భాష సరిగ్గా పట్టుబడక అనుకున్నవన్నీ అతను చెప్పలేదు కూడాను. పైకి కక్కలేని జవాబులు మాత్రం అతనిలో రడీగానే ఉంటాయి.

'నాది నాది కాక నీ ధోరణీ నా ధోరణీ ఒకటెలా అవుతుందే మనోరమా? అసలు నీకు యింకొకరితో పోల్చుకునే యోగ్యతెక్కడిది? తప్పుదారిన నడిచే నీ లాంటి వాళ్ళకి విద్యార్థులైనా వారి దుస్థితికి ముందు విచారించాలి. ఈ పాటికైనా నీకు తగిన మారు పేరు ఒకటి

తగిలించి క్లాసులో కొచ్చేసరికల్లా ముప్పతిప్పలూ పెట్టిని విద్యార్థుల అమాయకత్వానికి విచారించాలి. ఇలాంటి వాళ్ళని తెలుసుండీ ఉపేక్ష చేస్తున్న పరిపాలకవర్గం చేతకానితనానికి విచారించాలి. కాని, మనోరమా! నీ ఆటలు ఎల్లకాలం సాగవు. ఎల్లకాలం ఇలాగే నవ్వుతూ గడపగలననుకోడానికి నీ జీవితంలో చెప్పుకో తగింది ఏం సాధించావు గనక! ఇంత బహిరంగంగా విచ్చలవిడిగా తిరుగుతున్న నీకు పెళ్ళనేది గగనకుసుమం కదా!' వెంకటేశ్వర్రావు తనలో తనే నవ్వుకున్నాడు.

'అల్లరి చిల్లరి తిరుగుళ్ళే తిరిగావుగాని చల్లని సంసారం అదెంత చక్కనిదో అనుభవించే గీత పాపం నీకు లేదుకదె!' అని అతడు గర్వపడినన్నాళ్ళు పట్టలేదు. ఆ మరుసటి వారం ఆమె నాలుగు రోజులు వరసగా శలవు పెట్టింది. ఎవరితోటీ ఎక్కువ ఏమీ మాటాడక రిజర్వుడుగా ఉండే రావుకి ఏ ఖబురయినా అందరికంటె ఆఖరున తెలియడం మామూలే. అదైనా ఆ మోహన్‌వల్లె తెలిసింది.

'మీరు వినలేదా ఏమిటి? మనోరమా ఛటర్జీ పెళ్ళి నిశ్చయమైందిట!' రావు 'షాక్' లోంచి తేరుకోక పూర్వమే అతను మళ్ళీ చెప్పేడు.

'అతను కూడా ఎమ్మే వేట. ఫష్టుక్లాసే కాక యూనివర్సిటీ ఫష్టుట. రిసెర్చి స్కాలరుగా ఉంటున్నాడట.'


వద్దనుకున్నా ఆ కబుర్లు చెవులో పడ్డాయి. వద్దనుకున్నా మనసు ఆలోచించడం మానలేదు. ఎవరో ఎరక్క ఈ ఉచ్చులో చిక్కుకున్నాడంటే అది వేరే విషయం. ప్రఫుల్లచంద్రకుమార్ ఆవిడ మేనత్తకొడుకట.

మానసికంగా తనకు జరిగిన ఈ అపజయాన్ని వెంకటేశ్వర్రావు ఎంతమాత్రం తనలో యిముడ్చుకోలేక పోయాడు. ఎప్పుడూ లేనిది ఆవాళ లెక్చరు క్లాసులో కొన్ని తప్పులు చెప్పేడు. ధైర్యమూ తెలివితేటలూగల ఒక కుర్రవాడు అవి ఎత్తిచూపిస్తే అనవసరంగా ఇరిటేటై క్లాసంతటినీ తిట్టిపోశాడు. క్లాసంతా వాకౌట్ చేద్దామనుకున్నారుగాని సమయానికి ప్రిన్సిపాలువచ్చి సర్ది చెప్పేడు. ఆ దెబ్బతో రావు మూడురోజులు క్యాజువల్ లీవు పెట్టేశాడు!

ఆ మూడు రోజులో ఇంటిదగ్గిర వెంకటేశ్వర్రావు సజీవసమాధి అనుభవించాడు. ఆ బాధ మింగలేనిది, కక్కలేనిది. ఆ విసుగంతా సహజంగా సహధర్మచారిణి మీద చూపించాడు. భర్త యింట్లో చేరి ఆమె నిత్యకృత్యానికి అడ్డురావడంచేత ఆమెకూడా సహజంగా సహనం కోల్పోయింది. ఎప్పుడూ లేనిది మాటకు మాట జవాబు చెప్పింది. దాన్తో అతను రెచ్చిపోయి నాలుగు తగల్నిచ్చాడు. 'ఆడదాని బతుకు అర్థాన్నపు బతుకు. ఎంత పెట్టిపుడితేనేం ఒహరి పంచచేరి, అణిగి ఉన్నాక?' అంది రంగ ఏడుస్తూ. రావుకి ఆ మాటలో ఏదో అర్థం తోచింది. అతని చిక్కులన్నీ విడిపోయినట్టయింది. ఎప్పుడూ లేనిది రంగని దగ్గరకు తీసుకుని అనునయించాడు.

'అక్కర్లేదు. అవతలి కెళ్ళండి. మీరు మునపట్లాలేరు. కొన్నాళ్ళు దూరమైతే గాని నా విలువ మీకు తెలిసిరాదు. నాన్నదగ్గిరకు మండపేట పోతాను. నాకేం లేదా, పోదా?' రావు ఆమెను బతిమాలేడు.

భగవంతుడు ఆమెనోట నిజం చెప్పించి తనకు మళ్ళీ జీవం పోశాడు. ఎంతటి ఆడదయినా అణిగి మణిగి ఉండక తప్పదు. ఎంత మేనత్త కొడుకయినా మొగుడు మొగుడే. ఎంత చదువుకున్నవాడు వాడి ఖర్మ కాలిపోతే, పెళ్ళాం చేత ఉద్యోగం చేయించుకుంటాడా? అందులో యీవిడ వేషాలు ఏమాత్రం తెలిసివచ్చినా గడప దాటనిస్తాడా? అక్కడితో ఆగుతుంది మనోరమ నాటకం. అంతటితో కుదురుతుంది మనోరమ సంకటం. గాలిపడగలా సోలిపోడం నీటి నురగలా తేలిపోడం ఇంకెన్నాళ్ళు? అన్నీ చప్పగా కుదిరి మొహంనిండా ముసుగు వేసుకుని ఏ వంటింట్లోనో ఏ మండీ మండని కర్రల పొయ్యి దగ్గరో ఏడుస్తుంటే అప్పుడు చూడాలి ఆ మోహినీ అవతారం! ఆ ఒళ్ళు తెలియని కబుర్లూ, ఆ నవ్వులూ బస్సులో ఉన్నా బస్సును మించిన ఆ స్పీడూ,



ఇంకెన్నాళ్ళు! ఆవిడ రాజీనామా పత్రం కాలేజీకి వచ్చిననాడు తనకు పుట్టినరోజని బొంకి వెంకటేశ్వ్రరావు ఘనంగా టీపార్టీ చేశాడు.

5

ఆవిడ రిజైనుచెయ్యడం ఖాయమే అని తెలిసిననాడు ఆ కాలేజీ విద్యార్థులలో సంచలనమే చెలరేగింది.

"బంకిమ చంద్ర చట్టోపాధ్యాయ సంపుటీకరించిన 'బిబిధ ప్రబంధ' ఆవిడే చెప్పాలి. గిరీశ చంద్రఘోష్ రచించిన 'బుద్ధదేబ చరిత'లో పద్యాలు ఆవిడ నోటనే వినాలి. టాగూరు గీతాంజలి ఆవిడే బోధపరచాలి. ప్రపంచ సాహిత్యంలో ప్రసిద్ధ భాగమై కూచున్న వంగభాషా వాఙ్మయం వన్నె చిన్నెలు ఆవిడే చాటాలి. మరో లెక్చరరు దగ్గిర అవి ఆశించడం అనూహ్యం ... కనీసం యీ యేడాదయినా దీదీ కంటిన్యూ చెయ్యకపోతే మేం స్ట్రయికు చేస్తాం"అని కాలేజీ యూనియన్ ప్రెసిడెంటుద్వారా ప్రిన్సిపాలుకు కబురు వెళ్ళింది. "ఆవిణ్ణి కాపురానికి వెళ్ళనియ్యకుండా మీ గోల ఏమిటర్రా? మీరు స్ట్రయికు చేస్తే రేప్పొద్దున్న ఆవిడ మొగుడొచ్చి ఆకలి దప్పులుమాని కాలేజీ గేటు దగ్గిర సత్యాగ్రహం ప్రారంభించగల్డు" అన్నాడాయన నవ్వుతూ. కుర్రాళ్ళను సమాధాన పరచి పంపే సరికి అతని తల ప్రాణం తోక్కి వచ్చింది.

ఇక 'సెండాఫ్' నాడు ఎంత హడావుడి జరిగిందో చెప్పలేం. పిల్లలందరూ ప్రెజంట్లతో ఆమెను ఉక్కిరి బిక్కిరి చేశారు. ఆ సాయంకాలం ఆవిడ వెళ్ళిపోతుందని తెలిసి—సాయంకాలం అవుతున్నది కొద్దీ పిల్లల మొహాలమీద మరింత స్పష్టంగా విచార రేఖలు కనుపింపజొచ్చాయి. ఒకరిద్దరు ఉండబట్టలేక ఏడ్చేశారు కూడాను.

'మనవాళ్ళ పెళ్ళిళ్ళలో అప్పగింతలంటూ ఒక తంతు పెడతారు. దాన్లో ఉన్న 'స్పిరిట్' ఏమిటో ఇవాళ తెలుస్తోంది" అన్నాడు భాస్కరమూర్తి. ఫేర్‌వెల్‌పార్టీ, ఫొటో, టీ పార్టీ అన్నీ అయిపోయాక మనోరమ భర్తను తీసుకు వచ్చి వెంకటేశ్వ్రరావుతో అంది.

"మా పెళ్ళికి మీ రొక్కరే రాలేదు. నే నెంత డిసెపాయంట్ అయానో తెలుసా? వీరేనండీ నేను చెబుతూ వచ్చానే ... ఎకనమిక్సు లెక్చరరు ... ఈ కొద్ది నెలల్లోనే పిల్లల దగ్గిర చాలా బాగా చెబుతారని పేరు గడించారు. రోజూ మా కోట్రా వైలరు. ఎటొచ్చీ కొంచెం మితభాషిగాని మనిషి చాలా మంచివారు. కదుటండీ, రావుజీ, మిమ్మల్నే!"

రావుకి ముచ్చెమటలు పోశాయి. లోలోపల గొణుక్కున్నాడు :

"ఉద్ధరించావుగాని వెళ్ళు ... కావాలంటే వందనుంది ఎక్స్ట్రాల చేత అప్పగింత పాట పాడిస్తాను.

ఈ కాలేజీనీ, ఈ పరిసరాల్నీ ఇంతవరకు నువ్వు పావనం చేసింది చాలు... ఇక వెళ్ళు చిట్టితల్లీ!"

మర్నాడు వెంకటేశ్వ్రరావు చాలా హుషారుగా వున్నాడు. ఆవాళ బస్సులో ఎప్పట్లా మనోరమ లేదు. "ఇప్పటికి భగవంతుడి దయవల్ల ఈ శని వదిలింది. నిజంగా యింత త్వరలో యీ పీడ పోతుందనుకోలేదు. ఎప్పుడో ఋషులు రాసి పెట్టేశారు ఆడది తిరిగి మగాడు తిరక్కా చెడకూడదన్నారు. అబల అన్నారు, చపల అన్నారు. అనుక్షణం ఒకరి రక్షణలో ఉండాలన్నారు. ఇలాగే గద్దెనెక్కమన్నారా, బల్లగుద్ది చెప్పమన్నారా? ప్రతీ ఆడదానికి ఎంత రాసిపెట్టి ఉండాలో మనోరమకి అంతే జరగాలి, అంతే జరిగింది కూడాను!"


రావుకి తన ఆనందం ఎవరితోనైనా పంచుకోవా లనిపించింది. భాస్కరమూర్తి మొహం ఎత్తి చూశాడు. అన్నీ కోల్పోయినట్టుంది అది.

"ఇన్నాళ్ళూ కీ బస్సులో నేనే ప్రయాణం చేశానా అనిపిస్తోంది. ఒక్క రోజుకే ఇంత బోరింగుగా ఉంటే యింక ముందు ముందెలాగో ..."

మోహన్ కూడా ఆ పక్క సీట్లోనే ఉన్నాడు. ఆఖరికి అతను కూడా అన్నాడు.

"మనోదీదీ ఉండేదికాబట్టి మనకేం తెలిసేదికాదు... ఇక ఈ ఇంజను హోరూ ఈ బ్రేకుల చప్పుడూ కండక్టరు కేకలూ యివి తప్ప మనకి మరొకవి వినపడవు... ఈ దిన దిన గండం ఇక మనవల్ల కాదు. కాలేజీ దరిదాపుల్లోనే ఒక రూం చూదండి భాస్కరమూర్తి గారూ, అక్కడే మనం వడి ఉందాం."

రావు ఖాళీగా ఉన్న వెనక సీట్లోకి వెళ్ళిపోయాడు. అక్కడే కూచుని దీర్ఘంగా ఆలోచించాడు. తర్వాత వారం పదిరోజులు చాలా చోట్ల కూర్చుని దీర్ఘంగా ఆలోచించాడు. మనోరమ నిజంగా వెళ్ళిపో



అక్కడే ఉంటే మనోరమ ఒక్క చోటే ఉండేది. ఆమె వెళ్ళిపోయాక ఎక్కడ చూసినా మనోరమే!

ఆవాళ క్లాసులో కూచున్నా పాఠం చెప్పక వెంకటేశ్వర్రావు స్టూడెంట్సుకి ఏదో వర్కిచ్చి ఎప్పట్లా దీర్ఘంగా ఆలోచిస్తూ కూచున్నాడు. లెక్చర్‌హాలు గేటుదగ్గర బంట్రోతు ఉన్నాడు. వాడి మొహం చూస్తే ఏమంటున్నట్టు ఉంది? "కష్టం సుఖం తెలిసిన తల్లి... వెడుతూ వెడుతూ వదిరూపాయల నోటు చేతిలో పెట్టింది. వెయ్యేళ్ళు వర్ధిల్లాలి" కిటికీలోంచి దూరంగా చూస్తే ప్రిన్సిపాలు కనిపించాడు. ఆవాళ స్టాఫు కామన్‌రూంలో ఏమన్నాడు? "నా సర్వీసులో ఎందరో లెక్చరర్సుని చూశాను. ఇంత బాధ్యతాయుతంగా పని చేసిన వ్యక్తిని ఎక్కడా చూళ్ళేదు. ఇంత కొద్ది కాలంలోనే ఈ కాలేజీలో ప్రతి అంగుళానికి ఆత్మీయురాలై పోయింది. ఆమెను ఒక క్షణం మరచినా మనం మనుషులమే కాము!"

దూరంగా హెడ్‌క్లార్కు ఎక్కడికో హడావిడిగా వెడుతూండడం కనిపించింది. వాణ్ణి చూస్తే మొదట్నుంచీ మంట. లేకపోతే ఆవాళ కుర్రాళ్ళ దగ్గర ఆవిణ్ణి వెనకేసుకొస్తూ ఏమిటి కూశాడు?

"మీరింకా యింకా ఆవిణ్ణి యిక్కడ వుండిపొమ్మని బలవంత పెట్టడం బాగులేదబ్బాయిలూ! ఇంతగా అభిమానించిన యిందరు పిల్లల్ని ఒక్కసారి వదిలిపెట్టి వెళ్ళ యిందామెడానికి ఆ తల్లి ఎంత కుమిలిపోతోందో మీకేం తెలుసు? కాని అంతా అలా వచ్చింది. ఈవిడ అత్తగారికి కీళ్ళ వాతంతో ఒక్కసారి రెండు కాళ్ళూ పడిపోయాయి. కళ్ళుకూడా సరిగా కనబడవు. నిత్యం ఎవరో మనిషి ఆసరా కావాలిట. ఏం చెయ్యమంటారు చెప్పండి, ఆవిడకి ఏది ముఖ్యం?"

"అస్తమానూ నవ్వేదానికి, తేలికయిన విలువగలదానికి ముఖ్యమూ, అముఖ్యమూ అంటూ ఏముంటాయి, అంతా నాటకం!" అనుకున్నాడు రావు. దానికి వచ్చింది ఒకటే ఒకటి– మోసం, మాయ! లేకపోతే ఇంత మందిని ఒక్కసారి సమ్మోహితుల్ని చెయ్యగలదా? వెంకటేశ్వర్రావు విద్యార్థులందర్నీ ఒక్కసారి తేరిపార చూశాడు. ఆ వెనక బెంచీవాళ్ళు తన గురించి చెప్పుకుని నవ్విన ట్లయింది. మనోరమ ప్రవర్తన మంచిది గాదని తాను చూచాయగా ఆ మధ్య అనబోతే కొట్టినంత పని చేసిన రౌడీ వెధవలు వాళ్ళే కదూ! పట్నానికి వెళ్ళి స్టేషను దాకా ఆ దంపతుల్ని దిగబెట్టివచ్చిన దౌర్భాగ్యులే కదూ యీ ముందు బెంచీ వాళ్ళూ!

లాభం లేదు, మనోరమ కలుషితం చేసి పారేసిన ఆ సంస్థలో తన కిక స్థానం లేదు! ఈ కరువు, కాటకాలు ఎందుచేత ఏర్పడుతున్నాయో దీన్ని ఎందుకు కలికాల మంటారో రావుకి ఒక్కసారిగా అర్థమయింది. లెక్చరు క్లాసులోంచి ప్రిన్సిపాలు రూంలోకి ఒక అంగలో వెళ్ళి రిజిగ్నేషను దాఖలు చేశాడు; ఏవో లేనిపోని కారణాలు జతచేసి, ప్రిన్సిపాలు అన్నాడు.

"లాభంలేదు ... మిమ్మల్నిలా మధ్యలో రిలీవ్ చెయ్యలేము!"

"మనోరమగార్ని ఎల్లా రిలీవ్ చేశారు?"


"అది అడగడానికి మీ కధికారం లేదు. కావాలంటే పైకి రాసుకోండి. ఒక మన్త్ నోటీసయినా లేకుండా మిమ్మల్ని ఒదల్లేము!"

రావుకి పట్టుదల పెరిగింది. ఒక నెల జీతం కట్టి అప్పటికప్పుడు రిలీవు చేయించుకున్నాడు. 'ముందూ వెనకా చూసుకోకుండా సత్సాంప్రదాయాల్లేని యిలాంటి సంస్థల్లో దూరినందుకు యిదే ప్రాయశ్చిత్తం. కానియ్యి. పతివ్రత అయిన భార్యా, ధనికుడైన మామగారూ నా కున్నారు. ఈ ముష్టి జీతం ఒకటేనా నాకు ముఖ్యం, మన శ్శాంతిగాని!'

వెంకటేశ్వర్రావు యింటికి చేరే సరికి రంగ రైల్లో ఉంది. ఆమె బదులుగా గూట్లో చీటీ ఉంది:

"బొత్తిగా పలకరిస్తే కసిరికొట్టే మీ వ్యవహారం ఈ వారం రోజుల్నుంచి చూస్తుంటే నేనూ ఓ మనిషి ననిపించుకోడం ఎలాగో ఇవాళకి తెలిసింది. నాన్న ఆస్తి రెండు మేడలూ అమ్మేసి నా పేర వేసేసి కాశీ వెళ్ళిపోయాట్ట, ఇవాళే కాయితాలూ, ఉత్తరమూ వచ్చింది. రక్షించాడు. నేనూ, నా నగలూ, నా ఆస్తీ క్షేమం. ఇంక నా ఏడుపు నాదే అనుకుంటే నాకు మరింత క్షేమం. నాతో మీ సంబంధం తెగిపోయిందని యిందు మూలముగా తెలియ జేస్తున్నాను గనక మీరు మరో పెళ్ళి చేసుకోవచ్చు. ఇంట్లో కనిపెట్టుకుని వుంటుంది గనక మోకాళ్ళ వరకు తెగిన వనిత నెవతెనైన పెండ్లాడిన బాగుండునని నా సలహా."

□□□



ఒకాయన టాక్సీ ఎక్కి రోడ్లన్నీ తెగ తిరిగి, చివరికి డబ్బు యివ్వాలేనని తెలుసుకొన్నాడు ఓ చోట "అవు, ఇక్కడ దిగిపోతా" నన్నాడు. టాక్సీ ఆగింది

"నీ దగ్గర అగ్గిపెట్టె వుందా? పోనీ టార్చిలైట్?"

"లేవండీ. ఏం?"

"వెనక సీటులో ఒక వంద రూపాయల నోటు పడిపోయింది. మడతెట్టి చేత్తో పట్టుకున్నాను. ఇంతలోకే ఏమైందో వెతకాలి ఉండు; ఆ సిగరెట్టు కొట్లో అగ్గిపెట్టెకొని తెస్తాను" అని వెళ్లాడు ఆసామీ.

అతను అగ్గిపెట్టె కొనుక్కొచ్చే సరికి, అతను కొన్నట్టుగానే, అక్కడ టాక్సీలేదు. ఆ డ్రైవరూ లేడు!



DA-65/449

మీ బంగారాన్ని మేము శుభ్రపరుస్తాము. దానిని 23.83 కారట్ల మేలిమి రూపంలోకి మేలిమి పరచి శుభ్రపరుస్తాము. మన పవిత్ర భారతదేశానికి సేవచేయడానికి దానిని 15 సంవత్సరములు వినియోగించిన పిమ్మట మీ బంగారాన్ని శుభ్రపరుస్తాము. సేవా వేదికపై పవిత్రీకృతముగావించబడిన పిమ్మట మీ బంగారం మీకు, మేలిమి పరచబడి, మెరుగు పెట్టబడి, తిరిగి యివ్వబడుతుంది.

దేశానికి సేవ చేయండి–బంగారు బాండ్లు కొనండి

ఇంతవరకు ఎన్నడూ మన దేశానికి బంగారం యొక్క అవసరం యింతగా కలగలేదు. మనకు విదేశీ మారకపు కొరత చాలా ఎక్కువగా ఉంది. ప్రభుత్వమువారి వద్ద ఎక్కువ బంగారం ఉంటే అంతే ఎక్కువ విదేశీ మారక ద్రవ్యం అన్నమాట. దేశ రక్షణ కొరకు, విదేశాల నుంచి ఆయుధాలను కొనడానికి, మన పరిశ్రమల కవసరమయిన యంత్రాలను, ముడిసరకులను కొనడానికి బంగారం, మీ బంగారం మాకు అవసరం. మన దేశం, మన ఉద్యోగములు, మన జీవితము కూడా, ప్రభుత్వము వారికి యిప్పుడు ఎక్కువ బంగారం దొరికినట్లు చేస్తేనే క్షేమంగా ఉంటాయి.

ఈ అత్యవసర పరిస్థితిలో మీ బంగారాన్ని దేశానికి అప్పుగా ఇవ్వమని ప్రభుత్వం మిమ్మల్ని అభ్యర్థిస్తోంది. మీ బంగారాన్ని అమ్మివేయమని కాని, ఊరకనే యిచ్చివేయమని కాని ప్రభుత్వం మిమ్మల్ని అడుగుటలేదు. మీరు బంగారాన్ని, బంగారు నగలను కాని, బంగారు కాసులను కాని, యిచ్చినప్పుడు మీకు బంగారు బాండ్లు ఇవ్వబడతాయి. బంగారాన్ని ప్రభుత్వం 23.83 కారట్ల రూపంలోకి మేలిమిపరుస్తుంది. (సాధారణంగా 18 నుండి 22 కారట్ల మేలిమిలోనే ఉన్నాయి; కాసులు 23 కారట్ల బంగారముతో చేయబడ్డాయి). మేలిమి చేసిన బంగారపు తూకం ఆ బాండుపై తెలియజేయబడుతుంది. 15 సంవత్సరముల తర్వాత ఈ మేలిమి బంగారమే మీకు యివ్వబడుతుంది. మీరు బంగారు బాండ్లకొరకు బంగారు ఆభరణములను యిచ్చినచో, 15 సంవత్సరముల తరువాత మీకు యివ్వబడే బంగారాన్ని, ఎన్ని కారట్ల మేలిమిలోని ఆభరణములలోనైనా మార్చుకొనవచ్చును.

మీరు బంగారు ఆభరణములను యిస్తే, ప్రభుత్వము మీకు నగలను చేయించుకొనుటకయిన పేర్పుల ఖర్చు, 10 గ్రాముల మేలిమి బంగారానికి 3 రూ/- చొప్పున, బాండ్లలో యిస్తుంది. (ఒక తులం 11.66 గ్రాములు తూగుతుంది.) ప్రతి సంవత్సరము 10 గ్రాముల మేలిమి బంగారానికి 2 రూ/- చొప్పున అర్పిస్తారు. ఈ సొమ్ము రాబడి పన్నునుంచి మినహాయించబడుతుంది. బంగారు బాండ్లకు సంపదపన్ను విధింపబడదు. బహుమతి పన్ను, ఎస్టేటు సుంకములనుండి కూడ యివి మినహాయింపబడుతాయి.


మీరు బంగారాన్ని యిచ్చినప్పుడు, మీరు దానిని ఎలా సంపాదించారో ఎవరూ ప్రశ్నించరు. రాబడి పన్ను చట్టము, స్వర్ణ నియంత్రణ విధానము, కస్టమ్స్ రెగ్యులేషన్స్ వీటిక్రింద ఎట్టిచర్య తీసుకొనబడదు. బంగారంవలెనే, బంగారు బాండ్లను సెక్యూరిటీలుగా పెట్టి మీరు బ్యాంకులనుండి సొమ్మును తీసికొనవచ్చును.

బంగారు బాండ్లు బెంగుళూరు, బొంబాయి, కలకత్తా, మద్రాసు, నాగపూరు, న్యూఢిల్లీలలో ఉన్న రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియాలోను, స్టేట్ బ్యాంకు యొక్క బ్రాంచీలలోను దాని అనుబంధ బ్యాంకులలోను యివ్వబడుతాయి.

మీ బంగారాన్ని, బంగారు కాసులను, స్వర్ణాభరణములను, బంగారు బాండ్లలోనికి మార్చుకొనండి. దేశానికి సేవ చేయడానికి మీ బంగారాన్ని యివ్వండి.

ఆర్థిక మంత్రాలయము, భారత ప్రభుత్వమువారిచే ప్రకటింపబడింది.

దేశ రక్షణమునకు ... మీ బంగారాన్ని పెట్టుబడిగా పెట్టండి



చదువుకున్న కమల

ముప్పాళ రంగనాయకమ్మ

ప్రియమైన పద్మా!

ఇంతకాలానికి ఇలా అనుకోకుండా నా వుత్తరం చూసి చాలా ఆశ్చర్య పడతావేమో! నేను మాత్రం నాలుగైదు నెలలనుంచీ నీకు కొంచెం పెద్ద వుత్తరం రాయాలనే ఆలోచిస్తున్నాను. ఎప్పుడో రెండేళ్ళ క్రిందట చంటివాడు పుట్టినప్పుడు రాశాను నీకు. నీ సంతోషం వెల్లడిస్తూ జవాబు కూడా రాశావు. అప్పటికదే ఆఖరైంది.

మనం బొత్తిగా సంసారాల్లో మునిగి మనస్సు విప్పి కష్టం సుఖం చెప్పకోగలిగే అవకాశాన్ని కూడా విస్మరిస్తున్నాం.

"ఇప్పుడు నీ కొచ్చిపడ్డ కష్టం ఏమిటి?" అంటావేమో!

"చిన్నా పెద్దా తారతమ్యం తప్పితే సాధారణంగా ప్రతీ వ్యక్తికీ ఏవో చీకులూ — చికాకులూ

వుంటూనే వుంటాయేమో! అయినా కష్టాలూ సుఖాలూ మనుషుల తత్వాల్ని బట్టి రకరకాలుగా వుంటాయి. నేను సీరియస్‌గా తీసుకుని బాధపడే విషయాన్ని నువ్వు చాలా లైట్‌గా కొట్టిపారెయ్యొచ్చు. అలాగే నువ్వు లక్ష్య పెట్టేదాన్ని నేను నిర్లక్ష్యమూ చెయ్యొచ్చు.

కానీ నన్ను నువ్వు బాగా అర్థం చేసుకోగలవన్న విశ్వాసంతోనే నా స్వవిషయాలన్నీ నీకు రాయాలనుకున్నాను నీకు రాయడంవల్ల నాకు వచ్చే ఫలితమేమిటో కూడా నాకు తెలీదు. నా అభిప్రాయాల్ని నువ్వెంతవరకూ సమర్థించగలవో తెలుసుకోవాలన్న కోరిక మాత్రం బాగా వుంది.

ఇలా వుపోద్ఘాతం రాస్తూ కూర్చుంటే నీకేం అర్థంకాదని నాకు తెలుసు. అయినా అసలువిషయం చెప్పాలంటే — ఏం చెప్పాలో ఎలా చెప్పాలో—మొదలూ కొసా తోచటం లేదు.

పద్మా! జీవితం గురించి—ముఖ్యంగా సంసార జీవితం గురించి — నేనేం అందీ పొందని పిచ్చి పిచ్చి కలలు కనలేదు కాలానికి తగినవిధంగా విద్య మనకు నేర్పిన జ్ఞానంతో – కొన్ని ఆదర్శ పూరితమైన అభిప్రాయాలు మాత్రం ఏర్పరచుకున్నాను. ఉన్నంతలోనే యింటిని సుఖశాంతులకు ఆటపట్టు చేసుకోవాలని ఆలోచనలు చేశాను.

మధుమూర్తిని నేను చాలా యిష్టపడి పెళ్ళి చేసుకున్నానన్న సంగతి నీకూ తెలుసు.

కానీ పెళ్ళికి ముఖ్యం' ప్రేమ ఒక్కటే అంటే యిప్పుడు ఒప్పుకో బుద్ధి కావటంలేదు. అది సమగ్రమైన ఆలోచన కాదని మాత్రం ఇప్పుడనిపిస్తోంది. అంటే నేను మధూని పెళ్ళి చేసుకున్నందుకు పశ్చాత్తాపపడుతున్నానని మాత్రం నువ్వనుకోకు. అనుభవపూర్వకంగా ఆలోచిస్తే కుటుంబ జీవితంలో సుఖశాంతులు పొందటానికి ప్రేమ ఒక్కటీ చాలదన్నదే నా ఉద్దేశం.

వధూవరులు జంటగా ఏ కొండలకో కోనలకో రెక్కలు కట్టుకు ఎగిరిపోలేరు కదా? కుటుంబంలో అందరి మధ్యా వుంటూ – అందరి అభిమానాలూ అధికారాలూ అనుభవిస్తూ జీవితమంతా కొన్ని హద్దుల మధ్య బంధించబడే వుంటారుకదా?

ప్రేమ అంటూ ఒక్క వ్యక్తినీ మాత్రం ఎన్నుకుని ఆ వ్యక్తి చుట్టూ వున్న నరకాన్ని నిర్లక్ష్యం చెయ్యటం అవివేకం కాదా?

అయితే నేను అంత అవివేకంగానూ ప్రవర్తించి పొరపాటే చేశానని అనుకోవటంలేదు. సాటి మనుషులు కొంతవరకైనా కనీసపు ధర్మాలతో—బాధ్యతలతో – వ్యవహరిస్తారని విశ్వసిస్తాంగానీ — అందరి మనస్తత్వాలూ వేటాడి తెలుసుకోవటం సాధ్యం కాదుగదా ?

నాకు పెళ్ళయి ఏడేళ్ళు నిండాయి. ముగ్గురు బిడ్డల తల్లినయ్యాను. దాదాపు జీవితంలో ముఖ్య ఘట్టాలన్నీ గడిచిపోయినట్టే.

కానీ ఈ గడిచిన కాలం నన్నొక అనామకురాల్ని చేసి కూర్చోబెట్టిందంటే అతిశయోక్తి కాదు. సిగ్గులేకుండా నేనీ మాట ఎలా చెప్తున్నానని నువ్వు ఆశ్చర్య పడచ్చు. కానీ నీ దగ్గిర నా మనస్సు దాచుకుని— నన్ను నేను వంచన చేసుకునే భాగ్యానికి – ఈ వుత్తరం ప్రారంభించటం ఎందుకు ?

ఒక ఇంటి కోడలిగా ... ఇల్లాలిగా ... భార్యగా ... తల్లిగా ... స్త్రీ చెయ్యాల్సింది ఎంతో వుంటుంది. కానీ – ఈ ఇంట్లో మాత్రం నేను చేయగలిగేదేమీ లేకుండా పోతోంది.

దానికి కారణాలు చాలా వున్నాయి. ఎన్నివున్నా నేను చెప్పేది మాత్రం మధుమూర్తి గురించే.

మధూ చదువుకున్న వాడూ – తెలివైనవాడూ – మంచిచెడ్డలు అర్థంచేసుకోగలవాడూ అని భావించాను. నా భావన, ఈ నాటికీ పొరపడలేదు. కానీ మధూచుట్టూ వున్న వాతావరణం చాలా సంకుచితమైంది – వ్యక్తులు బొత్తిగా హృదయ వికాసం లేనివాళ్ళు:

ఇలాంటి పరిస్థితుల్లో మధూ నా అభిప్రాయాలతో ఏకీభవించడం తప్పితే – వాటిని ఆచరణలో పెట్టినా ఆశలు తీర్చలేని బలహీనతతో సతమతమౌతున్నాడు. ఆయన శక్తిసామర్థ్యాలు ఎందుకూ పనికిరానంత పేలవమై పోతున్నాయి.

కాని అలాంటి బలహీనతల్ని నేను క్షమించలేను పద్మా !

అందుకే—మధుని ఎంత అర్థం చేసుకుంటున్నా ఈ ఆవేదన నాకు తప్పటంలేదు. ఎంతో సహజమయిన ఆశలతో అత్తవారింట కాలుపెట్టిన నేను ఒక్క ఏడాది తిరక్కుండానే చాలా విషయాలు తెలుసుకున్నాను. ఏడేళ్ళుగా నాకు సరిపడని పరిస్థితులతో రాజీపడలేక, విస్మరించనూలేక నిరాశాపూరితంగా రోజులు గడుపుతున్నాను.

నా పెళ్ళిలో మా అత్తగారినీ, మామగారినీ, ఆడబిడ్డనీ నువ్వు చూశావు. బాగానే గుర్తు వుండి వుంటారు. అవునా?

నీకు కొన్ని సంఘటనలు ఎత్తి చెప్తే మా యింటి పరిస్థితి అంతా అవగాహన అవుతుంది. వ్యక్తులందరూ అర్థమౌతారు. అందుకని...'

—కలం ఆగింది.

ఆలోచనలో పడింది కమల.

స్నేహితురాలికి రాస్తోన్న వుత్తరంలో తన సంసారాన్ని చిత్రించాలి. వ్యక్తులందర్నీ పాత్రలుగా చేయాలి.

ఏడేళ్ళ తన కాపరాన్ని సింహావలోకనం చేసుకుంటోన్న దానిలా కూర్చుంది.

పావుగంట గడిచిందో లేదో— "అమ్మా! అన్నయ్య కొట్టాడే!" అంటూ ఏడుస్తూ వచ్చింది ప్రేమ. అప్రయత్నంగా దగ్గిరికి తీసుకొంటూ లేచింది కమల.

● ● ●

కమల అత్తవారింటికి వచ్చిన కొత్తల్లో మొట్టమొదటగా నచ్చని విషయం—ఇంట్లో వాళ్ళంతా తనని పిల్చే తీరూ — తనపై పెట్టుకున్న దృష్టీనూ.

"ఒస్సే కమలా! ఏమే కమలా!" అని అత్తగారూ ఆడబిడ్డా బొత్తిగా అంతస్థు తక్కువ మనిషిని ఈసడింపుగా పిల్చినట్టు పిలుస్తోంటే ఎబ్బెట్టుగా తోచేది. అత్తగారేం తనకు మేనత్త కాదు. కనీసం దూరపు చుట్టరికమన్నా కాదు— తనమీద అంత చనువు ప్రదర్శించటానికి.

పోనీ తను పల్లెటూళ్ళో పుట్టి పెరిగి - చదువు సంధ్యల్లేక పన్నెండేళ్ళకే అత్తారింటికొచ్చిన చిన్నపిల్లా కాదు.

అప్పటికి కమలకి ఇరవై సంవత్సరాలూ నిండాయి.

మామగారు కూడా ఆడవాళ్ళలాగే కోడల్ని "ఏమేవ్! ఒసే! నిన్నే!" అంటూ పిలుస్తోంటే కమలకి చాలా జుగుప్స కలుగుతుంది ఈ నాటికీ. తనభర్త అయినా-ఎంతో చనువుగా-ఏకాంతంగా వున్నప్పుడు తప్పితే - అలాంటి సంబోధన చెయ్యడు.

అలాంటిది — పరాయి వ్యక్తుల్లాంటి అత్తమామలూ ఆడబిడ్డా బొత్తిగా చౌరవగా వ్యవహరిస్తోంటే కమల ఓ రోజు తన వుద్దేశ్యం కాస్తా వెల్లడించేసింది - సమయం చూసి.

"అమ్మా! సూది కన్పించటం లేదే!" అంది ఆడబిడ్డ కాంతం వంటింటిగూట్లో వెదుకుతూ.

శేషమ్మ జవాబు—"రాత్రి అది పూలు గుచ్చుకున్నట్టుంది. దాన్ని అడుగు."

కాంతం గదిలోకి వచ్చింది — "ఒసే! నీ దగ్గిర సూది వుందా?" అంటూ.

కమల సూది అందించింది- "కూర్చోండి వదినా!" అంది. తనూ పక్కనకూర్చుంది. కాంతం మధుమూర్తికన్నా రెండు సంవత్సరాలు పెద్దది. అప్పటి కింకా పిల్లల్లేరు. అత్తింటికన్నా పుట్టింటే ఎక్కువ రోజులు వుంటుంది.

"మిమ్మల్నో మాట అడగనా?" నవ్వుతూ చూసింది కమల.

"ఏమిటేవ్ అది?"

"ఏమీ అనుకోరుగా?"

కుట్టటం ఆపి ఆశ్చర్యంగా చూసింది కాంతం.

కమల నిబ్బరంగా ఆడబిడ్డ మొహంలోకి చూస్తూ అంది... "ఒసే—ఒసే—అని కోడల్ని అత్తింట్లో వాళ్ళు పిలవటం బొత్తిగా పల్లెటూళ్ళలో... పూర్వం వుండేదనుకుంటాను. ఏమో! మావాళ్ళలో అలా పిలవటం నేను వినలేదు. మా వదిన్ని మా అమ్మగానీ, మేం గానీ అలా పిలవం."

కాంతం తెల్లబోయింది. అంతలోనే నవ్వు మొహం పెట్టుకుని— "ఏమని పిలుస్తారూ?" అంది సాగదీస్తూ.

"ఏమమ్మా సరస్వతీ అనో-లేకపోతే అమ్మాయ్ సరస్వతీ అనో అంటుంది మా అమ్మ. మా నాన్నయితే "అమ్మా సరస్వతీ" అంటూ మమ్మల్ని కూడా పిలవనంత మర్యాదగా పిలుస్తారు." కమల తేలిగ్గా నవ్వుతూనే మాట్లాడింది — "మామయ్య కూడా ఒసే కమలా అని పిలిస్తే నాకేమిటో బాగా అన్పించలేదు మరి..." అనేసింది.


కమలకి చిన్నతనం నుంచీ మనసులోని మాట సూటిగా మాట్లాడటం బాగా అలవాటు.

కాంతం ఏమీ జవాబు చెప్పలేదు.

అప్పటికప్పుడే జవాబు రాబట్టాలని కూడా కమల అనుకోలేదు.

కాంతం లేచి వెళ్ళిపోయింది.

కాస్సేపటికి శేషమ్మ గట్టిగానే అనుకుంటోంటే కమలకి విన్పించింది—"వాళ్ళంతా గొప్ప బస్తీ వాళ్ళూ—చదువు సంధ్యలు వరిగిన వాళ్ళూను. మన కవన్నీ ఎలా



ఫోటో తీస్తున్నపుడు కదలద్దని తమకి అప్పుడే మనవి చేసి ఉన్నాను

తెలుస్తాయమ్మా? ఏదో ఎలా నోటికి వస్తే అలా వాగుతాం.'

కమలకి కొంచెం భయం వేసింది.

దాని వెనకాల సిగ్గు కూడా ముంచుకొచ్చింది. తను అత్తగారితో దెబ్బలాడిందని మధుమూర్తి అనుకుంటాడేమో! కాపరానికి వచ్చి ఒక్క నెలకూడా కాలేదు. పోనీ తన మనస్సులో మాట కాస్తా అడిగేసింది. తర్వాత వాళ్ళిష్టం. శేషమ్మ తన స్వగతం చివర మరో మాటకూడా అంది— 'ఒసే అసే అనకపోతే కోడళ్లాన్ని ఇంకెలా పిలుస్తారూ? విడ్డూరం!'

కమల అప్రయత్నంగానే మొహం చిట్లించుకొంది—"కోడల్ది" ఎంత కటువుగా వుందా మాట! తను కోడల్ది కాబట్టి వాళ్ళంత చులకనగా వ్యవహరిస్తారన్నమాట.

తనలో తను తర్కించుకోవడం తప్ప అత్తగారి మాటలలో జోక్యం కల్గించుకోలేదు, నిజానికి అప్పట్లో అలాంటి ధైర్యమూ లేదు.

మూర్తితో మాత్రం విషయమంతా చెప్పింది. "నేను మంచి వుద్దేశంతోనే అడిగాను మరి. అత్తయ్యకి కోపం వచ్చినట్టుంది. కోడల్ది అంటూ ఈసడించి మరీ మాట్లాడారు."

కమల చిన్నబుచ్చుకోవడం మధుమూర్తి బాగా గ్రహించాడు. కమల భుజంమీద చేయివేసి అనునయిస్తూ — "నీ వుద్దేశం నా కర్థమైంది కమలా! నువ్వు కూడా కొన్ని విషయాలు గ్రహించి మసులుకోవాలి. మీ ప్రాంతాలకూ మా ప్రాంతాలకూ ఆచార వ్యవహారాలలో ఎన్నో తేడా లున్నాయి. నువ్వు ఎంతో పెద్దదిగా చేసుకుని బాధపడే ఈ విషయం మాకు ఎంతో చిన్నది. కోడల్ని 'ఏమమ్మా' అంటూ మన్నన చేయటం మా కుటుంబాలలో చాలా అరుదు. అది తప్పా ఒప్పా అని విమర్శకు దిగకు. ఆ మంచి చెడ్డలు వాళ్ళకి అర్థంకావు. పైగా నీ గురించి తప్పుడభిప్రాయాలు కూడా ఏర్పర్చుకుంటారు. నా మాట విను. ఈ విషయం నీకు అయిష్టంగా వున్నాసరే భరించక తప్పదు మరి. అలవాటైపోతే నీకా పిలుపులు సామాన్యంగానే వుంటాయి. అయినా నీకు తెలీందేముంది కమలా? మనసుల్లో అభిమానాలుండాలిగానీ నోటితో ఎలా పిలిస్తేనేం? ఇలాంటి చిన్న విషయాలను మనసులో వుంచుకోవచ్చునా?"

అన్నాడు. అది కేవలం ఓదార్పులాగే కాకుండా కమల కొంచెం సమర్థింపు దృష్టి నేర్పింది. కోడలి అయిష్టం తెలిసికూడా అత్తమామలు ఎప్పటిలాగే వ్యవహరించటాన్ని అలవాటుగా సవర్థించుకోగలిగింది. అయినా అత్తవారింట్లో తనని 'ఏమే' అని పిలవగలిగే అర్హత భర్తకి తప్పితే ఎవరికీ వుండదన్న అభిప్రాయాన్ని మాత్రం ఏ నాటికీ మార్చుకోలేదు కమల.

• • •

కోడల్లాని స్థానంలో కమలని అక్షరాలా కోడల్దానిలాగే వుంచింది శేషమ్మ.


శేషమ్మ స్వతహాగా దుర్మార్గురాలేం కాదు. కోడల్ని నానా హింసలూ పెట్టి – కోడరికం చవిచూపించి కాల్చుకుతిందామన్న దారుణమైన ఆలోచనేం ఆవిడకు లేదు.

అయితే ఆవిడ హెూదా అవిడకి వుంది. చేతి కిందికి కోడలు వచ్చి అత్తగారుగా ప్రమోషనైంది.

ముప్పై ఏళ్ళుగా యింటి ఇల్లాలి హెూదాతో కాపురం చేస్తోంది శేషమ్మ.

కోడలు వచ్చి సంవత్సరాలకు సంవత్సరాలు జరుగుతోన్నా ఆవిడ అదే హెూదా నిలబెట్టుకుంటోంది.

కమల చదువుకున్నదే అయినా- పని పాటల్, తెలీని అమాయకురాలు కాదు. చెయ్యలేని అర్భకురాలూ కాదు. అమ్మలాగా-అమ్మమ్మలాగా ఆరితేరకపోయినా నిత్యా యింటి పనులూ – వంటలూ వడ్డనలూ చక్కగానే చెయ్యగలదు. చేతకానివి నేర్చుకోగలదు. పెళ్ళయింతర్వాత చదువు మీదికీ సాహిత్యం మీదికీ పరుగులెత్తే దృష్టిని మళ్ళించుకుని – అత్తవారింటిమీద కేంద్రీకరించుకొంది కూడాను.



వృత్తిని నమ్మి, గౌరవించి, అన్యథా శరణం నాస్తిగా బ్రతికిన వో లాయరు, తన కుమార రత్నాన్నికూడా లాయర్ చేసి, తొలిసారిగా అతను స్వయంగా కోర్టుకెళ్ళొచ్చిన నాటి సాయం కాలం, విశేషాలడిగేడు.

"ఆ దిక్కుమాలిన వీరాపురం జమీందారు ఆస్తి కేసు లేదూ; ఇవాళ యిద్దరు వారసులకి రాజీచేసి సెటిల్ చేసేశా నాన్నా." అన్నాడు గర్వంగా పుత్రరత్నం.

"అయ్యో!" అని ముసలాయన ఈజీచైర్లో బాధపడ సాగాడు.

"అదేం నాన్నా!" అన్నాడు కొడుకు కంగారుగా.

"వెర్రి నాయనా, ఆ కేసుతాస్తా తగలేశావా! దాంతోనేకదరా నీకు బియ్యే నాలుగేళ్లూ బి. యల్. మూడేళ్ళూ చెప్పించేను!"

అత్తగారు చల్లగా చేసే పెద్దరికంలో ఆదర్శ గృహిణిగా తనను తను తీర్చి దిద్దుకోవాలని కుతూహల పడింది.

కానీ శేషమ్మ పెద్దరికంలో కమల అనుకున్నవి చాలా మట్టుకు అనుకోవటాలుగానే వుండిపోయాయి. అత్తాకోడళ్ళ మధ్య సర్వసామాన్యమైన మనస్పర్ధలకు కూడా తావు కల్గింది.

తెల్లారి లేచిన దగ్గిర్నుంచీ కమల ఏ పనిలో వేలు పెట్టబోయినా అత్తగారు పదే పది హెచ్చరిస్తూ—వంత పాడుతూ వుంటుంది.

'ఉల్లిపాయలు తరుగుతున్నావా? చిన్న చిన్న ముక్కలు తరుగు సుమా!' అంటుంది.

తీరా చిన్న ముక్కలు తరిగిన రోజు—'అయ్యో! అంత నలుసుల్లా తరిగావేం? కాస్త పెద్దవి తరగలేక పోయావా? పచ్చడికి ఎలాగో—కూరకి ఎలాగో—పులుసుకి ఎలాగో — ఇంకా తెలియకపోతే ఎలాగే?' అంటుంది.

'పాలు పొంగకుండా చూడు. పరధ్యాన్నంగా వుండేవు సుమీ! జాగర్త! చిటికెలో పొంగిపోతాయి.' అంటూ పాలు కాచి దించేలోవు పదిసార్లైనా హెచ్చరిస్తుంది.

కాఫీ పెట్టబోతే— 'గుండ వేసి నీళ్ళు బాగా మరగనియ్యవే! తొందరగా దించేవుసుమీ! బావుండదు.' అంటూ నిత్యం రికార్డర్‌లాగా అదే సంభాషణ వల్లెవేస్తూ వుంటుంది.

గదులు తుడుచుకొస్తోంటే— 'కాస్త పెట్టి బేడాసర్ది మరీ తుడవ్వే మునుముందు తుడిచి పూరుకుంటే బావుండదు,'

అంట్లు తోముతోంటే — 'మసి గిన్నెలు బుగ్గితోటీ, జిడ్డు గిన్నెలు తౌడు విసరువేసీ తోమాలి సుమీ! అన్నీ ఒక్కలాతోమితే బావుండవు.'

రోజుకి ఇరవై ముప్పైసార్లు — నిత్యపారాయణం లాగా అలాంటి వెనక పాటలు విని విని సహనం కోల్పోయింది కమల!

ఓరోజు కాఫీ గ్లాసులు తోముతోంటే అత్తగారు అతనే అంది— 'ఒట్టినీళ్ళతో కడిగేవు సుమీ! పాల కంపు, బావుండదు కాస్తబుగ్గి చేతికి అంటించుకుని మరీ తోము.'

'అత్తయ్యా! రోజూ చెప్పిన మాటే ఎందుకు చెప్పటం? ఏ పనెలా చెయ్యాలో నాకూ తెలుసుకదా? మీరు చెప్పకపోతే ఈ పనులేమీ నేను చెయ్యలేననే అనుకుంటారా?' అంది.

తెల్లబోయింది శేషమ్మ— 'అదేవిటీ? కాస్త పెద్దదాన్ని, మంచీ చెడ్డా చెప్తున్నాను. అదీ తప్పే!'—

కమల కాస్త నవ్వుతోనే అంది— 'తప్పో ఒప్పో ఆ ముక్క నేనేం అనలేదు. మీరు చెప్పకపోయినా నేను అన్నీ శుభ్రంగానే చేస్తాను. నాకుమాత్రం తెలీదూ? నేను చెయ్యగలనన్న నమ్మకం మాత్రం మీకు వుండదు. అంతే,—' కాఫీ గ్లాసులు పట్టుకుని బాత్‌రూంలోకి వెళ్ళిపోయింది.

కమల అన్నట్టు ఒక మనిషి ప్రయోజకత్వం మీద కొంత వరకైనా నమ్మకం వుండాలి. కానీ ఏ అత్తగారూ కోడలి పనిపాటుల్ని, కోడలి సామర్థ్యాన్ని నిరభ్యంతరంగా మెచ్చుకోదు. అందుకే అత్తాకోడళ్ళు ఎన్నేళ్ళు గడిచినా అంతంత దూరంగానే వుంటూ వుంటారు.


పనిమనిషి చేసినట్టు పైపైన చిల్లర మల్లర పనులు చేయటానికి తప్పితే — బాధ్యతగల వంటలూ వడ్డనలూ కోడల్ని కలగజేసుకోనివ్వదు శేషమ్మ.

కోడలు అన్నీ అమర్చి పెడితే పొయ్యిముందు పీట వాల్చుకు కూర్చుని వంట చేస్తుంది. ఎప్పుడైనా సరదాపడి కమల గరిటె చేతిలోకి తీసుకుంటే—

'నువ్వు లేచి ఆ బట్టలు ఆరవేసుకునే పనేదో చేసుకో. ఆ వేపడం నేను చూస్తాను. నేను చేస్తేనేగానీ మీ మామగారికీ నచ్చదు. వాడికీ నచ్చదు.' అంటుంది.

ఆ మాటతోనే కమల మనస్సు చివుక్కుమంటుంది. నిజానికి కమలకి వంటలన్నీ రుచిగా చక్కగా చేయగలిగే అనుభవం సంపాదించాలన్న కుతూహలం ఎంతో వుంది. పెళ్ళయి నెలలకు నెలలే అవుతోంటే తను ఒక్క పూటైనా వంట చేసి భర్తకి పెట్టలేదు.

పాతిక సంవత్సరాలనుంచీ తల్లి చేస్తే కొడుకు తింటూనే వున్నాడు.



భార్యగా తను చెయ్యగలుగుతున్న దేమిటి?"

ఓ రోజు మధుమూర్తి అన్నం తింటూ హాస్యంగా అన్నాడు — "ఇవ్వాళ కూరలన్నీ చాలా రుచిగా ఉన్నాయి. కమల చేసిందేమిటి?"

"అబ్బే! నేనే వండానురా! అదే చేస్తుందిలే. కంగారేమొచ్చింది? పెద్దదాన్ని. నే ఉన్నాగా?" అంది శేషమ్మ.

ఆవిడ పెద్దరికంలో అభిమానం మూర్తికేమైనా కనబడిందేమోగాని కమలకి కాదు. ఆవిడ పైకి వెల్లడిస్తోన్న అభిప్రాయం నిజం కాదు. తను పెద్దది. అత్తగారు. వంటిల్లు ఆవిడ చేతిలోనే వుండాలి. పొయ్యి ముందు కూర్చుని వండలేనంత వార్ధక్యమేం వచ్చిపడలేదు. ముప్ఫై ఏళ్ళనుంచీ తను చేస్తోన్న ఈ సామ్రాజ్యాన్ని నిన్నగాక మొన్న వచ్చిన కోడలిపిల్లకెలా అప్పగించగలదు?"

అమ్మ కోడల్ని ఉదారంగా చూస్తోందని సంతృప్తిపడిన మధుమూర్తి భార్య ముఖకవళికలను అర్థం చేసుకోలేకపోయాడు. నవ్వుతూ తల్లికేసి చూస్తూ అన్నాడు — "మంచి మాటన్నావు. నీ కోడలి వంటకి కంగారేం లేదులే. హాయిగా తింటున్నాం. ఇలాగే సాగనీ!"

మూర్తి వేళాకోళంగానే అంటున్నాడని తెలిసినా కమలకి చిరాకే కలిగింది.

ఒక్క వండటమే కాదు. వడ్డన కూడా ఏ పూటా అత్తగారే చేస్తుంది.

"కమలా—!" అని మూర్తి పిల్చినా— "నే వస్తున్నా రా! వడ్డిస్తాను." అంటూ పడుకున్న మనిషి అయినా లేచివస్తుంది.

కమలకు తను దగ్గరకూర్చుని సరదాగా మాట్లాడుకొంటూ — నవ్వుకొంటూ — భర్తకి అన్నం పెట్టాలనీ — ఇద్దరూ కలిసితినాలన్న కోరిక చాలా పాతపడి మాసిపోయింది. ఏదో యింట్లో శేషమ్మ లేనప్పుడు తప్పితే మూర్తికి అన్నం వడ్డించటం విషయంలో కమలకేమీ జోక్యం వుండదు.

మరో చిత్ర మేమిటంటే— తండ్రీ కొడుకులు కలిసి కూర్చుంటే సరేసరి — లేకపోతే ముసలాయన భోజనానికి వచ్చినప్పుడు కోడల్ని పురమాయించి తను బద్ధకించి పడుకొంటుంది శేషమ్మ. మామగారు అన్నం తింటోన్నంత సేపూ ఎదరగా కూర్చుని అన్నీ తనే వడ్డించటం కమలకి నచ్చదు. కూరా — పులుసూ మజ్జిగా— అన్నీ గిన్నెలలో పెడితే ఆయన వడ్డించుకోడు. ఆ గొడవ పడలేక అసలు వడ్డనల విషయం పూర్తిగా విరమించేసుకొంది కమల.

అత్తగారి వడ్డనలో మరోవిచిత్రం కూడా కంటపడిందో రోజు.

కుడి చేత్తో అన్నం పెట్టి — ఆ చేత్తోనే పచ్చడివేసి — ఆ చేత్తోనే


కూరవేసే అలవాటు కమలకి బాగా తెలిసిందే — అయితే ఓ రోజు శేషమ్మ అన్నం తింటూ ఎడంచేత్తో పచ్చడి మరికాస్త వేసుకుని-కోడలికి కూడా వెయ్యబోయింది. కెవ్వుమని కేక వేసినంత పనిచేసింది కమల.

—"అదేమిటి? ఎడం చెయ్యి పెట్టారు?" అంది విపరీతమైన అసహ్యంతో, ఆశ్చర్యంతో.

కోడలు అంత ఘాటుగా అడిగేసరికి శేషమ్మ కాస్త తడబడింది— "అబ్బే! ఏమిటో గరిట దగ్గర లేదని ... ఫర్వాలేదులే" అంటూ నసిగేసింది.

కమలకి మాట పెగలనంత అసహ్యం కల్గింది. స్టాండునిండా గరెటెలూ చెంచాలూ వున్నాయి. కమల పుట్టింటినుంచి అన్ని వస్తువులూ తెచ్చుకొంది. అయినా అత్తగారు వాటిని ఒక్కరోజు వాడిన పాపానపోదు. ఆ విషయం ఇంట్లో తండ్రీ కొడుకులు పట్టించుకోరు. కోడలు ప్రయత్నించీ ప్రయోజనం లేకపోయింది.

"ఇదిగోనే, గరిట తెచ్చాను." అంటూ శేషమ్మ లేచివెళ్ళి స్టాండున వ్రేళ్ళాడుతోన్న గరిట తెచ్చి కడగా పెట్టకుండా పచ్చడిలో ముంచి ఓ గరిటెడు తీసి కోడలి పళ్ళెంలో వెయ్యబోయింది. కమల పళ్ళెం వెనక్కి తీసుకుంటూ ఖచ్చితంగా అనేసింది — "ఊహూ! నా కా



పచ్చడి వద్దు. మరేం ఫర్వాలేదు. మజ్జిగ పోసుకుంటాను." పైకి నీళ్ళు తేరుకునే మజ్జిగె కూడా ఎడం చేతి వేళ్ళతో కలపటం శేషమ్మకి అలవాటే. అయినా ఆ పూజకి మాత్రం పచ్చడిలో గరిటెతీసి మజ్జిగలో పెట్టి కలిపి కోడలికి యిచ్చింది. కమల – బలవంతంగా మజ్జిగతాగి లేచింది. ఆ తర్వాత–వడ్డనల విషయంలో శేషమ్మ అల. వాట్లలో కాస్త మార్పు వచ్చిందీ అంటే అది కోడలు తిండితినదన్న భయంతోనే కానీ మరోటికాదు — "అఁ సింగినాథం. పూర్వం ఈ గరిటెలూ – ఈ చెంచాలూ – ఇవ్వన్నీ వుండేవా ఏమిటి?" అనేస్తుంది తేలిగ్గా.

"అప్పుడయినా ఏ ఆల్చిప్పలో – ఏ చిల్ల పెంకులో వాడివుంటారని మనం ఎందుకనుకో కూడదూ?" అంటుంది కమల.

తర్కందారి తర్కందీ, అలవాట్ల దారి అలవాట్లదీనూ.

● ● ●

కోడలికి నచ్చదని తెలిసినా అత్త గారి అలవాట్లు నిరాటంకంగా సాగుతోన్నవి చాలా వున్నాయి. ఇంట్లో నాలుగురకాల కూరలు వుంటే – హోటళ్ళలాగు రకరకాల వంటకాలు చేసేస్తుంది. అంటు గిన్నెల్లో కూరలు మిగలని రోజు వుండదు.

"అత్తయ్యా! రోజూ కూరలు మిగిలిపోతూనే వున్నాయి. కొంచెం తక్కువ తక్కువ వండరాదూ?" అంటే—"బావుందే! వచ్చే యిల్లూ పోయే యిల్లూనూ, ఓ పిసరు మిగిలితే మాత్రం ఏం భాగ్యంఠ?" అంటుంది.

ఇంట్లో దగ్గిర్నుంచీ బియ్యం బస్తావరకూ ఖర్చూ జమా అన్నీ ఆవిడ చేతి మీదుగానే అవుతూ వుంటాయి. పెద్దరికంతో ఆవిడ కష్టసుఖాలూ బాధ్యతలూ ఎరిగి చేస్తే చిన్నవాళ్ళ కింకేం కావాలి?"

కానీ అలాంటి సదుద్దేశం ఆవిడ చుట్టుపట్లకి కూడా రాదు. చిన్నతనంలో కన్నవారింట కాస్త కలిమిలోనే పెరిగిందిట. భర్తగారి హయాంలోకూడా బాగానే జరిగిందిట. ఈనాటికి కన్నకొడుకు దగ్గర కూడా తన దర్జాకి ఎలాంటి లోపమూ లేదనుకుంటుం దావిడ.

కొడుక్కి వచ్చేది నూటఏనభై రూపాయల జీతం! ఆ నాటికీ ఈ నాటికీ పదింతలు పెరిగి కూర్చున్న ధరలు! ఉప్పు దగ్గిర్నుంచి సమస్తమూ కొనుక్కు తీరాల్సిన పరిస్థితి!—అన్నీ శేషమ్మకి తెలిసినవే! అయినా అత్తగారు ఎందుకంత దూబరా చేస్తుందో కమలకి అర్థంకాదు. ఒకటో తారీఖున తెచ్చిన సరుకులు మళ్ళా తెచ్చుకునే వరకూ ఎన్నడూ రావు. అలా సర్దుబాటుచేసి ఆవిడ వాడదు. అసలా ఆలోచనే ఆవిడకు వున్నట్టు తోచదు.

ఓసారి నెలాఖరున ఏదో పిండి వంట ప్రయత్నం పెట్టింది. కమల ఉండబట్టలేక అనేసింది. "నూనె ఎంతో లేదత్తయ్యా! పోనీ ఫస్టు వెళ్ళాక చేసుకుంటే కాదూ?"

"ముసలాయన అడిగారని ప్రారంభించానే! బ్రతికి నన్నాళ్ళు బ్రతకబోతామా? ఏదో అవుతుందిలే"

కమల నోరు మూసుకుంది.

చేసిన పిండివంట కాస్తా మధ్యాన్నం టిఫిన్లకి ఇరుగూ పొరుగూ పోరట్లకి సరిపోయింది. నూనె డబ్బా మాత్రం ఖాళీ అయి కూర్చుంది.

మర్నాడు చీకటితోనే నూనె అయిపోయిన మాట గుర్తు వచ్చింది శేషమ్మకి.

"ఒసే కమలా! సుబ్బాయమ్మ గారింటికెళ్ళి ఓ పావుశేరు నూనె అడిగితెద్దూ!" అంటూ కేకపెట్టింది. లేచి నిద్రకళ్ళతో బయటికి వచ్చింది కమల.

"ఒకవేళ వాళ్ళింట్లో లేదంటే... ఏమో! నెలాఖరుకదా? వుంటుందీ – వుండకపోతుందీ... ప్రభావతిగారింట్లో అడుగు."

విషయం అర్థమైంది కమలకి.


"ఓ ఘడియ తొందరగా వెళ్ళు. డబ్బా తీసుకువెళ్తావా? వాళ్ళింటి ఏదైనా గిన్నె అడిగి పోయించుకు వస్తావా?"

కమల పళ్ళపొడి ఒంపుకొంటూ అంది. "నే వెళ్ళను"

"అదేమిటే? వెళ్ళకపోవటం ఏమిటి? ఇంట్లో నూనె లేదు ఎక్కడో అక్కడ తెచ్చుకోకపోతే ఎలా? నే నిమ్మన్నానని అడుగు."

చురుగ్గా చూసింది కమల... "ఏం మీరిమ్మన్నారని అడక్కపోతే నన్ను నమ్మి అప్పు ఎవ్వరూ ఇవ్వరా?"

"అందుక్కాదు. నువ్వు సిగ్గుపడుతున్నావేమోనని ఆ ముక్కన్నాను. పోనీలే. ఈ పూటకి ఎలాగో ఓలా. అడిగి తీసుకురా!"



రచయిత్రి : నాసీరియల్ నవల గురించిఏమేనా అభిప్రాయాలొస్తున్నాయా?

ఎడిటర్ : ఇంతకుముందే మీ పేరుగల వొక అమ్మాయొచ్చి ఈ నవల తను రాయలేదని ప్రకటించమని ఎడ్రస్ ఇచ్చి వెళ్ళింది.

"ఊహూ! నేను వెళ్ళనత్తయ్యా! నాకు అప్పులు తెచ్చుకోటాలూ - ఇవ్వటాలూ యిష్టం వుండదని మీకు తెలుసు."

శేషమ్మ కాస్త ఆశ్చర్యపడింది- "ఇష్టం వుండకపోవటం ఏమిటి? బంగారం పళ్ళేనికైనా గోడచేరువ వుండాలిట. అప్పూ సప్పూ లేకుండా వుండటానికి మనమేం లక్షాధికార్లమా?" సాధ్యమైనంత వెటకారంగానే అందావిడ. కమలకు చికాకు వేసింది- "లక్షాధికార్లం కాకపోయినా బిక్షాధికార్లం కాదు. చీటికీ మాటికీ అప్పుకి పరుగెత్తాల్సినంత ఖర్మేం లేదు. అత్తగారు కాస్త నోరుచేసింది -" ఇంతకీ నువ్వనేదేమిటి? నా చేతిలో బోలెడు పని వుంది. నేనెలా వెళ్ళనూ? నూనె చుక్క లేకుండా పనెలా అవుతుంది?"

"అదేమో, నన్నడిగితే నేనేం చెప్పేది? ఏం చేద్దామన్న వుద్దేశంతో నిన్న నూనంతా వాడేశారో నాకేం తెలుసూ?"

కోడలి ఎదురు జవాబుకి అత్తగారి ఒళ్ళు మండింది — "బుద్ధిలేక నేను చేశానని నువ్వేం తినటం మానేశావా? వండింది కాస్తా బద్దలు కొట్టుకున్నాంగానీ పారబోసుకున్నామా?" అంటూ కేకలు వేసింది.

గబగబా మూర్తి లేచివచ్చాడు. "ఏమిట్రా ఇంత చీకటితోటే అత్తాకోడళ్ళు ముచ్చట్లాడు కొంటున్నారూ?" అంటూ హాస్యానికి దిగాడు

"ఆఁ నా మొహంలాగే వుంది ముచ్చట..." అంటూ శేషమ్మ అంతా చెప్పింది. ఆ చెప్పటంలో చాలా వరకూ తను చేసిన పనిని సమర్థించుకొంటూ కొడుకు చేత అవునఁపించాలన్న ధోరణి కన్పరిచింది.

నిజానికి మూర్తికి కూడా తల్లి చేసిన పని నచ్చలేదు — నిత్యో టిఫిన్లు చేసినా చెల్లిపోతాయి. తింటాంగానీ పారవేసుకోం — అలాని వున్నదీ లేనిదీ కానకుండా చేసుకుతిని అప్పులకి తిరగడం భావ్యంకాదు.

"సరేలే! ఏదో అయిందిలే. నీకిష్టమైనట్టు చేద్దూ అమ్మా!" అన్నాడు."

శేషమ్మ కొంచెం చల్లబడింది.

"నీ తెక్ఖేమిటి?" అన్నట్టు కోడలికేసి ఓ చూపు విసిరి — పొయ్యి దగ్గిరికి పోయింది.

ఆ పూటకి నెయ్యి తాలింపు వేసి కూరలు చేసింది. మధ్యాన్నంనుంచీ రెండుమూడిళ్ళు తిరిగి ఓ సీసా నూనెతెచ్చి డబ్బాలో ఒంచింది.

అంతా చూస్తోనేవుంది కమల. చీటికీ మాటికీ అప్పులు తెచ్చుకునే వాళ్ళు ఏ వేళప్పుడెవరు వచ్చినా అప్పు ఇవ్వకా తప్పదు.

అడగని వాళ్ళదే పాపంలాగా ఇంట్లో సమస్తమూ అప్పు లిస్తుంది శేషమ్మ.

బియ్యం - పప్పులు - నూనె- పంచదార - కాఫీపొడి-వుల్లిపాయలు సబ్బులూ - చాకలి సోడా - వగైరాలన్నీ అప్పుల జాబితాలోవి.

బ్యాటరీ లైటు - థర్మామీటరూ ఫ్లాస్కు - ఇస్త్రీ పెట్టీ వగైరా లన్నీ ఎరువుల జాబితా.

అమృతాంజనం - వంటలసోడా- నీలిమందూ - ఆస్ప్రిన్ మాత్రలూ - ఇత్యాదులు దానధర్మాల పట్టీలోవి.

"కూరలేమీ లేవు పిన్నిగారూ! ఏం చెయ్యాలో తోచకుండా వుంది." అని ఎవరైనా శేషమ్మ దగ్గిరకిపోతే - తక్షణం ఆవిడ ఏదో సలహా యిస్తుంది, సాయం చేస్తుంది-" "మాయింట ఓ అరవీశెడు వంకాయలున్నాయమ్మా! నిన్న నేకొన్నాను. పోనీ తీసుకెళ్ళు. నువ్వు కొన్నప్పుడు యివ్వచ్చు." అని బుట్టలో నిగ నిగ లాడుతోన్న వంకాయలు- ఆవిడముందు పెడుతుంది.

తిరిగి ఆవిడ వంకాయలు కొని యిచ్చినప్పుడు అవి తూకానికి అరవీశెడూ వుంటాయి. సగం కూరకి - సగం పెంటమీదికి. అలా కాకపోతే ఆరణాలకి కొన్న కొబ్బరికాయలు పావలార్ధణా యిచ్చి అప్పుతీర్చేస్తుం దాయిల్లాలు.

"శేషమ్మ పిన్నిగారు కష్టసుఖాలు తెలిసినవారు. అందరికీ తలలో నాలికలాగే ఉంటారు." అన్న ప్రశంసలు విన్నప్పుడు ఆవిడ మొహం ఎలా ఉంటుందో కమల చాలాసార్లు చూసింది. అందుకే ఆవిణ్ణి తనకు తనుగా మార్చాలన్న ప్రయత్నం విరమించుకొంది.


● ● ●

ఆ రోజు...

మధుమూర్తి అన్నం దగ్గిర కూర్చుంటూనే అన్నాడు—"అన్నం ఇలా ముతగ్గా ఉందేమిటి?"

కమల మాట్లాడలేదు.

శేషమ్మ అంది — "బియ్యం కొంచెం మారాయిలే. జానకమ్మ గారు అప్పు తీర్చింది."



మూర్తి గబగబా రెండు ముద్దలు మింగాడు. "కూర కొత్తగా రుచి తెలీటం లేదమ్మా !"

మరో ముద్ద మింగాడు. చెంప పట్టుకు ఉండిపోయాడు.

కమల నవ్వుతూ అంది—"శివుడు తగిలాడా ?"

నిజంగా అన్నంనిండా శివుళ్ళే. మరి రెండు ముద్దలు తిని—తినలేక లేచిపోయాడు మూర్తి.

కమల తెల్లబోయింది.

"ఆదేవిట్రా? ఏమైందీ?–" అంది కంగారుగా శేషమ్మ.

"అబ్బ రాళ్ళమ్మా! నేనుతిన్లేను." అంటూ చెయ్యి కడిగేసుకున్నాడు మూర్తి.

కమల మజ్జిగగ్లాసు తీసుకుని గదిలోకి వెళ్ళింది— "ఆకలి తీరలేదు కదూ?"

"ఆకలి తీరకపోతే వచ్చే నష్టమేమీ లేదుగానీ ఆ రాళ్ళుమింగితే ఆపరేషన్ వరకూ వస్తుంది వ్యవహారం."

"అయితే ఎన్నిపూటలు ఆకలితో ఉండగలరు ?"

"అంటే?"

"మరో నాలుగు పూటలయినా దివ్యంగా వస్తాయి ఆ బియ్యం."

"అన్ని బియ్యం ఎందుకు అవ్వ ఇవ్వాలి?"

"ఎవర్ని అడుగుతున్నారు?"

నిట్టూర్చి మౌనంగా కూర్చున్నాడు మూర్తి.

కమల అంది—" ఎంతో మంచి బియ్యం, యిచ్చి కొత్తగా ముతక బియ్యం, రాళ్ళ బియ్యం తీసుకున్నారు అత్తయ్య. బియ్యం ఒక్కటే ఏమిటి ? గింజలు వేయించి దంపుకున్న కాఫీపొడి కప్పులతో యిచ్చేసి – కొట్లమీదకొన్న కల్తీ పొడి పుచ్చుకుంటారు. ఒకటేమిటి? సమస్తం అప్పే. మనం కొనుక్కున్న సరుకులు ఎవరో తింటారు. ఎందరో కొనుక్కున్న సరుకులు మనం తింటాం. ఇలా ఎంతకాలం గడుస్తుందో నాకేం అర్థంకావటం లేదు."

"అంతా నాకు తెలుసు కమలా ! ఇవ్వాళ కొత్తగా నువ్వు చెప్తున్నదేమీ లేదు."

"అయితే ఇక యిది ఇలా సాగాల్సిందేనా ?"

"మరేం చెయ్యగలం ?"

"ఎందుకు చెయ్యలేం ? ఈ సంసారంలో ఆవిడకు తప్ప ఎవరికీ ఏమీ హక్కు లేదా ?"

"పోనీ ఆవిడకు నువ్వేమయినా చెప్పిచూడలేకపోయావా ?"

"నా వశం కాలేదు కాబట్టే విషయాన్ని మీ వరకూ తెచ్చాను."

"నేను మాత్రం ఆవిడ్నేమని అడగను ?"

(సశేషం)

త్రివర్ణ చిత్రం

భమిడిపాటి రామగోపాలం

సరళాదేవి రిస్టువాచీ చూసుకుంది.

పదిన్నర !

వర్షం అలా పడుతూనే ఉంది, తెరిపి లేకుండాను. "వెధవ వర్షం !" అని పైకే విసుక్కుంది సరళాదేవి.

రామకోటి ఆమెని గమనించకుండా బల్లమీద చతురంగ బలాలూ పేరుస్తున్నాడు.

"మరో ఆట వేద్దామంటావా ?" అంది సరళాదేవి, ఆవలిస్తూ చిటిక లేస్తూ.

"ఆయనొచ్చేవరకూ ఆడుతానంటివిగా !... నీ యిష్టం. పోయి పండుకుంటానంటే వెళ్ళు. నాదేం లేదు" అని రామకోటి ఆమె వెళ్ళిపోడం తన కిష్టంలేదని తెలియచేశాడు.

వరండాలో కుర్చీల్లో కూర్చున్నారు, రామకోటీ సరళాదేవీను. టేబిల్ పొడుగువైపు ఒక కుర్చీ, వెడల్పువైపు మరొకటీ. టేబిలు మీద చతురంగబలాలూ యుద్ధానికి సిద్ధంగా ఉన్నాయి.

"ఆయనింకా ఎప్పుడొస్తారో... ఊరంతా నిద్రపోయిందిగాని ఇంకా యింటికి చేరటానికి వేళకుదర్లా." అని పైకే అనుకొని, రామకోటి కళ్ళలోకి చూసి 'నాదా ?' అని, యథాలాపంగా బంట్లు తోసింది సరళాదేవి. మరుక్షణం ఆమెదృష్టి గేటువేపు మళ్ళింది.

అక్కడింకా ఎవరూ వచ్చిన అలికిడి గాలేదు.

• • •

సరళాదేవి ఆనందరావు భార్య. అతను ఎడ్వకేట్. రామకోటి ఆరు నెలల క్రితం ఇన్‌కమ్‌టేక్స్ ఆఫీసరుగా వొచ్చాడు ... ఇంతకు ముందుండే ఆఫీసరు, అదే యింట్లో, క్రిందివాటాలో ఉండేవాడు. ఆయన వెళ్ళినతర్వాత పదిహేను రోజులకి రామకోటి ఈ వూరు వొచ్చాడు. ఆ పదిహేను రోజుల్లోనూ ఆనందరావు ఇంటివాళ్ళతో మాట్లాడి తను మేడమీది వాటాలోంచి క్రింది వాటాలోకి మారిపోయాడు.

"మేడమీది వాటా అయినా సరే, నా కభ్యంతరం లేదు !" అని రామకోటి ఇల్లు చూసుకున్నాడు: చేరేడు.

"మర్నాడు పొద్దున్నే అతను దగ్గిరుండి నేమ్ బోర్డు కొట్టిస్తూ

వుండగా సరళాదేవి అటొచ్చి అతన్ని గుర్తుపట్టింది.

'హల్లో — రాంకోటి! నువ్వా, ఈ ఇన్‌కమ్ టేక్సాఫీసరు? బలే! ఎంత చిత్రం!?' అన్నది, మొహం అంతా ఆశ్చర్యం, ఆనందం, నవ్వూ చేసుకొని.

కడుపునిండా ఒచ్చిన సంతోషం రామకోటి కూడా మొహంనిండా కనబర్చాడు. '—అరె! మీరా? ఈ క్రింది వాటాలో ఉంది?— ఆనందరావు, బియ్యే బియల్, అంటే పరధ్యాన్నంగా ఎవరో అనుకుంటున్నాను! జస్ట్ వండర్‌ఫుల్!—ఆనందరావు ఈ వూళ్ళో పెట్టాడా ప్రాక్టీసు?'

'బందర్లో బాగులేదని యిక్కడి కొచ్చేశాంగా! ఐదేళ్ళయింది!'

— ఆనందరావూ, రామకోటీ, సరళా; వొక్క కాలేజీలోనే చదువుకున్నారు. అందరికీ అందర్నీ తెలుసు. అందర్నీ తెలియడమే కాదు; అంతా తెలుసు.

రామకోటి ఆ రోజుల్లో సరళని కోరేడు; ప్రేమించాడు. ఆరాధించేడు ... తీర్చి దిద్దిన బొమ్మలా వుండేది సరళ. అంతేకాదు. చూసిన వాళ్ళందర్నీ వెర్రెత్తించేటంత చలాకీగా, దూకుడుగా, వుండేది. ఇంకొంచెం అయితే ఎబ్బెట్టుగా వుంటుం దన్నంతగా సౌందర్య ప్రదర్శన చేసేసేది ... బట్టకట్టడంలో, బొట్టు పెట్టడంలో, జుట్టు దువ్వుకోడంలో, సరళాదేవి కళే వేరు. నడవడంలో, నవ్వడంలో, పరుగెత్తడంలో, పడిపోతుందేమో చూదాం అనిపించి జనాన్ని నిలబెట్టేయడంలో సరళాదేవి పద్ధతే వేరు. ఆమెని అనుకరిద్దామని ఆడపిల్లలూ, అనుసరిద్దామని మగపిల్లలూ ఊగేవాళ్ళు.

...అది అప్పటిమాట... అప్పటి సరళ యిప్పటి సరళలో యెక్కడైనా కనబడుతుందేమో అని వెతుకుతున్నాడు రామకోటి... ... ఇప్పుడైతే మట్టుకేం?—సరళ అప్పటికంటె ఎక్కువ నిండుతనం ప్రదర్శిస్తూ, అప్పటికంటె ఎక్కువ ఆదరం చూపిస్తూ; అప్పటికంటె ఎక్కువ అందంగా కనిపిస్తోంది... ఈ నిండుతనంలో, ఆదరంలో, ఆత్మసౌందర్యం ఎక్కువగా ఉన్నట్టుంది. పరిణతి పొందిన ఆనందానుభవం సరళ — అప్పుడేదో అజ్ఞానంలో, అడిగితే అవునూ కామూ అనలేకపోయింది ... ఇప్పుడేమనుకుంటోందో, సరళ!?

రామకోటి ఆమె కళ్ళల్లోకి చూశాడు. అవి అస్పష్టంగా అటూ యిటూ కదిలేయి. ఎటో యెటో చూసి వెతికి, ఎక్కడా ఏమీ లేదని గ్రహించినట్టు మళ్ళీ యిటొచ్చేయి.

'ఏంటో — అదోలా వున్నావ్ సరళా!'

'ఏం లా' అనవసరంగా నవ్వింది, సరళ.

'అతను రాలేదనేగా!... ... ఒస్తాడులే...యిదేం కొత్తా?'

సరళ నవ్వుతుంది. ఏదో ఓ మార్పు చెప్పాలని చెబుతున్నాడు రాంకోటి. అంతే. అదొక ఫార్మాలిటీ. ఆడదానికి మొగుడో ఎవడో రక్షణ వుండాలి. రక్షణ దొరుకుతుందిలే అని అభయం యివ్వడం సిల్లీ ఫార్మాలిటీ!

—కాని, ఫార్మాలిటీస్ దాటగలిగిన స్నేహం తమది... ఆ మాటకొస్తే అన్ని అవరోధాలూ అతిక్రమించగల అనుబంధం—మొగ్గలోనే తుంపేసినా మోడే చిగురించగల ఆనందానుబంధం అమృతం, అనంతం; అనుభవంతో అరిపోయేదిగాదు.

తన అందాన్ని — అమ్మకంటే బహిరంగంగా, అద్దంకంటే స్పష్టంగా, చెప్పగలిగిన రాంకోటి తన ఆనందాన్ని—ఆనందరావుకంటె అభిమానంగా, ఆత్మకంటే ఆప్యాయంగా ఆకాంక్షించి ఆవేశపడ్డ రాంకోటి; తనే సర్వమనుకొనేవాడు ఒక్కడైనా ఉన్నాడన్న గర్వం తనకు కలగజేసిన రాంకోటి — అతన్ని చూస్తూ వుంటే, అతని సమక్షంలో వుంటే, అనుభవానికి ఆత్మమీద అనవసరంగా యింత ఆగ్రహమూ అసూయా ఎందుకూ అన్న మీమాంస కలుగుతుంది.

'సరళా; నువ్వందంగా ఉన్నావు ... నువ్వంటే నాకెంతో యిష్టం.' అన్నాడు రామకోటి. అంత తియ్యటి మాటల్ని అంత స్పష్టంగా చెప్పిన మొదటివాడు అఖరువాడు కూడా) అతనే... ...ఇప్పుడు అనడేం? — ఇప్పుడూ అంటూనే ఉన్నాడేమో; ఆ మాటల్ని వాతావరణం మింగేస్తోంది. అతని నోటంట ఆ మాటలు ఆలకించే అర్హత పోగొట్టుకుంది తను.

'నన్ను పెళ్ళిచేసుకో సరళా... అలాచేస్తే నీ కంకితం చేసిన నా బ్రతుకు సార్థకమైన సరళరేఖగా తీర్చి దిద్దుకుంటాను' అన్నాడు ... ... ఇప్పుడు కాదు; ఎప్పుడూ, ఆనందరావుగాని, మరొకరుగాని మళ్ళీ ఆ మాట అనకుండానే అంతా జరిగిపోయింది.

—ఆ రోజు — అతను తనకి వ్రాసిన లేఖని, మెస్‌వార్డెనూ, ప్రిన్సిపాల్ గారూ పంచాయితీకి పెట్టినరోజు—వాళ్ళు చేసిన ఫస్ చూసి—'ఆయన నాకుత్తరం రాసేడని అంత యిదేం, మీ కందరికీ? నేను ఆయన్నే పెళ్ళాడుతాను! ఊరేగండి!' అని పైకి అనేద్దామన్నంత ప్రేరేపణ కలిగింది — కాని అనలేకపోయింది.

—అదొక చిత్రమైన లేఖ— పెళ్ళనే పెక్కుసార్లు పెద్దగా ఉదహరించి వుటంకించిన ప్రేమ లేఖ— ఆస్తులూ అవకాశాలూ అభివర్ణించాడు. తండ్రి కొక్కడే కొడుకు. ఒక్క తల్లికికాదు. పెద్దమ్మకూ, చనిపోయిన సవతితల్లికీ ముగ్గురు తల్లు

లకు – ముచ్చటపంతైన ముద్దుబిడ్డ. కలిగినింటివారి గారాబుపట్టి... ఏం చేసినా సహించడమేకాక మెచ్చుకోడం నేర్పిన పెద్దలు ... చురుకుతనంతో, జ్ఞానంతో ఆకట్టుకున్న స్నేహితులూ వుపాధ్యాయులూ— చూడు సరళా, ఇదీ నా ప్రపంచం. నా చుట్టూ మనుష్యులు ఇంతలాంటి దేవతలు... వీళ్ళనిబట్టి నన్ను తెల్సుకోగలవు— ఈ జనం మధ్యకి, ఈ మనం మధ్యకి నీలాంటి సుందరి, సుకుమారి, సుమతి, గృహలక్ష్మిగా, రాణిగా ఉంటే తప్ప నిండుతనం రాదు—నీ వేపుకి ఏమాత్రం అయినా దురదృష్టం, అనుమానం, సందేహం వుంటే; యెంత పెద్దవైనా సరే: ఎంత మొండివైనా సరే, వెంటనే తెలియజెయ్యి: దాటడానికి మార్గం; పోనీ తప్పించుకోడానికి తరణోపాయం చూసి తెలియజేస్తాను— .

'ఇందులో వొక్క అక్షరం అబద్ధం లేదండీ... ఏదో వుద్రేకంలో, తాత్కాలిక వుల్లాసంలో, అర్ధరాత్రి పూట అరకప్పు టీ కొట్టేసి అప్పటికప్పుడు తెచ్చుకున్న ఆవేశంలో రాసినబాపతు కాదండీ. అంతా ఫీలై, అన్నిటికీ సిద్ధమై వ్రాసేనండీ—' అన్నాడు! ఆనాడు ప్రిన్స్‌పాల్ గారు, కొందరు లెక్చరర్లు, అతన్ని నిలబెట్టి సంజాయిషీ అడిగితే.


'డిస్మిస్ హిమ్!!' అంది మెస్ వార్డెను; నలభై రెండేళ్ళ అజన్మ బ్రహ్మచారిణి. పదేళ్ళ మెస్ సర్వీసులో, — వెయ్యిన్నొక్క ప్రేమలేఖల్లో – వొక్కటి కూడా, తనది కాకపోయెనే అన్న కసి వెళ్ళగక్కుతూ.



'పోనీ ఆ అబ్బాయికే యివ్వరాదటమ్మా, పిల్లనూ!—అంతగా యిష్టపడుతున్నారాయె!' అని ప్రిన్స్‌పాల్ గారంటే—

'......అన్నీ బాగానే వున్నై గానండీ, కోమట్లబ్బాయి కెట్లా యియ్యనండీ అమ్మాయిని?—కమ్మోరంతా నామీద ఉయ్యరూ?' —అమ్మ... తన ఆదరణాతిరేకంతో, తండ్రిగారు లేకపోవడమే అదృష్టమనిపించిన అమ్మ—కలలో కనబడ్డది యిలలోకి తెచ్చిచ్చి లాలించి, కన్నవారుగాని ఉన్నవారుగాని కనీ వినీ యెరక్కపోయినా, కల్యాణం కాదు కాలేజీయే కావాలన్నప్పుడు కనికరించిన కన్నతల్లి; కాకూడని సమయంలోనే కరుగ్గా అయిపోయింది.

'అతన్నే పెళ్ళాడతానమ్మా. కులం గోత్రం కూడుబెడతాయా? కులమూ పాడూ!—' అనలేకపోయింది తను. పోనీ యింకో విధంగా అతన్తో చెప్పాలనిపించినా, అంత మర్యాద మనిషికి యింత హీనమైన సలహా యివ్వడమా అనిపించింది ... ముగ్ధత్వం వొదలని



నాడు మొహమాటం యెలా వదుల్తుంది ?

అలా జరుగుతాయి పెళ్ళిళ్ళు—ఇరవైఏళ్ళకిచేసినా బాల్యవివాహమే తనది!...

ఆ సరళని చూస్తూ యిప్పుడు మనస్సు నవ్వుతున్న చిరునవ్వును దాచుకొంటూ, ఏవేనా వాక్యాలు నోరుజారి వచ్చేస్తాయేమోనని బెదిరిపోతూ రామకోటి వేపు దొంగతనంగా చూసింది సరళ.

● ● ●

ఆనందరావు ఆమెని పెళ్ళాడాడు... 'లా' పూర్తి చేసుకొచ్చి, ఎప్రెంటిస్ షిప్ కోసం బందరు వచ్చిన ఆనందరావు, రామకోటీ కలిసి ఓయిల్లు అద్దెకి తీసుకున్నారు. సరళనిచూసి, రామకోటి 'కథంతా తెలుసుకొని, 'కులం వొక్కటే నీ డిస్క్వాలిఫికేషనైతే ఆ అమ్మాయిని నే చేసుకోవల్సిందే—అన్ని విలువలున్న మనిషిని పైకి పోనియ్యటానికి లేదు,' అన్నాడు.

—తరవాత కూడా రామకోటి వాళ్ళింట్లో ఉన్నాడు. 'ట్రియో' కలిసే కనబడేవారు ఎక్కడ చూసినా. కాఫీ హొటల్సులోనూ, పార్కుల్లోనూ, షాపుల్లోనూ. రోడ్ల మీదా, ముగ్గురూ కలిసే కనబడి జనానికి ముక్కులమీద వేళ్ళూ చెవ్వులమీద చేతులూ వేయించేవాళ్ళు. సినిమాల్లో సరళని మధ్యన కూచోబెట్టి ఇటొకరూ అటొకరూ కూచుని జనాన్ని ఏడిపించుకుతినేవారు,

ఈ ఎనిమిదేళ్ళ తరవాత, మళ్ళీ నాటికి నేడు, ఇక్కడ కలిసి వుండడం తటస్థించి, మళ్ళీ కులాసాగా కాలం గడుపుతున్నారు వాళ్ళు. ఆరునెలల్లో, క్లబ్బులూ, పేకాటలూ; షికార్లూ, సినిమాలూ, పిక్నిక్ లూ, పార్టీ లూ, ఎన్నో చోట్ల ఎన్నో రకాలుగా ఎంతోమందికి ముగ్గురూ విడిపోకుండా కనబడి ఆశ్చర్యపరిచేరు. ఎవరికి పరిచయం చేసినా, "మా ఫ్రెండు!" అంటారు రామకోటిని, ఇద్దరూనూ. వాళ్ళమధ్య బంధుత్వం కలవలేదు. అది వాళ్ళకి అవసరంలా కనబళ్ళేదు. ఇలా పెళ్ళయిపోగానే అలా అన్నయ్యగారూ అంటూ పిలవడం ప్రారంభించలేదు సరళ. అది వాళ్ళు ముగ్గురూ అనకోకుండా అవలంబిస్తున్న ఆనంద బాంధవ్యం.

రామకోటి పెళ్ళాడేడు. ఇద్దరు పిల్లలు. మూడోమారు కనటానికి ఆమె పుట్టిల్లూ అత్తిల్లూవున్న వూరు వెళ్ళింది.

'ఆమె వొచ్చేంత వరకన్నా మా యింట్లో తిను. ఆనక నువ్వెట్లాగూ మడిగట్టేసుకుంటావు' అన్నది సరళాదేవి. 'ఎంతసేపూ పప్పూ ఉర్లగడ్డలేగా, ఆమెగారు నీకు పెట్టేది ?'


● ● ●

'ఎత్తువెనక్కి తీసుకుంటావా?—ఇదుగో, ఈ స్క్వేర్‌లో వుంచేది నీ క్వీన్' వేలుపెట్టి చూపించాడు రామకోటి.

సరళ గదిలో చూస్తూ ఒడిలో చూసుకుంది... పైట ఎప్పుడు జారిపోయిందో.. పూర్ణత్వాన్ని పొందిన యవ్వనం ఆచ్ఛాదనలేక నిండుగా గుండ్రంగా కనబడిపోతోంది. అంగుళంనర వైశాల్యం కలిగిన బరువైన పుస్తెలు బంగారు సూత్రంలో వ్రేలాడుతూ, ఏది బరువో ఏది తెలికో చెప్పలేకపోతున్నాయి.

చటుక్కున పైట దిద్దుకొని రామకోటి మొహం చూసింది సరళాదేవి. అంతసేపూ అటు చూస్తున్న రామకోటి హటాత్తుగా రోడ్డువేపు దృష్టి మళ్ళించేడు. 'అక్కడ విశ్రాంతి తీసుకునే తల — ఎన్నివేల విలువ చేసునో—! ?'

వర్షంపడుతోంది.. వర్షం చిందిన వరదలో... హర్షం పొందిన యెద దలో వరద చిమ్మిన బురదలో... ఎడద కమ్మిన బెడదలో... ఎక్కడ చూసినా, చూసిన దృశ్యమే సుందరతరంగా కనబడుతోంది ... దృష్టి మరల్చుకున్నా కళ్ళకి కనబడుతూనే ఉంది, ఆ దృశ్యం అదృశం కాకుండాను — మనస్సు విప్పిన హృదయం... ...ఆనందరావు రాలేదు ... అనవసరంగా ఆలస్యం చెయ్యడం అలవాటు చేసుకున్నాడు. ఆమెని కాల్చుకు తింటున్నాడు... ఎప్పుడూ ఏదో గొడవ... పార్టీలూ, సాక్షులూ, వ్యాజ్యాలూ అప్పీళ్ళూ, మేజిస్ట్రేట్లూ జడ్జీలూ, బార్ ఎసోసియేషన్ మీటింగులూ అనుకుంటూను ... నల్లకోట్లు రెపరెపలు... నల్లగౌన్ల పరంపరల పర



వరకు ... తనకి వుంది — నల్లబజారు ప్రాపకం; ... నల్లధనం వైభవం ... ... నల్లభార్య సౌరభం ... ...

"ఇంకా రాలేదెందుకో—?" అంది సరళ.

"బహుశా వర్షానికి ఆగాడేమో —"

"వర్షమైతే ఆగిపోవాల్సిందేనా యేంటి?"

"బలేపనే; అటు చూడ్రాదూ, ఎట్లా వుందో, జోరు?"

"ఔననుకో—ఐతే మాత్రం ?— ఏ రిక్షావాడికో మరో పావలా పారేసి రారాదా యేం?"

వర్షంకేసి చూస్తూ అనవసరంగా మాట్లాడుకుంటున్నామని యిద్దరూ తెలుసుకున్నారు. ఒక్క నిమిషం మౌనంగా వొకరి మొహాల వొకర్రు చూస్తూకూచుండిపోయారు. ఆ సమయంలో వాళ్ళ మనస్సుల్లో ఏం భావాలు కదులాడేయో చెప్పడం కష్టం — హటాత్తుగా మెరుపు మెరిసింది; పెద్దగా వురిమింది.

మెరుపులో సరళ మొహం కనబడ్డది రామకోటికి. వెంటనే ఆమె మొహం మళ్ళీ చూశాడు. సరళ మొహంలో మెరుపు కనబడ్డది. సినిమాల్లో ఉపయోగించే లైబ్రరీషాట్స్‌లోని పిచ్చి గీతలు ఆమె మొహంమీద కాంతివంతమైన రేఖలుగా క్షణం, భయంకరమైన కొలరేడో లోయల్లా మరుక్షణం ముద్రించబడ్డట్టు కనుపించింది ...

మొహాలు మనస్సులకి సూచికలంటారు. ఈ మొహం సరళ మనస్సుది కాదు. సరళ ... సరళ ... సరళాదేవి! ప్రత్యక్షంలోని ప్రసన్న వదనంలో, పరోక్షమైపోయిన ప్రచ్ఛన్న స్మృతులు లేవేనా ప్రకాశవంతంగా ప్రసరించేయేమోనని ప్రగాఢ ప్రయత్నంతో ప్రశ్నించిచూసేడు రామకోటి—మరుక్షణంలో అతని ప్రలోభం ప్రమాది భయంలో ప్రవహించుకు పోయింది ... ఒద్దువొద్దు అవి బరువైన అడుగుల్తో ఉరమెక్కి నృత్యం చేస్తాయి ... ...

అతనలా చూస్తూనే ఉన్నాడు; సరళాదేవి మూడుసార్లు చూపు నేల మీదికీ మళ్ళించి మళ్ళీ మూడుసార్లూ అతని మొహంలోకే చూస్తూ కూచుంది. మళ్ళీ మెరుపు మెరిసింది. రామకోటి మెరుపుచూశాడు. సరళాదేవి అటు చూడలేదు. "ఇంకనే నాళ్ళేనబ్బా!" అన్నది; ఉరుం చప్పుడులో బలంకలిపిన గలగలకలగా పులగం అయిపోయింది. అతను మళ్ళీ యిటు చూసేసరికి ఆట మధ్యలో సమాప్తమై విచారం కలిగింది.

"అరె! కలిపేశావా?"

"ఏం?" సిల్లీగా నవ్వింది. సరళాదేవి.

"నీ ప్రాబ్లమ్‌కి నేను సొల్యూషన్ చూపిద్దామనుకున్నాను. మొన్న-ఆ రష్యా ఛాంపియనుండ్లా – వాడికి యిట్లాంటి ప్రాబ్లమే ఒచ్చింది ... మొన్న సన్‌డే హిందూలో కామెంట్ చేసేడు ... ..."

"నాకు ప్రాబ్లమూ లేదు; నీ సొల్యూషనూ అక్కర్లేదు!" అంది సరళ, అతన్ని వంకరగా చూస్తూ, మిస్చీవస్‌గా నవ్వుతూ; శ్లేషించాన్లేవోయ్ అన్నట్టు.

"అబ్బా! అదేంటి సరళా అట్లా మాట్లాడతావు: నే నేమన్నానని?" అన్నట్టు నిర్దోషి మొహం పెట్టి మాట్లాడకుండా కూచున్నాడు రామకోటి.

సరళ పకపకా నవ్వింది. "నేను మాత్రం ఏమన్నాను?" అన్నట్టు తేల్చేస్తూ, చదరంగం బలం భరిణలో పోస్తోంది.

వీధిలో కారాగింది. గేటు తెరుచుకొని వో అబ్బాయి, ఆనందరావుని గొడుగులో వరండా మెట్లదాకా తెచ్చి విడిచాడు.

"పొద్దున నాలుగింటికే వస్తానండోయ్!" అని వెళ్ళాడు.


"ఓ, కే!" అని వరండా ఎక్కాడు ఆనందరావు.

● ● ●

జేబులోంచి రుమాలు తీశాడు ఆనందరావు. నెత్తి తుడుచుకొని, మొహంలోకి చిన్న నవ్వు తెచ్చుకొని. ఓసారి సరళవేపూ ఓసారి రామకోటివేపూ చూశాడు దర్జాగా నిలబడుండే.

"ఎట్లా అయితేనేం. యింటికి చేరారే!" అన్నది సరళ కసిగా.

"ఆ. చేరినట్టే. లేకుంటే కొంప



ముతిగేదే!..." ఖైల్డిష్‌గా నవ్వుతూ అన్నాడు ఆనందరావు "...ఇట్లా నాకోసం చూస్తూ తెల్లవార్లూ కూర్చుని జాగారం చేసేవారేగా, యిద్దరూ!"

"ఇంతకీ ఏం చేస్తున్నారట, ఇంత సేపూ ?".

"టూట్లా లేం లేవు. బార్ ఎసోసియేషన్ మీటింగ్ ! !"

"నే ననుకుంటూనే ఉన్నాను !" అన్నట్టుగా కుర్చీలో కదిలి సర్దుకున్నాడు రామకోటి.

"చాల్లెండి; చెబుతున్నారు — హాయిగా ప్రయివేట్ ప్రాక్టీసు పెట్టుకుని కూడా అర్ధరాత్రి వరకూ పనులు ! ... గవర్నమెంటుద్యోగస్తులు నయం; పెందరాళే కొంపకు జేరుకుంటున్నారు ! — ఎండనాడు లేదు; వర్షంనాడు మొదలే లేదు !" అంది సరళ ఉక్రోషం తగ్గక.

"వర్షంకదా, అనే మరి కాస్సేపు కంటిన్యూచేసి మరిన్ని పాయింట్సు డిస్కస్ చేసేం మీటింగులో !" అన్నాడు ఆనందరావు మరింత సరదాగా.

"వెళ్ళి బట్టలు మార్చుకు రావోయ్; భోంచేద్దాం !" అన్నాడు రామకోటి; మాటల్లోకొచ్చిన విసుగు చేత్తో చూపించేస్తూ.

"అరె ! భోంచెయ్యలా ?" అన్నాడు ఆనందరావు; నవ్వుతూనే.

"మీరు రాకుండా యెప్పుడన్నా భోంచేశారా ఏమిటి ?—తొమ్మిది లేదు, పదిలేదు, పదకొండూ లేదు ! — అట్లా నిమిషాల్లు లెక్కపెట్టుకుంటూ కూర్చున్నాం." ఆనందరావు ఆలస్యం చేసినందుకు పశ్చాత్తాప పడకపోయేసరికి సరళకి ఉడుకుబోతుతనం వొచ్చి మాటలు తడబడుతున్నాయి.

ఆనందరావు ఈలేసుకుంటూ లోపలికెళ్ళాడు. సరళ చదరంగం బలంలో ఆఖరు పాన్లు ఒకటో రెండో వుండిపోతే అవి భరిణెలో పోసి, మూత పెట్టేసి రామకోటి వేపు చూసింది. అతను ఆమె చూపునుంచి తప్పించుకొని, వాచీ వేపు చూసి, రాని ఆవలింతకోసం ప్రయత్నించాడు. సరళ తనుకూడా అనుకోకుండా వాచీకేసి చూసింది. పదకొండూ ఇరవై. లేచి, "రా, రాంకోటీ భోంచేద్దాం!" అన్నది, వీలైనంత మృదువుగా. వెనక్కి తిరిగి ఇంట్లోకి వెళ్ళిపోయింది. నడుస్తున్నప్పుడు నాట్యం చేసే ఆమె జడవేపూ నడుం వేపూ పిరుదులవేపూ, చూస్తూ స్తబ్ధమైమత్తుగా కూచుండిపోయాడు రామకోటి. గది ద్వారం వరకూ వెళ్ళి సరళాదేవి గిరుక్కున వెనక్కు తిరిగి చూసింది: ఏదో తెలుసుకుందామన్నట్లుగా.

రామకోటి ఇంకా అలా చూస్తూనే ఉన్నాడు...

● ● ●

ముగ్గురూ భోంచేస్తున్నారు. ఆనందరావు టేబుల్‌కి వెడల్పువేపు ఒక్కడూ కూచున్నాడు; సరళా రామకోటీ టేబిలు పొడుగువేపు ఎదురెదురుగా కూచున్నారు. ఆనందరావు తీరుబాటుగా, దర్జాగా, ఆకలిగా తింటూ, కోర్టులో అడిగిన ధోరణిలో రెండువేపులా వున్న యిద్దర్నీ ప్రశ్నలడుగుతూ కాలక్షేపం చేస్తున్నాడు.

"సో — నువ్వెన్ని గంటల కొచ్చావు, ఇంటికి ?" రామకోటిని.


"ఏడుంబావుకి."

"క్లబ్బుకి పోలేదన్నమాట...!"

"పోలా. అప్పటికే చినుకులొస్తున్నాయి. ఇవాళ క్లబ్బూ లేదు పాడూ లేదని వొచ్చేశా."

"అత నొచ్చేంతవరకూ నువ్వేం జేశావ్ ?" సరళాదేవిని.

"ఏముందేం మహా, చెయ్యటానికి !—వంట పూర్తి చేసుకుని రేడియో పెట్టుక్కూచున్నాను. అంతలోకే అతను రానే వొచ్చాడు...!"



తెల్లటి ఇస్త్రీసూటు వేసుకున్న వో స్ఫురద్రూపి — రైలెక్కుదామని వచ్చి, ఏ పెట్టెలోనూ ఖాళీ లేకపోతే, చివరికి, ఓ పెట్టెదగ్గర నుంచుని "ఈ పెట్టెలోవాళ్ళంతా దిగిపోయి వేరే పెట్టెలోకి వెళ్ళిపోండి. ఇది ఇక్కడ దిగడి పోతుంది..." అన్నాడు.

ప్రయాణీకులంతా కంగారుపడి, దిగిపోయి, వేరే పెట్టెల్లో సర్దుకున్నారు.

అప్పుడు ఆ అసామీ దర్జాగా అందులో యెక్కి, బిచాణా పరిచి, హాయిగా పడుకున్నాడు.

ఎంతసేపటికీ రైలు కదలకపోడంచూసి, ఇవతలికొచ్చి స్టేషను మాష్టరు అలా వెళుతూంటే "రైలు ఇంకా ఎంత లేటు?" అని అడిగాడు.

"రైలు లేటు లేదండి... ఇందాక ఎవరో ఆఫీసరుగారు ఈ పెట్టి తనిఖీచేసి ఇది ఇక్కడ దిగడిపోవాలని ఆర్డర్సు వేసేరు. అందుకని డిస్‌కనెక్టు చేయించేశాం. రైలెళ్ళిపోయి చాలాసేపయింది" అన్నాడు స్టేషను మాష్టరు.

"ఇహ ఎంతకీ నే రాకపోతే చదరంగం వేసుకున్నారేం?" ఇద్దర్నీ.

"అట్లా యేం లేదు... ...ఎనిమిదిన్నరకేమో రాంకోటి మెట్లు దిగి వొచ్చాడు. భోంచేస్తాడేమోనని వడ్డించబోయాను. మీరు రాలేదని తను తిననన్నాడు. ఎవడో పార్టీ వొచ్చి ఆఫీస్‌లో పెద్దసీన్ క్రియేట్ చేసేడంటూ అదంతా చెప్పుకొచ్చేడు... ...ఆమీన చదరంగం వేసుకున్నాం." జవాబుచెప్తూ సరళాదేవి రామకోటివేపు చూసింది "ఏం, అంతేకదూ?" అని అతన్ని సంప్రదించినట్టుంది, ఆ చూపు సందర్భం.

"చదరంగం వేద్దామని యెవరికి స్ఫురించింది?" అన్నాడు ఆనందరావు, వేళాకోళంగా నవ్వుతూ; వాళ్ళిద్దరూ అలా మొహాలు చూసుకుంటున్నారని.

"ఏమిటి, నీ క్రాసెగ్జామినేషను; చస్తున్నాం!" అన్నాడు రామకోటి నవ్వుతూ.

"అది కాదోయ్—" ఆనందరావు విశాలంగా నవ్వేడు. "వర్షం... ... ఉరుములూ మెరుపులూ భయంకరంగా వుంది... నే నేమో నిష్కారణంగా అక్కడ ఇరుక్కుపడిపోతిని — రిక్షాల వాళ్ళేమో, నీ రూపాయకో నమస్కారం బాబూ మేం రాంపో, అంటున్నారాయె... నే నొచ్చేసరికి మీ రిద్దరూ... ... భోంచేసి వెచ్చగా పడుకొంటారేమో; ఇల్లు ప్రోగ్రాంలేని డ్రామావోల్లా ఉంటుందేమో భగవంతుడా — అనుకుంటూనే అక్కడే వుండిపోవలిసొచ్చె; — అందుకు! — ఐయామ్ సోగ్లాడ్! — మీ రిద్దరూ మేలుకొని, పైగా భోజనమయినా చెయ్యకుండా నా కోసం యెదురు చూడ్డం నా కెంత గౌరవం, ఎంత అదృష్టం!" అన్నాడతను; మొదటినుంచి చివరిదాకా నవ్వుతూ.

ఆ మాటలు అట్లా చెప్పవలసింది కాదనీ, అందులో ఏదో వ్యంగ్యం ఉందనీ అనిపించింది రామకోటికి. వెచ్చగా పడుకుంటారేమో అని భయపడ్డం — భోజనాలయినా చెయ్యకుండా యెదురు చూడ్డం అదృష్టం. ఇవి సరిగ్గా ప్రయోగించబడలేదేమో! — అలా కాకుండా "అరెరె: పాపం! నాకోసం నిష్కారణంగా ఆకళ్ళతో కూచున్నారా. వెరీ సారీ—" అని ఏదో తేలిగ్గా అంటే బాగుండేదేమో... లాయరు! మాటలకి అర్థాలుంటాయని తెలుసుకోడం వృత్తిధర్మం. మరి అర్థమున్న మాటలు ప్రయోగించడం యిక్కడ ధర్మమూ అనిపిస్తోంది— అతని ఉద్దేశమేమిటో—? ఆ మాటలు సాధారణమైనవిగా తీసుకొనేటంత మూర్ఖులిక్కడ లేరని తెలీదూ?

"ఎన్ని గేమ్స్ వేశారు?" సరళాదేవి నడిగాడు, ఆనందరావు.

"లెక్కపెట్టలేదు—" సరళ.

"నువ్వు—?" అన్నట్టు; టీచర్ చూసినట్టు; రామకోటివేపు చూశాడు ఆనందరావు.

"మూడు... కాదు నాలుగూ."

"అన్నిసార్లూనువ్వే గెల్చావుగా."

"(; ఓ సారి తను గెల్చుకుంది" అంటూ సరళవేపు చూశాడు రామకోటి. "ఏమిటి, ఇలా అడుగుతున్నాడు; దీనికి అంతూ పొంతూ లేదా?" అన్నట్టుంది ఆ చూపు.

"అబ్బా; ఏమిటి, మీ రిద్దరూ?— లేదూ, ఔనూ, కామూ —! ఇవేనా కబుర్లు?— బోరింగ్."


"భలే! మీరా, మేమా, బోర్ చేస్తోంది?"

"మీరే! ఏమడిగినా సమాధానాలు చెప్పరు: వివరం మాట్లాడరు ... మొహాలు చూసుకుంటూ కూచుంటారు! — నాకూ చెస్ తెలుసుగా; చెప్పరాదు? — పోనీ నేను మా బార్ ఎసోసియేషన్ మీటింగ్ సంగతులు చెబుతానంటే వినరు! — అన్నంతినటం అయ్యేవరకన్నా — కాస్త మాట్లాడరాదా యేం; అయినాలస్యం ఎట్లాగూ అయిపాయె!"

"ఇప్పుడా సంగతులన్నీ దేనికి లేవోయ్; లెవెన్‌థర్టీ దాటిందిగా! చప్పున భోంచేస్తే పడుకోవచ్చుగదా: చలిగా కూడా ఉంది!"

"ఎప్పుడైతే మాత్రం, నాకు తెలీకడుగుతాను; మీ ఎసోసియేషన్ మీటింగులో ముచ్చట్లు మిగిలినవాళ్ళకి రుచిగా వుంటాయటండీ?" అమాయకంనటిస్తూ అడిగింది సరళ.

"ఉండవు! ఏం చేస్తాం? పాలకోసం రాళ్ళు మొయ్యాలి! — నేనున్నంతకాలం నాతోబాటు బాధా:



బార్ ఎసోసియేషనూ, ఎసోసియేషన్ మీటింగ్సూ మీటింగు ముచ్చట్లూ అన్నీ వుంటూ ఉంటాయి. నేనేకాదు; నీకూ అంతే, — నీవన్నీ నీకుంటాయి ... రామకోటి వన్నీ రామకోటికుంటాయి ... అత నాఫీసులో యెవడో పార్టీవొచ్చి ఆగం చేస్తే ఆ సంగతి వొచ్చిందాలేదా? మీ రిద్దరూ చదరంగంలో ఎత్తులూ ఎత్తుకు పైఎత్తులూ — అన్నీ ఉండాల్సిందే! అట్లా!... వి హేవ్ టు పుటప్ విత్ అవర్ సెల్వ్స్... ఇన్ షార్ట్ — ఒకరి న్యూసెన్స్ ఒకరు భరిస్తామని చేసుకునే ఎటర్నల్ అగ్రిమెంటే కదా, మేరేజ్ అంటే! అట్లాంటప్పుడు నా కబుర్లు విన నంటంలో జస్టిస్ ఏముంది?'

సరళాదేవి నిస్సహాయంగా రామకోటి వేపు చూసింది. ఆమె అట్లా చూడకపోతే రామకోటి పట్టి చుకోక పోయేవాడు. వ్యంగ్యం తగిలి గుచ్చుకుంది; ఆ చూపులో తూపు ఎరుపు తెచ్చుకొని ... .. మీ రిద్దరూ చదరంగం ఆట్టం, ఎత్తుకు పై యెత్తూ—ఏంటిదంతా ?

కాని అతను తొందరగానే తేరుకున్నాడు.

చిరునవ్వి నవ్వి '—లాయర్ ననిపించుకున్నానోయ్ !' అన్నాడు.

సరళాదేవికి బలం వచ్చింది, దాంతో. ఆమె కూడా నవ్వింది. "కోర్టులో ఈ ధార రాదులే. వస్తే నీకు మేం కూడా దొంగ యకౌంట్లు చూపించి లంచా లిచ్చుకోవల్సిందే!" అన్నది.

'ఇన్నూనే ఉన్నానుగా !' పకపకా నవ్వాడు ఆనందరావు'... ...ఎటొచ్చీ కేస్‌కాదు ..క్లైంట్?'

మళ్ళీ—

'అబ్బ ! — ఇవాళ ఎంత అసందర్భంగా మాట్లాడుతున్నావోయ్ !'" అని నోటిదాకా వచ్చింది రామకోటికి. బలవంతాన నోరుకట్టుగోగలిగాడు... గుప్తంగా ఉండిపోయిన అశ్లీలాన్ని గుర్తించడం కూడా అశ్లీలతే... ...అదట్లా వదిలేస్తేనే మంచిది.

• • •

ఎవరు కావాలనుకున్నారు, ఇదంతా ?

అప్పట్లో అనుకున్న మాటైతే — సరళే సర్వమని — నిజమే. వ్యవహారంలో ఆనందరావు అడుగుపెట్టాక; ముఖ్యంగా అతనుచేసిన ఎప్రోచ్ చూడగానే — చిన్నదైనా శాశ్వతమైన మార్పు వచ్చింది. కక్కలేక మింగుకోవలసిన పరిస్థితి ఏర్పడ్డది.

ఇప్పుడు తను సరళని ఆ దృష్టితో చూస్తున్నాడా అంటే— అది వొక ప్రశ్నే!—అయినా అది చాలా దారుణం... చూపులూ ఆలోచన్లూ మన కంట్రోల్‌లో ఉండమంటే ఉంటాయా? ఒక్కొక్క చూపు అనుకోనంత, అన్యాయంగా ప్రసరిస్తుంది. ఒక్కొక్క ఆలోచన అనుకోనంత దారుణంగా మెదడుని క్రాస్ చేసి జట్టు నిక్కబొడిపించి వెళ్ళిపోతుంది, దానికీ ప్రవర్తనకీ ఏమీ సంబంధం లేదు. ఆత్మని ఎనలైజ్ చేస్తే ఇవి దొరకవు... ఏదో పని మీద బ్యాంక్‌కి వెళితే ఎవరో చెక్కు మార్చి లెఖ్ఖబెట్టుకుంటున్న డబ్బుకాజెయ్యాలని; ఎవరో్న రిసీవ్ చేసుకోడానికి రైలుస్టేషన్‌కి వెళితే ప్లాట్‌ఫారంమీద కనబడ్డ అందమైన అమ్మాయిని లేవదీసుకుపోవాలని; అర్ధరాత్రిపూట భార్య పట్ల అన్యాయంగా ప్రవర్తిస్తున్న — మొహమేనా యెరగని — పొరుగాయన్ని అప్పటికప్పుడు గోడపగలగొట్టి చితక్కొడదామని — ఎక్కడో ఓచోట, ఏదో దారుణమైన ఆలోచన — కలుగుతూనే ఉంటుంది! మాటల్లో అనువదించిచెప్పడమనే ప్రక్రియ లేకుండా ఆలోచన నిజస్వరూపంలో బైటపడ్డం సంభవమైతే ప్రపంచంలో ఇంత మంది మన్ననా మిగుల్తాయా ? — అనేకం అనుకుంటాం, ఒక్కటైనా చేస్తామా ? ... చెయ్యడం వరకూ ఎందుకు; చెబుతామా ?

వాళ్లు ఈ వూళ్ళో ఉండడం; ఆదరం, ఫార్మాలిటీ కావడం; ఈ కాకతాళీయపు కలిమి కలికాలం నిలుస్తుందా; కాకుంటే ఏదేనా ఆగిపోతుందా ? ఇందులో ఏదీ లేకపోయినా జీవితానికి లోటురాదు ! మరి ? —— ఈ నిరర్ధకమైన అశాశ్వతమైన అర్థాలు తీసుకోడం; ఈ అనర్థాలు ఎందుకని !



ధనాభావంచేత బాధపడుతున్న వో రచయిత తన భార్యతోసహా ఒక పార్టీకి వెళ్ళాడు. అక్కడ ఒక స్నేహితు డిలా అన్నాడు :—

"కవిగారూ ! మీరూ మీ శ్రీమతిగారూ ఈ విందుకి రావడం ఎంతో శోభస్కరంగా వుంది. మీరు విజ్ఞానంగా, మీ శ్రీమతిగారు సౌందర్యంగా, ఈ సమావేశం అలంకృతమై ప్రకాశిస్తోంది. అంతెందుకూ, మీ ఆవిడగారు కట్టుకున్న చీరే వొక మనోహరమైన గేయంలా వుందని చెప్పొచ్చు !"

రచయిత విచార సూచకంగా అంగీకరిస్తూ ఇలా అన్నాడు :—

"ఒక గేయమేం ఖర్మ ! నాలుగు కథానికలూ ఒక నాటికా ఒక గేయమున్నూ—ఆ చీర !"

సరళ... తను ఏ క్షణం ఆమెని బలాత్కరిస్తాడో అన్నట్టు చూస్తున్నట్టుంటుంది ... ... ఆమె చనువూ ధైర్యం మేకపోతు గాంభీర్యం లాగా ... పిరికితనం సంస్కార లక్షణం కాదు... తనని చూడగానే ఆయనింట్లో లేరు రాంకోటీ, తరవాత రా; అనేసరళ సంస్కారంలో తనకి నమ్మకం కుదరదు! — ...

ఆమె మాటలు — అప్పుడప్పుడు ఏదో అంటూనే వుంటుంది; వ్యంగ్యంగా — నాకు ప్రాబ్లెమూ లేదు; నువ్వు సాల్వ్ చెయ్యనక్కర్లేదు! — ఏమో; ఆలోచించకుండా వొచ్చిన మాటేనేమో ?

మరి అతనో ? — అతనేది మాట్లాడినా రెండేసి అర్థాలు సులువుగా తియ్యొచ్చు! — ఇట్లా ఎందుకన్నావు, దీనర్థం యిదికాదా; అని నిలదీస్తే ? — అబ్బే, అదేమిటి; నేనట్లా అనుకొని అన్లేదు; నీకిట్లా తోచిందా ? — ఈ పాడు అర్థం నీకే తోచిందా, ఎవరన్నా చెప్పారా? అని తేలగొట్టే హక్కు వుంది; చాతుర్యం వుంది అతనికి!

—సరళని తనకిచ్చి పెళ్ళిచెయ్యనని వాళ్ళమ్మ చెప్పగానే తనదార్ని తనుపోయి ఆమెని మరిచిపోయుంటే ? — చాలా అన్యాయమైన ఆలోచన! ..కాని అట్లా చేసుంటేనో ఆమె ఎక్కడుండేదో, ఎట్లా వుండేదో, ఎవర్ని పెళ్ళాడేదో !— అయినా ఆనందరావు కామెని చూపించడం; అదంతా చెప్పడం; అతను పెళ్ళాడతానంటే చేసిన సారధ్యం; ఆ సారధ్యంలో స్వార్థ త్యాగాడంబరం; — తన నిలాగా, శిక్షించడం ? ఇట్లా వెంటాడి వెక్కిరించి వోడించడమూ ?

ఇది చాలా అనవసరం... దీనికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు ఏదేనా చెయ్యగలిగితే బాగుణ్ణు...

• • •

భోజనం పూర్తిచేసి, తమలపాకులు వేసుకోకుండా చకచకా మేడ మెట్లెక్కి వెళ్ళిపోయాడు రామకోటి.

"వక్కపొడైనా తీసుకోవేం ?" అంది సరళ, హాలుదాకావచ్చి, అతన్నుద్దేశించి.

అతను వినిపించుకుని కూడా వెనక్కిరాలేదు.

"వక్కపొడేం ఖర్మం!...కిళ్ళీ వేయిద్దాం ఉండు! ... మనకి అతన్తో పనుంది!" అన్నాడు ఆనందరావు, ఆమెవెనకే హాల్లోకొచ్చి.

సరళ అతని మొహంలోకి చూసింది.

వంకీనున్న కోటుజేబులోంచి పొపొట్లాం తీసి, మూడు కిళ్ళీలు తీశాడు ఆనందరావు. "ఇందాక, వర్షమప్పుడు,... ఆ కిళ్ళీ దుకాణం దగ్గిర నిలబడి బాతాఖానీ కొడుతూ వుంటే, దుకాణం అతనిచ్చాడు!" అన్నాడు; దుకాణం అతను ఏదో ఫ్రీగా ఇచ్చినంత దర్పంగా,

"నా కక్కర్లా!" అంది సరళ, మూతిముడిచి.


"ఏమో —?" -

"నల్లకోట్లో వేసి తెస్తారు; కిళ్ళీలూ, పువ్వులూ స్వీట్సూనూ!... ఎట్లా తాకబుద్ధౌతుందేం —? ఛీ పాడు!"

ఆనందరావు పకపకా నవ్వాడు. తమ యిద్దరి మధ్య అలవాటైన చనువైన ధోరణి అంది పుచ్చుకుని అన్నాడు :

"—నల్లరంగులో మహిమ తెలియక దాన్నట్లా చిన్నబుచ్చుతున్నావు సరళా! అంతే ... ఇట్లా చూడు, నా కళ్ళల్లోకి! నల్లనివాడు పద్మ నయనమ్ములవాడు!!... అ రష్యా, అమెరికాపర్యంతం కావ్యాల దగ్గర్నుంచీ కాస్మిక్ సైన్సెస్ వరకూ నల్లని అచ్చులో కదంటే, వేస్తారు! నల్లనిరాత్రిలోనే చల్లని అల్లరు జరుగుతాయన్నది తేటతెల్లం కదే, పిల్లా! లాస్ట్ బట్ నాట్ లీస్ట్!— నల్లకోటు న్యాయానికీ నిజానికీ ప్రతినిధని తెల్లవాడే ఒప్పుకొని ఫిక్స్ చేసేడు సరళా!"

ధోరణిలో చనువూ, మెత్తదనం సరళని స్వాధీన పర్చుకోగా, ఆమె కళ్ళనిండా ఆహ్లాదం నింపుకొని, నోరు నిండుగా తెరిచింది... ఆనందరావు కిళ్ళీ చుట్టూ వున్న కాగితాన్ని సుతారంగా, అలస్యంగా తగుస్తూ ఆమె నోటిని సాధ్యమైనంత సేపు తెరిపించి ఉంచినట్టు



ఆ చర్యద్వారా వ్యక్తం చేసేడు; తరవాత అతను కిళ్ళీ ఆమె నోట్లో స్వయంగా వుంచాడు: ఊరించి నోరు తెరిపించి ఉంచినందుకు కసితో లటుక్కున అతని వేలు కాటు వెయ్యబోయింది సరళ. ఆనందరావు తెలివిగా చటుక్కున లాగేశాడు.

నవ్వుతూ— "పద మా ఫ్రెండు నిద్రపోతాడో యేమో అతన్తో పనుంది నాకు!" అన్నాడతను, ఆమె నడుంమీద చెయ్యేసి లాక్కెళుతూ.

"నేను కూడా యెందుకులే: మీరెళ్ళండి— ఊళ్ళో పన్లన్నీ సరి రాత్రివరకూ ఒక్కళ్ళూ చక్కబెట్టు కొస్తారు గానీ, మా ఫ్రెండు దగ్గిర ఇంత పని బడేసరికేమో, నే గావాలి!" అని మురిపించి వెనక్కి బరువు వేసింది సరళ.

"పోనీవోయ్! రేపట్నుంచీ ఊళ్లో పన్లక్కూడా నువ్వు సాయం ఒస్తే పోలా!" అంటూ మరి కొంచెం బలంతో ఆమెను నెట్టుకుపోయాడు ఆనందరావు.

వాళ్ళిద్దరూ వెళ్ళేసరికి రామకోటి మంచం మీద పడుకొని వున్నాడు. టేబిల్ లైటు వేసుకొని నిద్రకోసం ఏదో మేగజైన్ తెరిచి చూస్తున్నాడు. వాళ్ళని చూడగానే అతను మంచంమీద లేచికూర్చుని బార్‌లైట్ స్విచ్ వేశాడు. ఆనందరావు కిళ్ళీ యిచ్చాడు. అతను "థేంక్స్" అని నోట్లో వేసుకున్నాడు.

"కూర్చోండి!" అన్నట్లు ఎదురుగావున్న సోఫా చూపించేడు రామకోటి.

"కూర్చోటం గాదు. నువ్వే లేచి రావాలి... ఆ రాజమ్మగారి ట్రంకు పెట్టెలు — రేదర్ బోషాణాలు — కింది వసారాలో పెట్టాలి."

"ఇప్పుడా? పొద్దున పెట్ట రాదూ?"

"లేదు లే దిప్పుడే ... ఇంతకు ముందు నన్ను కార్లో డ్రాప్ చేసి వెళ్ళాడుగా, అతను రాజమ్మగారబ్బాయే ... పొద్దున నాలుగ్గంటలకు లారీ తీసుకు వస్తాట్ట అప్పుడు మళ్లీ నువు నిద్ర లేవటం దేనికి!— ఎట్లాగో యిప్పుడే కింది వసారాలో పెట్టేస్తిమా, పొద్దుట వాళ్ళు లారీకెత్తుకుపోతారు."

రాజమ్మగారు, ఇంటి వోనర్. రెండు బోషాణా లంతేసి ట్రంకు పెట్టెలు పూర్వం ఆనందరావు మేడ మీది వాటాలో ఉండే రోజుల్లో అతని కస్టడీలో వుంచేరు. బరువూ. ఎవరైనా మేడ మీది వాటా కొచ్చాక, అంతగా తీసెయ్యమంటే అప్పుడే తియ్యొచ్చులే అని వుంచేసిన పెట్టెలు: ఆ వాటాలో దిగింది రామకోటి కావడాన్నీ, అంతగా ఖాళీ చెయ్యవలసిన వొత్తిడి లేకపోవడాన్నీ అక్కడే విడిచి పెట్టేశారు.

"సరే, పద!"

ముగ్గురూ మధ్య గదిలోకి

వెళ్ళారు. ఆ పెట్టెలమీద ఏవో చిల్లర వస్తువులుంటే తీసేశాడు రామకోటి. వెంటనే ప్రక్కల్నున్న హేండిల్స్ పట్టుకొని పెట్టె ఎత్తడానికి ప్రయత్నించాడు ఆనందరావు. "ముదనష్టం పెట్టె! ఆ రాజమ్మకంటే కూడా బరువుగా వుందే; దీని సిగ్గోయ్య!" అన్నాడు.

రామకోటి నవ్వాడు. "ఆమెని కూడా వోసారి ఎత్తుకొని చూశావట్టుందే!"

"ఆమెనా?—ఎత్తుకుని చూడాల్సిందేగాని ఈమె యామంటుందో నని చూస్తున్నా." ఆనందరావు సరళకేసి చూసి నవ్వుతూ అన్నాడు... "అట్లావూరికే చూస్తూ నుంచోకపోతే వోచెయ్యి వెయ్య రాదూ?"

"ఎందుకు—; వుండు!" రామకోటి అవతలి గొళ్ళెం పట్టుకుని ఎత్తి "ఇప్పుడు లేపు." అన్నాడు.

"ఇందులో ఏం బెట్టి దబ్బా; ఇంత బరువుంది!" అన్నాడు ఆనందరావు. నాలుగడుగులు నడిచారు. "అబ్బ! నా చేతులు నొస్తున్నె. ఉండుండు... దించుకొస్త!" అన్నాడు.

అరిచేతులు రెండూ వొకదాంతో వొకటి రాసుకుంటూ, నోటితో వూదుకుంటూ "అబ్బా! ఎట్లా కందినయ్యో;" అన్నాడు ఆనందరావు. "ఇదే పూర్వకాలంలో అయితేనా?" అన్నాడు, సరళకేసి చూస్తూ.

సరళ నవ్వుకుంటూ అన్నది:

"నాథా! మీ సుకుమార హస్తంబులు నొచ్చుచున్నవా?—అయ్యో! ఈ పాపిష్టి కన్నులతో ఎట్టి విపత్కర దృశ్యముం జూడవలసి వచ్చె! — ఈ సమయంబున నుపయోగపడని నా యీ టెర్లిన్ చీరయేల; కాల్పనా?—హా! దుర్విధి!!"

"ఆగాగు; నాకో అయిడియా తట్టింది!" అన్నాడు ఆనందరావు. "ఇక్కడే ఉండండి" చరచరా క్రిందికి వెళ్ళాడు.

రామకోటీ సర్లాదేవీ అతను వెళ్తున్న వేపుకి క్షణకాలం ఆశ్చర్య పడుతూన్నట్టు చూసేరు. వెంటనే ఒకరి కళ్ళలో కొకరు చూసుకొని, వెను వెంటనే చూపులు మళ్ళించుకొన్నారు.

పదిహేను సెకన్లు గడిచాయి. ఎక్కడో గడియారం పన్నెండు గంటలు కొడుతోంది... వులిక్కిపడ్డారిద్దరూ, అనుకోకుండా అనవసరంగా అర్ధరాత్రి పన్నెండు కావడం, అప్పుడు మెలకువగా వుండడం: విశేషించి ఏకాంతంగా ఉండడం: వారిద్దరికీ ఇదివర కెన్నడూ జరగ లేదు గాని: ఇందులో ఏం ప్రత్యేకత లేనట్టు గుర్తించే చైతన్యం ఒకరికీ కలగలేదు ... మళ్ళీ యిద్దరూ మొహాలు చూసుకున్నారు.

సరళాదేవి తనవేపు చూడగానే, భోజనం దగ్గిర ఆనందరావాడిన మాటలు జ్ఞాపకం వొచ్చాయి రామకోటికి. వాటిని గురించి ఆమెతో

చర్చిద్దామన్నంత ప్రేరేపణ కలిగింది కాని అదీ మంచిదిగాదన్న నిశ్చయానికూడా వెంటనే వచ్చేశాడతను ... ఎంతైనా వాళ్ళిద్దరూ వొకటి, తను వేరు! ఛీ. భరించవలసినదే, సభ్యత! — నీచమైన భావాన్ని మనసులో చర్చించడం కంటే బహిరంగంగా చర్చించడమే యెక్కువ నీచంగా పరిగణించబడుతోంది ... ఆ సంగతి గుర్తించి, భయపడి, అతను బొమ్మలా, నిలబడి బాధపడసాగాడు.

రామకోటి అలా నుంచోడం చూసి సరళ ఏమీ తోచనిదానా అయిపోయింది. ఓసారి ఆ పెట్టె హేండిల్‌లో చెయ్యిదూర్చి ఎత్తబోయింది. పెట్టె కదల్లేదసలు. "అబ్బ! ఏం దాచిందో, ఇందుట్లో!" అంది.

ఆమె పైటచెంగు బిగించుకోడం, వంగోడం దగ్గర్నుంచీ హేండిల్లోంచి చెయ్యి తీసెయ్యడం వరకూ అన్నీ చూసి; ఆమె విడుస్తున్న నిట్టూర్పు దగ్గర్నుంచీ అన్నమాటవరకూ అంతా వినీ కూడా, సమాధానం చెప్పక్కర్లేదన్నట్టు నుంచున్నాడు రామకోటి.

ఒకసారి ఆమె వేపు చూసి; వెంటనే ఇద్దరి మధ్యా నిక్షిప్తమైనా శక్తివంతంగా పడున్న ఆ పెట్టెవేపు చూశాడు రామకోటి. తా మిద్దరూ ఇంత నిశ్శబ్దంగా ఉండవలసిన పరిస్థితి కాదు; అప్పుడూ ఇప్పుడూ కూడాను; కాని నేడేదో జరుగరానిది జరిగినట్లు, తన్మూలంగా, అనే ప్రతీమాటా అశ్లీలమై పోతుందేమో అన్నట్లూ ఇద్దరూ సంకోచిస్తూ వుండడం అతన్ని చాలా దుఃఖపెట్టింది. ఇంతలా నేరంలేని శిక్ష కెవ్వరూ అంగీకరించలేరు.

సరళాదేవి కేమీ తోచలేదు. ఆమె రెండో పెట్టె దగ్గర కెళ్ళింది. అది ఎత్తుదామనో, ఏమో, ఆమె ఉద్దేశం ఆమెకే తెలియదు!...

చప్పుడైంది... ఆనందరావు కాళ్ళూ గొంతూ చప్పుడు చేసుకుంటూ, "ఆఁ.. వొచ్చేస్తున్నా! ... వొచ్చేశా!!" అంటూ వొచ్చాడు.

"అట్లా యెందుకూ. గొడవ చేసుకుంటూ రావటం?—అతను లేని యీ ఒక్క నిమిషంలోనూ మనం యిద్దరం ఏమన్నా—?" అన్నట్టు. సరళాదేవి అతని గొడవైనా భరించగలదుగాని యితని చూపు భరించలేదన్నట్లు భయంగా చూస్తూ చీరచెంగు చేతుల్లో జోరుగా మెలితిప్పేస్తోంది.

"అట్లా టెరిలిన్ చీరలు మెలితిప్పుకోరు ఫ్రెండూ-పూర్వకాలంలో నూలుచీరలట్లా-" అని సరళాదేవిని వేళాకోళం చేసి, ఆనందరావు: "ఇదుగో రాంకోటీ: — ఈ గుడ్డ చేతికి చుట్టుకొని ఎత్తు. ఇది నీకు: ఇది నాకు!" రెండు మాసిన తుండు గుడ్డలు తెచ్చాడు: అవి పంచాడు యిద్దరికీ.

గుడ్డలు చేతులకి చుట్టుకున్నాక పని తేలికైంది.

మెట్లు చివరిదాకా దిగేసిన తర్వాత "అమ్మయ్య!" అన్నాడు ఆనందరావు... "భలే, చావొచ్చి పడిందే, దీందుంపతెగా!"

రెండో పెట్టె ఇంకా కొంచెం ఎక్కువ బరువే అనిపించింది. ఈసారి ఆనందరావు ముందుగా దిగుతున్నాడు మెట్లు.

"పాత పగలుంటే బలే తీర్చుకోవచ్చులే, ఈ పెట్టెల్తో... ఏముందీ, ఆ మెట్లు టర్నింగ్ తిరిగిన దగ్గర కాస్తా వెనక హేండిల్ ఒదిలి పెట్టేది—దెబ్బతో సాఫ్!—"అన్నాడు ఆనందరావు నవ్వుతూ. "జాగర్త సుమా రాంకోటీ! టర్నింగ్ దగ్గిర కొస్తున్నాం. హేండిల్ ఒదిలిపెట్టావంటే యింకేంలా... ఒక్కసారిగా అడ్డు తీరిపోవాల్సిందే!"

"అంత సుళువుగా ఎట్లా తీరిపోతాయి, అడ్డు? ఆవతల నా పెళ్ళామో—?" అనుకున్నాడు రామకోటి.

అనుకోడమేమిటి, అప్రయత్నంగా, ప్రమాదవశాన; అతని చెయ్యి జారిపోవడమేమిటి!— పెట్టె ధఢ్‌మని ఆనందరావు మీదికి తూలింది. మోకాళ్ళమీద అంచు బలంగా అనుకొని, ఆ దెబ్బకు చతికిలపడిపోయాడు. కూర్చున్నమనిషి మీద పెట్టె బరువంతా ఆనుకోగా అతను తట్టుకోలేక, క్రింది మెట్టు మీదికి, తరువాతి మెట్టుమీదికి ఆ తరువాతి మెట్టుమీదికి, దాంతరువాత మెట్టుమీదికి, అట్లా, ఒరిగి, జరిగిపోవడం. పెట్టెకి వేరే ఆధారం లేక పెనుభూతంలా ఎప్పటికప్పుడు మీదపడుతూ వుండడం! — ఒళ్ళు, పెట్టెకీ గోడకీ మధ్యపడి నలిగిపోవడం — ఇలా జరిగిపోతోంది.

ఇంతలోకే తన చేతులు స్వాధీనంలోకి తెచ్చుకొని, అతన్ని కాపాడదామని ఆదుర్దాగా వొస్తున్న రామకోటి మొహంలో, ఈ హత్యాకాండ పూర్తి చేసేందు కేర్పడిన క్రౌర్యం కనబడింది, ఆనందరావుకి. ఆ గాభరాలో, ప్రాణరక్షణకోసం జీవి చేసే అంతిమ ప్రళయ ప్రయత్నంలో, ఆనందరావు పెట్టె హేండిల్లోంచి చెయ్యి వదలడం, పెట్టె జోరుకన్నా రెండడుగులు ఎక్కువగా వెయ్యడం; పెట్టె అతనికి మూడు మెట్లు మీదుగా అస్తవ్యస్తంగా నిల్చిపోడం జరిగాయి. పడ్డపాటూ, తిన్నదెబ్బలూ, అనుభవిస్తున్న అవమాన రోషాలూ, ఆవహించిన మృత్యుభయం, ఆనందరావు ముఖాన్ని చాలా వికృతంగా చేశాయి.

"సారీ ఆనంద్: పొరపాటైంది, చెయ్యి జారింది." అన్న రామకోటి మాటలు అతనికి వినిపించలేదు. అతను నిటారుగా నుంచొని, చొక్కా దెబ్బలమీదికి లాక్కొని, పిడికిలి గట్టిగా బిగించి, "రా!" అని ఊపిరి పీల్చి మూతి బిగించాడు. రామకోటి తనకి అందీ అందనంత

దూరం రాగానే అతని మీదికి లంఘించి, 'కావాలనేచేస్తావురా! .. ర్రాస్కెల్!' అని మాట కొక గుద్దు చొప్పున, సెకండు కొక గుద్దు చొప్పున, మొహంమీద, మెడమీద, బలంగా గుద్దేశాడు. రామకోటికి ఆశ్చర్య పడేటందుకు టైమ్ లేనట్టు స్ఫురించింది. ఆరోపణలో దూషణకంటె, ఆఘాతంలో శిక్ష బలంగా తగిలి, అతన్ని మరుక్షణం ప్రతీకారానికి పురికొల్పింది... అతను ఎడం చేత్తో ఆనందరావు జుట్టు పట్టుకుని, కుడి చెయ్యి పిడికిలి బిగించి అతని డొక్కలో బలంగా పొడిచాడు.

'అమ్మా!' అన్నాడు ఆనందరావు 'అవకాశంకోసం చూస్తున్నావురా! ... ఇడియట్!' అని అతను మళ్ళీ తిరగబడి రామకోటి వీపుమీద, నెత్తిమీద, రెండు గుద్దులు వేశాడు. రామకోటి కిందబడి, మళ్ళీ లేచాడు. రెండుచేతులూ కలిపి, వాలీబాల్ ఆడినప్పట్లా బాదసాగాడు.

నిర్ఘాంతపడి చూస్తున్న సరళ, చూస్తున్నది నమ్మలేనంత చిత్రంగా, అసహ్యంగా తోచి మేడ వసారాలో పిట్టగోడ ప్రక్కన ఒక్కక్షణం అట్టే నుంచుంది. చకచకా మెట్టుదిగి వచ్చేలోగా ఆమెకి భోరున ఏడుపొచ్చేసింది. 'అమ్మో!... ...' ఇద్దరూ బలిష్ఠులు; ఆరోగ్యవంతులు. పొట్టేళ్ళలా ఢీకొంటున్నారు. వాళ్ళని ఎవరేనా ఆపగలరా ? ఆ మధ్యకి వెళితే ప్రాణాలు పోతాయేమో. పోతేపోనీ ...—ఏడ్చేస్తూ సరళ, వాళ్ళిద్దరూ మళ్ళీ తలపడే వేళకి ఇద్దరిమధ్యా యిరుక్కొని, రెండుచేతులూ బారజాపి, యిద్దర్నీ కౌగలించుకొంది. 'బాబోయ్ ఆపండి. నే చచ్చిపోతా!' అని పెద్ద కేకపెట్టింది; ఏడుస్తూనే.

ఆనందరావు యిక తట్టుకోలేని నీరసంలో ఆమె మీద ఒరిగాడు.

రామకోటికి తెలివొచ్చింది... త్రిభుజం మూడు బిందువులూ ఒక్కచోట కలుసుకున్నాయి. నూటెనభై డిగ్రీలుమూడువందఅరవైఅయ్యాయి. అక్కడున్నది ఒక ఆడదీ, ఆమె భర్తా, ఆమె మాజీ ప్రేమికుడూ కాదు ... ఆమె స్పర్శలో తల్లీ, చెల్లీ, పెళ్ళాం, పిల్లా ఒక్కసారే చూపట్టేరు. అత్మ చేసిన పరాభవాగ్నిలో అతనుదగ్ధమై పశ్చాత్తాప తేజస్సులో పునఃప్రభవించేడు... వెంటనే ఆమెని ఆ త్రిహృదయ పరిష్వంగంలోంచి తప్పిచాడు. 'లే సరళా' అన్నాడు మెత్తగా—సరళ అనుమానంగా చూసి అంతలోనే నమ్మకం తెచ్చుకొంది.

మరుక్షణంలో అతను ఆనందరావుని ఎత్తుకొని, మోసుకొని, పడకగదిలోకి తీసుకుపోయాడు... సరళ కంగారుగా అతన్ని అనుసరించింది. రామకోటిని ఉద్దేశించి తిట్లూ కృతజ్ఞతా వాక్యాలూ ఆమె గొంతులో కలగా పులగంగా గురగుర మంటున్నాయి, ఒక్కటీ బైటి కూడిపడ్డంలేదు.

మంచంమీద పడుకోబెట్టాడు, ఆనందరావుని. పెట్టెకీ, మెట్లకూ, గోడకూ మధ్యపడి, నలిగిపోయిన గీసుకు పోయిన అతని చర్మభాగాల్ని చేత్తో నిమిరాడు. స్రవిస్తున్న రక్త బిందువుల్ని అరిచేత్తో తుడిచేశాడు, తొందరగా. క్షణంలో సగం సేపు సరళ వేపు చూసి, 'దూది, అయొడీన్ ఉండాలే, తెలుసా ? — తే!' అన్నాడు.

సరళకి జవాబు చెప్పడానికూడా తోచలేదు. ఇక్కడ నీ చేతుల్లో ఈయన్నొదిలి నేవెళతానా అని మూర్ఖంగా క్షణకాలంనుంచుని అలాంటి భావం కలిగినందుకు సిగ్గుపడింది. రామకోటి కిదంతా తెలుసా అన్నట్టు అతని కళ్ళల్లోకి భయంగా అందోళనగా చూసింది. రామకోటి పైజమా జేబులోంచి రుమాలు తీశాడు. చించేటట్టు పట్టుకున్నాడు. ముక్కలుగా చించుతాడని స్ఫురించగానే తన చీరవేపు చూసుకుంది సరళ. క్షణకాలం ఆమెకి, కొద్దిసేపటి క్రితం తానాడిన మాటలు వృథాగా జ్ఞాపకం వొచ్చాయి. అశుభం సూచించినానేమో అని అనుమానం కలిగింది. ఇంతకీ సరైన సమయంలో చీర చించి గాయాలకి కట్టేందుకు ఉపయోగించలేక పోతున్నానే అని చిన్నబుచ్చుకుంది. ఇదేమిటి నీరసం అని హేళన చేసుకుంది.– చివరికి ఆ అనవసరప్రసంగం మీద, అంతకంటే అనవసరమైన ఈ సంఘర్షణమీద అసహ్యంవేసి, తన మీద తనకే విసుగు పుట్టింది. ఆ విసుగులో చిరాకుపడి, అలమారు దగ్గరకెళ్ళి, తలుపుతెరిచి, బాక్సులో దూదీ, అయొడీన్, పుడకా తెచ్చింది.

గాయాలన్నీ ఓపిగ్గా తెరిచి, ఒక్కొక్కదానికే శ్రద్ధగా అయొడిన్ పూశాడు రామకోటి... ఒళ్ళంతా నెప్పులుగా ఉంది. మధ్య మధ్య తడుముకుంటూ సిగ్గుపడ్డాడు ... అయినా చేసేదేం లేదు ... 'మొహం పగలగొట్టాడు ఆనందరావు!'... కళ్ళ కింద చర్మం పొంగి, కళ్ళకే కనబడిపోతోంది... అటుచూస్తే, అలా అనుకుంటే, కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి... తుడుచుకోడానికూడా టైమ్ లేదు... వ్యవధివున్నా, సమయం కాని సమయం...

ఆనందరావు గాయాలపని అయిపోగానే మాట్లాడకుండా బైటికొచ్చేశాడు రామకోటి. అతనేమైనా చెబుతాడేమో; అతనికేమైనా చెప్పాలో యేమో, ముఖ్యంగా అతని దెబ్బల మాటేమైనా చూడాలేమోనని, సందేహంగా, అనుమానంగా, ఆశగా, అతనివేపు చూస్తూ అతని ప్రతీ చర్యనీ గమనిస్తూ అలా నుంచుండిపోయింది సరళ ... చివరికతనేమీ మాట్లాడకనే వెళ్ళిపోయేసరికి, ఆమె చాలా చిన్నబుచ్చుకుంది. అవును! నా అంత వ్యర్థురాలికోసం చావుదెబ్బలు కొట్టుకొని, ఇంకా నన్నీ మొగాళ్ళిద్దరూ ఏం గౌరవిస్తారు! — అనుకొంది. మరుక్షణంలో ఈ ఆత్మనిందకు ఎంతో ఖేదపడింది ఆమె.

మేడమెట్ల దగ్గరకొచ్చాడు రామకోటి. మూడో మెట్టుకీ నాలుగో మెట్టుకీ మధ్య, రెండిటిమీదా, ఆ బరువైన ట్రంకుపెట్టె అడ్డంగా అస్తవ్యస్తంగా పడివుంది. దాన్నలా వదిలి తన దారిని తను పోలేక పోయాడు. తెల్లారుజామున వాళ్ళొస్తారు. ఇది గమ్యస్థానానికి రెండడుగులు ముందుగానే ఆగిపోడం గురించి వాళ్ళు ఏదేనా ఎందుకు అనుకోవాలసలు ? — అని, ఒక్క చేతిమీదుగానే పెట్టెని ఈడ్చేసి, దిగువకి లాగి, మొదటిపెట్టె వుండే వేపు తోసేశాడు. పెద్ద చప్పుడైంది; చేతినిండా దుమ్ము—రక్తం మరకలూ ...

హాల్లో వాష్‌బేసిన్ దగ్గరకెళ్ళి, అద్దంలో, చితికిన, పొంగిన, తన మొహం చూసుకుంటూ, సబ్బురాసి చేతులు కడిగేసుకున్నాడు: అద్దంలోంచి, గదిలో మంచం కనిపిస్తోంది. సరళ, మంచంమీద ఏటవాలుగా కూర్చునివుంది. ఆనందరావు తలని ఆమె తన రొమ్ముమీద పెట్టుకొని, అతని వీపుమీద నిమురుతోంది ... అద్దంలో చూసిందీ చైటుచూసేదీ వొక్కటే ... అయినా అతను గదివేపుకు తిరిగి, క్షణకాలం, ఆ సుందర దృశ్యాన్ని తనకి చేతనైనంత ఎప్రీసియేషన్‌తో చూశాడు. ... ఆ వక్షంమీద విశ్రాంతి తీసుకునేతల ... ఎన్ని వేల విలువ చేసునో !!

• • •

తెల్లవారింది.

రామకోటి డ్రెస్ చేసుకున్నాడు. ప్రొద్దున్నే ఎక్కడికీ వెళ్ళే అలవాటు లేదు ... చేసుకోవాలి అలవాటు ... ఈ కాఫీలూ భోజనాలూ మానేస్తే — చాలా దూరంగా ఉండొచ్చును! ... తన ప్రశ్నకి ప్రమాదం లేని పద్ధతిలో సమాధానం కుదిరినట్టు తాత్కాలికంగా తృప్తిగా ఉంది ... ... రేపణ్ణుంచీ ప్యూన్‌ని పొద్దుటే అరింటికి రమ్మని చెప్పాలి.

మెట్లు దిగుతో వోరగా చూశాడు. ఆనందరావు గదిలో కూర్చున్నాడు. అతన్ని చూసి వెళ్ళాలిసిందే.

'గుడ్‌మార్నింగ్. రా' అన్నాడు ఆనందరావు, చిరునవ్వుతో. 'అయామ్ సారీ, రాంకోటీ! ... ఇద్దరికిద్దరం అంత బ్రూట్స్‌లా ప్రవర్తిస్తామనుకోలేదు ... చదువూ సంస్కారం ఒక్కసారి ఎక్కడికి పోయినయ్యో — ఆశ్చర్యం!'

రామకోటి రెండు ట్రంకు పెట్టెలు నెత్తిమీంచి దిగినంత రిలీఫ్ పొందేడు. అతని మొహం నవ్వు పోసుకొంది.

'అంతే—ఆ మాత్రం పోట్లాడే శక్తి కూడా, ఐమీన్ ప్రాక్టీస్— ఉండాలేమో!'

"చాలా థేంక్స్‌య్ ... రాత్రి చాలా శ్రమపడ్డావు, ఈ గాయాల కోసం!"

మళ్ళీ శేషా ? ... ఛీ! ... ఇది తన వ్యాధేనేమో ఒకవేళ! — రామకోటి నో మెన్షన్ చెప్పడం మరిచిపోయాడు.

గదిలో అలికిడి విని, సరళాదేవి గది గుమ్మందాకా వొచ్చి తొంగి చూసింది. ఆమె తొంగిచూడ్డం రామకోటి చూశాడు. ఎవరి కళ్ళల్లోనూ ఏ భావం లేకుండా మళ్ళీ చూపులు కలుసుకున్నాయి. ఏదో పని స్ఫురించి సరళ లోపలికెళ్ళింది

'అట్లా బైటికి పోయొస్తా' లేచి వెళ్ళాడు రామకోటి.

సరళ డైనింగ్ హాల్లోంచివస్తూ అతన్ని చూసింది. పిలవడానికామెకి నోరు విడలేదు. కంగారుగా సరాసరి గదిలోకి వెళ్ళిపోయింది, భర్తతో చెబుదామని. కాని తీరా అక్కడికెళ్ళాక ఆయనతోనైనా ఎట్లా చెప్పాలో తెలియక, అతనివేపు తెల్లమొహం వేసి చూస్తూ నుంచుంది.

అతనూ చూశాడు ... కాని ఏమిటలా ఉన్నావని అడగలేదు. పది పదిహేను సెకన్లు ఆగింది.

"రాంకోటి—' అని గోడవేపు తిరిగిపోయింది సరళాదేవి ... ... "హొటలుకి పోతున్నాడు కాఫీకి!"

'అరెరె!' అని నవ్వుకుంటూ లేచాడు ఆనందరావు. కుంటుతూ అయినా చకచకా నడిచి వెళ్ళాడు. గేటు దగ్గర రిక్షా పిల్చి నుంచున్న రామకోటిని కలుసుకున్నాడు. నడుంమీద చెయ్యేసి అతన్ని పట్టుకుని, మృదువుగా, "లోపలికి రా రాంకోటీ!' అన్నాడు; లాక్కొచ్చేశాడు ... ఇద్దరూ వరండాలో కొచ్చారు.

"వొదిలిపెట్టు. గిలిగింత లవుతున్నాయి.'

నడుం ఒదిలిపెట్టి చేతులురెండూ పట్టుకున్నాడు ఆనందరావు ... 'రాత్రి ఏదో నిషాలో ... బ్రూట్స్ అయ్యామని ... పగలు — ఇప్పుడు కూడానా రాంకోటి! ...'

సంపాదకుడు : "ఇంత పెద్ద నవల పట్టుకొచ్చారు. చదవడానికి నాకు తీరిక లేదండీ."

రచయిత : "పోనీ సీరియల్‌గా వేసుకోండి. తీరిగ్గా నెల నెలా చదువుకోవచ్చు."

— యస్. యస్. మూర్తి, హైదరాబాదు.

...ఏదో కాలు జారింది. తీసేసుకున్నాం— మనిద్దరం: పోనీ మనం ముగ్గురం నోరు జారితే ఎంత ఆశ్చర్యంగా వుంటుందో నేన్నీకు చెప్పాలా రాంకోటీ—చెప్పు! మన మధ్య ఏం జరిగిందంటావు, అసలు?'

ప్రతీ మాటా రామకోటి మనస్సును సున్నితంగా తాకింది. స్నేహంతో మత్తెక్కిన అతని మనస్సులో, ఆ మాటల్ని వేరేవిధంగా అర్థం చేసుకోడానికి కావలసిన రెసిస్టెన్స్ లేదు.

'అవును ... ఏమీ జరగలేదు.'

మళ్ళీ నడుంమీద చెయ్యి వేసి, తన నడుంమీదుగా అతని చెయ్యి లాక్కుని, గది గుమ్మం దాకాతెచ్చి విడిచాడు ఆనందరావు. చాలా మర్యాదగా. 'ఇదుగో నమ్మా, నీ మిత్రుడు. నువ్వు నావల్ల అతన్నెప్పుడూ పోగొట్టుకోలేవు' అన్నాడు. సరళ ఇటు తిరుగుతూనే రామకోటి కళ్ళలోకి చూసింది కృతజ్ఞతతో. స్నేహాభిలాషతో, ఆమె కన్నులు మెరుస్తున్నాయి, చెమరుస్తున్నాయి.

'కాఫీకి లేటయ్యావు రాంకోటి! వెళ్ళు!' అన్నాడు ఆనందరావు: మంచం ఎక్కి న్యూస్ పేపర్లో మునిగిపోతూ.

● ● ●

రెండు నిమిషాల తరవాత డైనింగ్ టేబిల్ దగ్గర నుంచుంది సరళ. ఎదురుగా కుర్చీలో కూర్చుని రామకోటి టిఫిన్ తింటున్నాడు. ఆమె అతన్నిచూస్తూ తనని తాను జూసుకుంటోంది.

'... ఇంకా ప్రేమిస్తున్నాడు, నన్ను! ... నన్నే కాదు, నన్ను పెళ్ళాడిన వాణ్ణికూడా ప్రేమిస్తున్నాడితను! ...నన్ను క్షమించాలి రాంకోటీ—సి విషయంలో దిద్దుకోలేని పొరపాటు చేసేను ... రాత్రి నీకు జరిగిన అన్యాయాన్ని; నీమీద పడ్డ ఆరోపణనీ మరిచి మళ్ళీ ఈ జన్మలో నన్ను నీ మనస్సులో పెట్టుకుంటావనుకోలేదు... నిన్ను పోగొట్టుకోడానికి నా కెన్నడూ బలంచాలదు. నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోకు రాంకోటీ—'

హటాత్తుగా రామకోటి తలెత్తి చూశాడు. అతననుకున్నది నిజమే, ఆమె చేతిమీద రాలినవి అశ్రువులే. ఆమె కన్నులనుంచి ధారగా వస్తున్నాయి... అతను ఏం చెయ్యాలో తోచక జేబులోంచి రుమాలు తీసి ఇచ్చి ఆ కళ్ళవేపే చూస్తూ కూచున్నాడు.

కన్నుల చెరువుల్లో, కన్నీళ్ళ లోతుల్లో, కనరాని రహస్యాల్ని, కన్నార్పక కనిపెడుతున్నాడని, గమనించింది సరళ. వెంటనే అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

● ● ●

రామకోటి నవ్వుకున్నాడు.

ఈ బంధం యింతేగాబోలు! ఇది తెలుసుకుందామని చేసే ప్రయత్నం దీన్ని పెంచి ఊరుకుంటోంది, చిత్రం! ... తెగదు — ఇంతకన్నా పెరగదు ఒకవేళ పెంచుకుంటే తెంచుకోటం సాధ్యమేమో. ఈ పెంచుకోడం తెంచుకోడం దీంట్లో ఏది మంచో ఎంచుకోడం తెలీడం లేదు!

లోకుల 'దృష్టిలో ఏమిటో తమ అనుబంధం' అన్న జిజ్ఞాస వుండేది పూర్వం: తామేమిటో తమకి తెలిసిపోయినట్లు!— నిజానికి అది ఇప్పటివరకూ తెలియనేలేదు! — సామాన్యంలో సమున్నతమైన సంస్కారమా యిది? ముగ్గురికీ స్నేహమే ఆహారం, స్నేహమే వ్యసనం. రంగురంగుల స్నేహం!— ముగ్గురిలో ప్రతీ ఒక్కరికీ మిగతా యిద్దరిమీదా ఈఅనుమానాలెఖిటో మరి! ...ఆనందరావుకి– తనని చంపెయ్యాలని కుట్ర చేస్తున్నారని అనుమానం! ఆ హుషారులో ఆ హాస్యప్రియత్వంలో యింత ప్రాణభయం దాగి ఉందా?— సరళకీ ఉంది— ఈ మొగాళ్ళిద్దరూ కలిసి తనకి పాతివ్రత్య పరీక్షపెట్టి తనువేసే ప్రతీ అడుగూ పరీక్షిస్తూ తను ఎక్కడ తప్పటడుగు వేస్తుందో కనిపెడుతున్నట్టుంటుంది. తనచేత తప్పుచేయించేందుకు తగిన సన్నివేశాలు కల్పిస్తున్నట్టు ఆమెకి ఎప్పటికప్పుడే అనుమానం.—ఇద్దరివేపూ భయంగా సందేహంగా చూడకుండా వొక్క సమాధానం చెప్పదు, ఒక్క అడుగు వెయ్యదు!— తనమాట చెప్పనే అక్కర్లేదు-ఎరవేసి లాగుతున్నట్టే ఉంటుందియెకాయెకి! వాళ్ళకేం, హాయిగా పెళ్ళయిన వాళ్ళు. వాళ్ళు తప్పే చెయ్యరు! వాళ్ళకి ఈ పాటికి ప్రేమలో థ్రిల్ తగ్గి, తనచేత తప్పు చేయించడానికీ, దాంతో ఆనందం పొందడానికి ప్రయత్నిస్తున్నట్టే ఉంటుంది. ప్రతీరోజూ పరీక్షే, ప్రతీ నవ్వూ, ప్రతి మాటా ఎరే. పంజరంలో పక్షిని లా, మ్యూజియమ్‌లో వస్తువు నిలా, వాళ్ళు చివరికి తన్ను వినోదం కోసం ఎక్స్‌పెరిమెంట్ చెయ్యడం కోసం చేరదీసినట్టుంది!

కాని—ఈ అనుమానాల అవకాశాల మధ్య, నీతి అవినీతుల పరీక్షల మధ్య—ఏదో, సృష్టికెల్లా తీయని ఆనందం, వర్ణవర్ణాల మైత్రీ మాధుర్యం కలకాలం కలసి వున్నందుకు గర్వకారణం—ఉన్నట్టున్నాయి! ఇది తెంచుకోడం మంచిదేగాని సులభంగాదు; ఒకవేళ సులభమైతే మంచిదిగాదు! ఈ త్రివర్ణ చిత్రం శాశ్వతంగా చెదరక చెరగక నిలవాల్సిందే!

□□□



మన స్త్రీలను చూచి మనం గర్విస్తున్నాము. బహుళ కుటుంబానికి ఎక్కువ ఇష్టమయిన వారొకరు దేశ సరిహద్దులను రక్షించడానికి దూరంగా వున్నారేమో. తెలుసుకోండి. మనదేశం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. మన స్త్రీలు కష్టాలను చిరునవ్వుతో ఎదుర్కొంటున్నారు. అన్ని విధముల దూబర చేయకుండ, పొదుపు చేయడం అవసరమని వారికి తెలుసు. యుద్ధ రంగములో క్షతగాత్రులయిన వారికి ఉపశమనము కలిగించడానికి వారు ఆస్పత్రులలోను, రక్త బ్యాంకులలోను, వాలంటరీ సంస్థలలోను పనిచేస్తున్నారు. మన స్త్రీలు దేశానికి సేవ చేస్తున్నారు; మీరు చేస్తున్నారా?

భారత దేశం ఒక్కటే
భారత ప్రజలు ఒక్కటే

A 65/79

(గత సంచిక తరువాయి)

విజేత

యద్దనపూడి సులోచనారాణి

ఈ అదను కోసమే చూస్తున్నట్టు ఆ అమ్మాయి ఒక్కసారి లేచి మెరపులా అలారం బెల్ వైపు పరుగెత్తబోయింది మాధవ్ చురుగ్గా కాలు అడ్డు పెట్టేశాడు; చటుక్కున అతని కాలు అడ్డు రావడంతో తూలి పడబోయింది. క్షణంలో అతని బలిష్ఠమైనచెయ్యివచ్చి ఆ అమ్మాయి బోర్లా పడిపోకుండా ఆపేసింది. కోపంతో యెరుపెక్కిన కళ్ళతో తీక్షణంగా అతనివైపు చూసింది. అతను నవ్వాడు.

ఆ అమ్మాయి చేయి బలంగా విడిపించుకోబోయింది, కానీ సాధ్యం కాలేదు. కొద్దిసేపుచూసి మాధవ్ చెయ్యి వదిలేశాడు.

మరుక్షణం రెండు చేతుల్తో అతన్ని బలంగా తోసేసింది. ఇంకొక్క సెకన్‌లో అలారం బెల్ చేతికి అందేదే! కానీ యీ లోపలే లేచిన మాధవ్ రెండు చేతులు చాచి ఆ అమ్మాయి శరీరం మొత్తాన్ని అందుకుని యివతలికి లాగేశాడు. ఆ లాగే ప్రయత్నంలో అటు ఇటు కదుల్తూ పోతున్న రైలు వేగానికి నిలబడలేక బెర్త్ మీదకి వచ్చి పడ్డారు.

"ఇప్పుడు?—" కసిగా అన్నాడతను.

సమాధానంగా ఆ అమ్మాయి రెండు చేతులూ వచ్చి మాధవ్ ముఖాన్ని బలంగా టపటప మనిపించాయి. మొదట్లో క్షణంలో సగం సేపు నిరుత్తరుడైనా అతను వెంటనే ఒక చేత్తో ఆ రెండు చేతుల్ని గట్టిగా పట్టుకుని కదలకుండా బంధించాడు. మరో చేత్తో ఆ అమ్మాయి శరీరాన్ని లేవకుండా నొక్కిపట్టేశాడు. క్షణం సేపు, కాలం నిలిచిపోయింది. మాధవ్ అందంగా సోగగావున్న ఆ కాటుక కళ్ళలోకి చూస్తూండిపోయాడు. ఆ అమ్మాయి కళ్ళు రెప రెప లాడిస్తూ భయం భయంగా చూసింది. ఆ చూపు అతని యవ్వనాన్ని రెచ్చగొట్టింది. దగ్గరగా హత్తుకునివున్న కోమలమైన శరీరం కోర్కెని నిద్రలేపింది. వివేకాన్ని వుద్రేకం నోరుమూసుకోమని ఆజ్ఞాపించింది అప్పుడెప్పుడో అవమానంపొందిన అంతరాత్మ ప్రతీకారం తీర్చుకోమని తొందర పెట్టింది. అతనిలో మంచితనాన్ని

కోర్కెతో మత్తెక్కి తూలుతున్న పశుత్వం జయించింది.

క్షణంసేపు అతను ఖంగారు పడ్డాడు. భయపడ్డాడు కూడా. కాని మరుక్షణంలోనే నిజంగానే అతనికి మతిపోయింది.

మొదట్లో తీవ్రంగా పెనుగులాడి యెదురుతిరిగిన ఆ అమ్మాయి శరీరం చివరిక్షణంలో అలిసిపోయి అది మానేసి అతనికి లొంగిపోయింది.

• • •

సమయం గడిచింది. అనుకోని యీ సంఘటనకి తను కూడా బెదిరిపోయినట్టు రైలు మరింత వేగంతో ఆగకుండా పరుగెత్తుతోంది. మాధవ్ లేచి సరిగ్గా కూర్చుని ఆ అమ్మాయిని ఒళ్లోకి లాక్కున్నాడు. అప్పటికి అచేతన అయిన ఆ శరీరం వడిలిన తామర తూడులా అతని చేతులమధ్య వేళ్ళాడి పోయింది. మాధవ్ పరిశీలనగా ఆ ముఖంలోకి చూశాడు. రెప్పలు మూతలుపడిపోయి, కొద్దిగా నలిగిపోయినట్టున్న ఆ ముఖం ఆ క్షణంలో అలిసి వత్తుగా వున్న అతని కళ్ళకి అపురూపంగా, అద్భుతంగా కన్పించింది. చాలాసేపు అలాగే చూస్తూ కూర్చుండిపోయాడు. స్పృహలేని స్థితిలో కూడా ఆ అమ్మాయి యేడుస్తున్నట్టు కంఠం దగ్గిర నరాలు అదర సాగినాయి.

అతను ప్రేమగా ఆమె నుదుటిమీద పడిన జుట్టుని తొలగించాడు. హఠాత్తుగా అతనికి జాలేసింది. ఇదేమిటి? ఇలా అయిందే? పశుత్వం అనుకోకుండా తనని యెందుకిలా లొంగదీసుకుంది? పసితనం పూర్తిగా పోని ఆ ముఖం చూస్తున్నకొద్దీ అతనికి మతిపోతున్నట్టు అన్పించింది. ఏం చెయ్యాలి తను? ఇప్పుడు తన కర్తవ్యం యేమిటి? ముక్కూ మొహం తెలియని యీ అమ్మాయిని యిలా వదిలేయటమా? లేక-లేక-ఏం చేస్తాడు? అతను సమాధానం కోసం వెతుక్కుంటుండగానే మెల్లిగా ఆ అమ్మాయి కళ్ళు విడివడ్డాయి.

అతను స్నేహపూరితమైన చల్లటి చిరునవ్వు నవ్వాడు.

భయంగా, వెర్రిగా చూసిన ఆ అమ్మాయి ముడుచుకుపోతున్నట్టు వెనక్కు వెనక్కు జరిగింది.

"భయపడకు." మీదకు వంగి మృదువుగా చెప్పాడు. కానీ ఆ మాట విన్పించినట్టులేదు. ఇంకోసారి ఆ అమ్మాయి ముఖం కళావిహీనం అయిపోయింది.

• • •

హఠాత్తుగా రైలు ఆగటంతో అతను అదిరిపడ్డాడు. ఊపిరి బిగబట్టి కాబోయే శబ్దాలకోసం శ్రద్ధగా ఆలకించాడు. కాని యెన్ని నిముషాలు గడిచినా యేం కాలేదు,

యెవరూ రాలేదు. అసహనంతో, ఆ దుర్గావస్థ లేక తన ఒళ్ళో ఉన్న ఆ అమ్మాయిని సరిగ్గా పడుకోబెట్టి లేచివెళ్ళి కిటికీ తలుపు తెరిచాడు; చల్లటిగాలి రివ్వుమంటూ లోపలికి వచ్చింది. బైటంతా గాఢాంధకారం. దగ్గర్లో ఏదో స్టేషన్ రాబోతున్నట్టుంది. సిగ్నల్ కోసం అనుమతి కోరుతూ రైలు బిగ్గరగా విసుగ్గా కూత వేస్తోంది. బైటకి చూస్తున్న అతని కళ్ళు తిరిగి వచ్చి బెర్త్‌మీద అలిసి పోయినట్టు అచేతనంగా పడుకున్న ఆ అమ్మాయి ముఖంమీద నిలిచాయి. ఆమెకి మెలకువ రాకముందే తను దిగిపోతే! తప్పు చేసినప్పుడు శిక్ష పొందటానికి వెరిచే వ్యక్తిత్వం కాదు అతనిది. తను చేసిన యీ దుష్కృత్యానికి యెలాంటి శిక్ష అయినా పెదవి కదపకుండా, తలెత్తకుండా స్వీకరించగలడు. కాని-కాని యీ సిగ్గుమాలిన పని యింకెవరికో తెలిసి వాళ్ళేదో తీర్పు చెప్పేకంటే ఆ శిక్ష యేదో తనకి తనే విధించుకోవటం మంచిది.

మరో అయిదు నిముషాల్లో అతను రైల్లోంచి దిగేశాడు. ఆకాశంలో దట్టంగా నల్లటి మబ్బులు ఆవరించుకుని ఉన్నాయి. చల్లగా సన్నగా వాన తుంపరలలో కలిసి వీస్తున్నగాలి అతన్ని శరీరాన్ని తాకి సేద తీర్చసాగింది. మాధవ్ కదలబోయే రైలు క్రిందపడి ఆత్మహత్య చేసుకోవాలనే దృఢనిశ్చయంతోనే దిగాడు. కాని పది నిము



పాల తర్వాతకాని రైలు కదలలేదు. ఒక నిశ్చయాన్నుంచి తిరిగి పోవటానికి, మనిషి తేరుకోవటానికి, జీవితం మీద వేయిరెట్లు తీపి కలగటానికి ఆ పది నిముషాలు చాలు. అతని ధైర్యం సన్నగిలింది. చావబోయే సరికి బ్రతుకు మరింత మధురంగా కన్పించి చిరునవ్వుతో చేతులు జాచింది. దానితో ధృఢ నిశ్చయం కొద్దిగా సడలింది. ఆ సడలింపుతో బలవంతంగా చేతులమధ్య పట్టి బంధించిన చావాలనే కోర్కె పిట్టలా రెక్కలు విదిలించుకుని తుర్రున పారిపోయింది. అతను అవును కాదు అని మనసులో కొట్లాడుతుండగానే రైలు వెళ్ళిపోయింది. వెళ్ళిపోయిన రైలు వంక నిస్సహాయంగా చూస్తూ నిలబడిపోయాడు.

చాలా సేపు అయిం తర్వాత మాధవ్ నిద్రలో లేచి నడుస్తున్న మనిషిలా తూలుతూ రైలు పట్టాల వెంబడి నడక సాగించాడు. దూరంగా మినుకుమినుకు మంటున్న లైట్లనిబట్టి అక్కడ స్టేషనేదో వున్నట్టు అన్పిస్తోంది. ఆ లైట్లని చేరుకోటానికి అతనికి చాలా సేపు పట్టింది.

● ● ●

10

పై సంఘటన జరిగిన తర్వాత - దాదాపు ఐదారు సంవత్సరాలకి- ఈ మధ్య కాలంలో దేశంలో చాలా మార్పు వచ్చింది. వందలాది సంవత్సరాలుగా హీనమైన బానిస బ్రతుకుతో అంధకారంలో మ్రగ్గిన మనుష్యులకి స్వాతంత్ర్యం నూతన కాంతిని తెచ్చింది. ముసల్మానులు హిందువులతో పోట్లాడి విడిపోయి పాకిస్తాన్ యేర్పచుకున్నారు. జాతిపిత మహాత్ముడు మరణించాడు. తుపాకిగుండుకి బలియై నేలకి ఒరిగిపోయిన ఆయన నిష్క్రమణంతో కొత్తగా లభించిన యీ వెలుగు కూడా ఆరిపోతుందేమోనని భయపడ్డ ప్రజానీకంనుంచి జవహర్‌లాల్ ముందుకువచ్చి ఆ జ్యోతి అందుకుని నిలబడ్డాడు. స్ఫురద్రూపి, సాహసవంతుడు అయిన ఆయన నాయకత్వంలో భారత జాతి శిథిలమవటానికి సిద్ధంగావున్న యీ జీర్ణ గృహాన్ని సరిచేయటానికి ముందుకు నడిపించింది. దేశం బాగుపడి పురోభివృద్ధి చెందటానికి ప్రణాళికలు సిద్ధమైనాయి. స్వతంత్రంగా నిలబడ్డామనియెదురుతిరిగిన సంస్థానాలు కొన్ని సర్దార్ పటేల్ నాయకత్వం ఒక తాటి క్రిందకు వచ్చి యూనియన్‌లో కలిసిపోయినాయి.

ఈ సంధికాలంలో మనుష్యుల జీవన పరిస్థితులు కూడా చాలా తారుమారు అయినాయి. ఓడలు

బళ్ళు అయినాయి. బళ్ళు ఓడలుగా మారినాయి. లక్షాధికారులు భిక్షాధికారులుగా మారితే, పూటకి గంజి నీళ్ళకి గతిలేని కొందరు కోటికి పడగలెత్తారు. దేశంలో క్రమంగా శాంతి భద్రతలు నెలకొల్పబడినాయి. ప్రజల్లో ప్రశాంత జీవనం ప్రారంభమైంది.

దేశంతోపాటు మాధవ్ జీవితంలో కూడా పెద్ద మార్పు వచ్చింది. రామగోపాలరావుగారు మరణించి దాదాపు ఆర్నెల్లు కావస్తోంది. ఈ అయిదారు సంవత్సరాలు మాధవ్ ఆయన్ని నీడలా అంటిపెట్టుకుని వెంటే వున్నాడు.

సత్యాగ్రహం సమయంలో అనేక సంవత్సరాలు జైల్లో మ్రగ్గటం వల్ల అసలే అంతంత మాత్రమైన ఆయన ఆరోగ్యం దెబ్బతింది. ఎంత డబ్బు ఖర్చుపెట్టినా, యెంతమంది డాక్టర్ల దగ్గర మందు పుచ్చుకున్నా యెంత ఆరోగ్యప్రదమైన ప్రదేశాల్లో యెన్ని రోజులు గడిపినా ఆయన శరీర స్థితి మామూలు పరిస్థితికి రాలేదు. నానాటికి క్షీణిస్తున్న ఆయన ఆరోగ్యం చివరికి క్షయలోకి దింపింది. ఈ సంగతి తెలియగానే యిక యెక్కువకాలం ఆయన బ్రతకడని గ్రహించిన బంధువులు ఈగల్లా ముసురుకున్నారు. వాళ్ళనుంచి ఆయన్ని తప్పించి ప్రశాంతంగా వుంచడమే మాధవ్‌కి పెద్ద సమస్య అయికూర్చుంది. ఒక్కోసారి ఆయనే

జరిగిన కథ

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించి, విడుదలయి మాధవ్ స్వగ్రామానికి బయలుదేరుతాడు. త్రోవలో రాత్రిపూట కోచ్‌లో ప్రయాణం చేస్తున్న ఒక యువతి తారసిల్లుతుంది. కోచ్ బురదలో కూరుకుపోయింది. మాధవ్ సహాయాన్ని అపార్థం చేసుకుని ఆమె అతన్ని కొట్టి గాయం చేస్తుంది. ఆ తరువాత అతడు స్వగ్రామంవెళ్ళి తన తల్లి చనిపోయిందని, తాను ప్రేమించి పెళ్ళాడ దలచిన సుధ వేరొకరిని పెళ్ళాడిందని తెలుసుకొంటాడు. వికలమైన మనస్సుతో అగమ్యంగా రైల్వే స్టేషనుకు వెళ్ళి ఎదురుగా వున్న ఫస్టుక్లాస్ కంపార్టుమెంటులో ఎక్కుతాడు. అందులో తన నిదివరకు కొట్టి అవమానించిన యువతే వుంటుంది. ఆమెపై ప్రతీకార వాంఛ రగులుతుంది.

మరీ నీడలా వెంటేవుంటున్న అతన్ని చూసి 'అంటువ్యాధి. మర్చిపోకు!' అని హెచ్చరించేవారు. కాని అతనలాంటి హెచ్చరికలు యేవీ లక్ష్యపెట్టేవాడు కాదు. మరీ చివరి చివరి రోజుల్లో కన్న సంతానం కంటే మిన్నగా, కంటికి రెప్పలాగా కాపాడుతున్న మాధవ్‌ని చూసి చలించిపోయిన ఆయన అతని బలిష్ఠమైన చేతిని తన దుర్బలమైన చేతిలోకి తీసుకుంటూ 'యిది యేనాటి ఋణం మధూ?' అనేవారు.

'ఋణం అనకండి. మనసులు కలిసిపోయినతర్వాత సాటిమనిషిగా చూపే మంచితనం అంతే.' అనేవాడు మాధవ్. నిష్కల్మషమైన అతని ఆదరణకి, ఆడంబరంలేకుండా అతను చూపే ఆప్యాయతకి ఆయన మనసు పులకించి పోయేది. మరీ జీవితపు చరమ దశలో కన్నకొడుకు లేని లోటుని అన్ని విధాలా తీరుస్తున్న అతన్ని చూస్తుంటే మనసులో లోలోపల కలిగిన ఆనందాన్ని, తృప్తిని ఆయన హృదయాంతరాళాల్లో పదిలంగా దాచుకున్నారు. కాని ఒక్కనాడు, ఒక్కమాటకూడా బైటకి రానివ్వలేదు.

ఆయన మరణించిన తర్వాత వారసులమంటూ యెగబడిన బంధువులని, మాధవ్‌ని కూర్చోపెట్టి లాయర్లు విల్లు చదివి వినిపించారు. అందులో హైదరాబాద్‌లో ఆయనకున్న విశాలమైన భవంతిని తమిద్దరి భార్యాభర్తల పేరుమీద పేదవారికి ఉచితంగా సేవచేసే చికిత్సాలయంగా మార్చాలని కోరారు. తనకున్న వ్యాపారంమీద వచ్చే ఆదాయంలో మూడువంతులు హాస్పిటల్ ఖర్చులకి కేటాయించాలని, మిగతా ఒకవంతు తను దత్త పుత్రుడుగా స్వీకరించిన మాధవ్‌కి చెందాలని ఆదేశించారు. మాధవ్ తనే స్వయంగా వ్యాపారం చూసుకుని హాస్పిటల్ అభివృద్ధి చెందేలా చేయాలని, యిదితన కడపటికోర్కె అని తెలియజేశారు. ఇవి కాక హైద్రాబాద్‌కి 40 మైళ్ళదూరంలో వున్న పల్లెటూరులో ఉన్న పది ఎకరాల పొలం, తరతరాలుగా వస్తున్న అక్కడున్న యిల్లు కూడా మాధవ్‌కి చెందుతాయి. తనుమరణించిన మరుక్షణంనుంచి మాధవ్ తన యింటిపేరుతోనే వ్యవహరించాలి. అంతేకాదు. పల్లెటూళ్ళోవున్న ఆ యిల్లు, పొలం యెట్టి పరిస్థితుల్లోనూ అమ్మటానికి అతనికి హక్కు వుండదు. అవి వారసత్వంగా మాధవ్ సంతానానికి చెందుతాయి.

ఈ విల్లు వినగానే బంధువులందరితోపాటు మాధవ్ కూడా నోరు తెరిచాడు. ఆయన మనసులోవున్న అభిమానం ఈ విధంగా కొడుకులా స్వీకరించేట్టు చేస్తుందని అతను కల్లోకూడా అనుకోలేదు. ఈ విల్లు సంగతి ముందుగా యే మాత్రం తెలిసినా, ఆ యిల్లు, పొలం, వ్యాపారంలో ఆ భాగం వాటిని తను సంపూర్తిగా తిరస్కరించేవాడు.

బహుశా యిది గ్రహించే ఆయన యెప్పుడూ సూచనగా ఒక్క మాట అయినా బైటకి రానివ్వలేదేమో! నిజంగానే! ఆయన అన్నట్టు యేనాటి ఋణం యిది! కృతజ్ఞతతో, అభిమానంతో మాధవ్ కళ్ళు చెమర్చినాయి. వచ్చిన బంధువులంతా మాధవ్‌ని ముఖంమీదే తిట్టారు. ఆఖరిసమయంలో దగ్గరచేరి బలవంతాన అలా వ్రాయించుకున్నావు అన్నారు. అసలు ఆస్తిమీద కన్నువేసి ఆయన్ని మా అందరినుంచి దూరంగా పెట్టావు అన్నారు. అయినా యిప్పుడుమాత్రం మునిగిపోయింది యేముంది. నిన్ను కోర్టు లాగి, నీ అంతు కనుక్కోకపోతే చూడు అంటూ సవాలు చేశారు. నీ గోళ్ళూడకొట్టి అదంతా మళ్ళీ మేం పొందేవరకూ నిద్రపోం అని పతిజ్ఞలు చేశారు. లాయర్లు ముందుకువచ్చి అసలిగొడవ యేదీ మాధవ్‌కి తెలియదని అతను అమాయకుడని చెప్పబోయారు. చాలు – చాలు – మీరంతా కలిసి పన్నిన కుట్ర. ఇందులో మీ కెంత భాగం వుందో మాకేం తెలుసు? అంటూ లేచిపోయారు వాళ్ళు.

రెండు మూడు రోజుల్లోనే మాధవ్ మీద దావా తెచ్చారు వాళ్ళు. కాని అతను వీటి వేటికీ చలించలేదు. ఈ ప్రపంచ లో అతనికివున్న ఒక్కగానొక్క ఆప్తుడు, గురుతుల్యుడు, పితృసమానుడు దూరమైనందుకు దిగులుతో బరువెక్కిన హృదయాన్ని ఎలా ఊరడించుకోవాలో అర్థం గాలేదు. ఇన్ని సంవత్సరాల ఆయన సాహచర్యంలో ఆయన కిచ్చినదానికంటే పొందిందికూడా చాలా ఉంది. రైలులో ఆరోజు అకస్మాత్తుగా ఆ భయంకర సంఘటన జరిగిన తర్వాత ఆత్మహత్య చేసుకోటానికి ధైర్యం చాలని అతనికి ఆవేదనతో మతి చలిస్తుందేమోనన్న భయం వేసింది. కాని దానినుంచి ఆయనకి తెలియకుండానే రక్షించారు. ఎన్నిసార్లో తను చేసిన యీ సిగ్గుమాలిన పనిని ఆయనకి నోరు తెరిచి చెప్పి యేంచేస్తే ప్రాయశ్చిత్తం చేసుకున్నట్టు అవుతుందో చెప్పమని అడగాలనుకున్నాడు. కాని అడగలేకపోయాడు. తర్వాత – తర్వాత రోజులు గడిచినకొద్దీ ఆ గాయం మాని మెల్లగా మర్చిపోటానికి కావాల్సిన శక్తిని మనసు సంపాయించుకుంది.

ఆ విధంగా రాంగోపాలరావు గారి మరణంతో మాధవ్ జీవితం మలుపు తిరిగింది. ఈ మలుపు తిరిగీ తిరగ్గానే అతనికి ఆయన వ్యాపారం, హాస్పిటల్‌గా మార్చాల్సిన యిల్లు, వాటిద్వారా యింకా అనేక బాధ్యతలు వచ్చి మీదపడ్డాయి. రోజులు క్షణాల్లో దొర్లిపోసాగాయి.

11

ధనం యెప్పుడూ వంటరిగా రాదు. చుట్టాల్ని స్నేహితుల్ని కీర్తి ప్రతిష్ఠలని వెంటపెట్టుకుని సకుటుంబ సపరివారంగా అన్నట్టు ఆడంబరంగా వస్తుంది. వెళ్ళిపోయేటప్పుడు కూడా అంతే. అందర్నీ వెంటబెట్టుకుని నిశ్శబ్దంగా నిష్క్రమిస్తుంది.

మాధవ్‌కి కొత్తగా లభించిన సిరిసంపదలతో పాటు కొత్త స్నేహితులు చాలామంది దొరికారు. వాళ్ళందరిలో మాధవ్‌కి నచ్చింది మనసుకి దగ్గరగా వచ్చింది ప్రసాద్ అని ఒక డాక్టరు. ప్రసాద్ రామగోపాలరావుగారి సహాయం వల్ల చదువుకుని పైకివచ్చాడు. ఆయన బ్రతికుండగా కలిగిన పరిచయం రానురాను పెరిగి మంచి స్నేహంగా రూపొందింది. ప్రసాద్‌కి కూడా మాధవ్ అంటే మంచి గౌరవం ఉంది. విశిష్టమైన అతని వ్యక్తిత్వం అంటే గాఢమైన గౌరవాభిమానాలున్నాయి. మాధవ్ అప్పుడప్పుడూ వాళ్ళ యింటికి వెడ్తూండేవాడు. ఆ కుటుబంలో అందరికంటే ప్రసాద్ చెల్లెలు జ్యోతి దృష్టిని అతను బాగా ఆకర్షించాడు. వ్యక్తిత్వాల జోలికి అంతగాపోని జ్యోతిని మాధవ్ బుద్ధి యెలాంటిదైనా విగ్రహంమాత్రం కంటికింపుగావుండి చాలా బాగానచ్చింది. మొదటి చూపులోనే అతనిపట్ల ఆసక్తి యేర్పరుచుకుంది. తన వూహలకి తగిన పురుషుడని నమ్మింది. కాని జ్యోతి మనసులో ఈ ఉద్దేశమేమీ గ్రహించని మాధవ్ అందరితో లాగానే మాట్లాడేవాడు. కాని యెప్పుడు చూసినా యేదో ఒకటి వాగుతూ, యెంతసేపు తన అందం చేత యెదటివాళ్ళు ఆకర్షింపబడాలని వెర్రిమొర్రి ప్రయత్నాలు చేసే జ్యోతిని చూసి అప్పుడప్పుడూ అతనికి విసుగేసేది. ఒక్కోసారి హద్దుమీరిన ఆమె చనువుని అసహ్యించుకునేవాడు కూడా. కాని ఒక్క జ్యోతిని తీసేస్తే మిగతా ఆ కుటుంబంలో అందరూ అతనికి ఆప్తులే. అందుకే జ్యోతి విషయంలో చూసి చూడనట్టు వదిలేసి పట్టించుకునేవాడు కాదు.

మాధవ్ నిర్లక్ష్యాన్ని అదో పోజ్ క్రింద తీసుకుని జ్యోతి సరిపెట్టుకుంది. తనమీద యెలాంటి ఆకర్షణ లేకపోతే అసలు యింటికి యిన్నిసార్లు రాడనుకుని నమ్మింది.

12

మనిషి మనసు మహా చిత్రమైనది. ఒంటరిగావున్నా ఒక్కొక్కసారి హాయిగా అద్భుతంగా వుంటుంది. మళ్ళీ యింకోసారి పదిమందిలో తిరుగుతున్నా సరే చుట్టూ యెవరూ లేనట్టు యేకాకిగా ఎడారిలో నిలబడి దిక్కులు చూస్తున్నట్టు అనిపించి వెర్రివాళ్ళని చేస్తుంది.

మాధవ్ పని ప్రస్తుతం యిలాగే ఉంది. ఒంటరితనపు బాధ భరించలేక అనేక వ్యాపకాలని కల్పించుకున్నాడు, ఇష్టంలేకపోయినా కాలక్షేపం అవుతుందని జ్యోతితో పరిచయం పెంచుకున్నాడు. బిజినెస్ చూడటంలో మరింత శ్రద్ధ కనపరిచాడు. హాస్పిటల్ విషయంలో అవసరానికి మించిన జోక్యం యేర్పరుచుకున్నాడు. అయినా సరే భూతంలా పట్టుకున్న యీ వంటరితనపు బాధ అతన్ని వదలటం లేదు. సుధ అప్పుడప్పుడు వచ్చి వెడ్తూనే ఉంది. అందంగా, అమాయకంగా, ఆనందంగా ఉన్న సుధని చూస్తుంటే అతని మనసు యెందుకో వులిక్కిపడుతుంది, జీవితం అంతా వెలితిగా కన్పిస్తుంది.

ఒక్కోసారి — మరి చిత్రంగా — అర్ధరాత్రివేళ యెవరో తట్టిలేపినట్టే మెలకువ వస్తుంది, తర్వాత ఎంత ప్రయత్నం చేసినా మళ్ళీ కంటిమీదకి కునుకన్నమాట రాదు. ఆలోచన్లు జోరీగల్లా ముసురుతాయి. మనసు అవి కల్పిస్తున్న అశాంతిని భరించలేక విలవిల లాడ్తుంది. ఆ అర్ధరాత్రివేళ అప్పటికప్పుడు లేచి ఎక్కడికైనా పారిపోదా మనిపిస్తుంది కాని యెక్కడికి వెళ్తాడు! ఇలాటి బాధనుంచి తప్పించేందుకు సందడీ ఇంట్లో ఉండాలి. కాని బజారులో కొనుక్కుంటే రాదు, అలాటి సమయాల్లో కలిగే అనేక ఆలోచన్ల మధ్య అప్పుడప్పుడూ ఆ అమ్మాయి ముఖం గుర్తుకు వస్తుంది. ఎక్కడుందో! ఏం చేస్తోందో? తను గుర్తుంటాడా? ఒట్టిది ఎప్పుడో మరిచిపోయి ఉంటుంది. సుధ లాగానే ఆ అమ్మాయి కూడా పెళ్ళి చేసుకుని, యిల్లు, సంసారం గొడవలో పడిపోయి ఉంటుంది. ఆ అమ్మాయి మర్చిపోతే మర్చిపోవచ్చు. కాని తనెలా మర్చిపోతాడు! ఒకవేళ మర్చిపోదామన్న ముఖంమీదవున్న యీ మచ్చ మర్చిపోనివ్వదు. అద్దంలో చూసుకున్నప్పుడల్లా సిగ్గుతో చితికిపోయే ఆ సంఘటన గుర్తుకు వస్తుంది. వెంటనే వడిలి వాడిపోయి తూలిపోతూ స్పృహ లేకుండా తన చేతులమధ్య పట్టుకున్న ఆ ముఖం గుర్తుకు వస్తుంది. అది గుర్తుకు రాగానే అతని మనసంతా వికలమై పోతుంది. భగవంతుడు తను చేసిన పాపానికి శిక్షించలేదేం? పై నుంచి సర్వసంపదలు యిచ్చి ఆశీర్వదించాడు ఎందుకని! ఒకవేళ యెప్పుడైనా ముఖాముఖీని తామిద్దరూ కలుసుకుంటే! ఎలా వుంటుంది! మాధవ్‌కెందుకో ఆ దృశ్యం చూసి తీరాలనే కోర్కె బలీయంగా నాటుకుని నానాటికి దృఢంగా పెరగసాగింది. ఇన్ని సంవత్సరాలలో యింతమందిలో ఆమె యెక్కడైనా కన్పిస్తుందేమోనని అతని మనసు రహస్యంగా వెతుకుతూనే వుంది. కాని యెక్కడా ఆ అమ్మాయి కాదుగదా కనీసం

అలాటి ఛాయలున్న మనిషికూడా అతనికి కన్పించలేదు. ఒకటి మాత్రం సత్యం. ఇక ముందు జీవితంలో ఆ అమ్మాయి కన్పించినా కన్పించక పోయినా తనుమాత్రం జీవితాంతం యీ జ్ఞాపకాన్ని గురించి మర్చిపోలేడు. అది తన వల్ల కాదు. ఆ అనుభూతి అంత గాఢంగా ముద్ర వేసుకుపోయింది.

మొన్నటికి మొన్న - జ్యోతి వాళ్ళతో కలిసి అందరూ అలా పిక్నిక్ కి వెళ్ళినప్పుడు జ్యోతి ప్రయత్నం చేసి చాకచక్యంగా తనతో ఒంటరిగా మిగిలిపోయింది. చుట్టూ తెల్లటి వెన్నెల. చక్కటి నిశ్శబ్దం. ప్రశాంతమైన పరిసరాలు. అప్పుడతనిమనను కొద్దిగా చలించినమాట నిజమే. జ్యోతిని దగ్గరగా తీసుకున్నాడు. "మీ ముఖం మీద యీ మచ్చ యెంత బావుంది? యెప్పుడు తగిలింది యీ దెబ్బ?-" చిటికెన వేలు కొనతో ఆ మచ్చ వున్నంత మేరా రాస్తూ గోముగా అంది జ్యోతి.

క్షణంసేపు వెర్రిగా చూసిన మాధవ్ చటుక్కున జ్యోతిని వదిలేసి దూరంగా వెళ్ళిపోయాడు. హఠాత్తుగా అతనికి ఆ వెన్నెల, ఆ ఒంటరితనం అసహ్యం వేసింది. భయం కల్గించింది కూడా. వెనక నుంచి జ్యోతి పిలుస్తున్నా విన్పించుకోకుండా గబగబా మిగతా వాళ్ళు ఉన్న చోటుకి వచ్చేశాడు. అనుకోకుండా అతని మనసంతా వికలమైపోయింది. మనశ్శాంతి విచిత్రంగా మాయమైంది. వాళ్ళంతా తనని యిప్పుడు యింతగా గౌరవిస్తున్నారే! మంచివాడంటూ ఆర్భాటంగా ఆదరిస్తున్నారే! తను చేసిన ఆ భయంకరమైన దుష్కార్యం తెలుస్తే! బహుశా ముఖం కూడా చూడరేమో! అలాటి దేదయినా తన చరిత్రలో ఉందనితెలిస్తే కనీసం అనుమానం తగిలినా చాలు, దాని అంతుశోధించి, పుట్టుపూర్వోత్తరాలు కనుక్కొని అనేకరకాల ఉపకథలు అల్లి అధఃపాతాళానికి తొక్కేస్తారు. రామగోపాలరావుగారిఆస్తికి వారసుడయాడని మండి పడిపోతున్న వాళ్ళకి యెంత చక్కటి అవకాశం. తనసలు పెళ్ళి చేసుకోడు. ఒకవేళ చేసుకున్నా అతి సామాన్యమైన అమ్మాయిని తన మంచి భర్తగా రక్షణ; ఆనందంకోసం పిల్లలు తప్ప యింకేమీ కోరని, మనిషిని చూసి మరీ చేసుకుంటాడు, మనసులో సుధకికూడా లేని ఓ విధమైన ప్రత్యేకత ఆ అమ్మాయి సంపాదించుకుని కూర్చుంది. అసలు ఆ అమ్మాయి గుర్తొస్తే యింకో స్త్రీని తాకాలంటేనే అసహ్యం వేస్తుంది. జుగుప్సగా వుంటుంది.

ఇంటికివచ్చిన తర్వాత కూడా ఆ రాత్రి అతనికి చాలాసేపటి వరకూ నిద్రపట్టలేదు. కొద్ది సంవత్సరాలక్రితం అనుకోకుండా జరిగిన ఓ విచిత్ర సంఘటన గురించి తను యింతగా అసలు యెందుకు ఆలోచించాలి? తెరిచిచూస్తే ప్రతి మనిషి జీవితంలోనూ యేవో రహస్యాలుండక మానవు. అలాగే తనుకూడా అని యెందుకు సరిపెట్టుకోలేక పోతున్నాడు. తనని తనే దోషిగా, అల్ప వ్యక్తిత్వంగల మనిషిగా వూహించుకుని యీనరకం చూడడం దేనికి? ఇన్ని విధాలుగా తను గుర్తుచేసుకుంటున్నాడు. ఆ అమ్మాయి ఒక్క రోజు ఒక్క క్షణం అయినా గుర్తుచేసుకుంటుందా? ఎప్పుడైనా యే వంటరిగానో యే రైల్లోనో ప్రయాణం చేసినప్పుడు గుర్తురాదూ? గుర్తురాగానే ఆ అంతమైన ఆకను బొమలు ముడుచుకుంటాయి కాబోలు. అసహ్యంతో పెదవులు వంపులుతిరిగి కరుచుకుంటాయేమో! ఏదయినా - యెలాగైనా సరే యెక్కడున్నా ఆమె వునికి సంపాదించి ఒక్కసారి చూడాలి. చూడగానే ఆ సోగ ఆ కళ్ళలో కన్పించే గుర్తింపు, ఆ జ్ఞాపకం యొక్క ప్రతిఫలం యెలా వుంటాయో! మాధవ్ కెలాగైనా ఆ గర్భశ్రీమంతురాలయి, యీ పాటికి ఒకళ్ళిద్దరి పిల్లలతల్లి కూడా అయివున్న ఆమెని చూసి తీరాలని మరీ మరీ అన్పించసాగింది.



13

కొద్దిరోజుల క్రితం యీ వంటరితనం చూసి వెర్రివాడైపోతానేమో అని భయపడ్డాడో — దీన్ని తప్పించుకోటానికి కావాలని నలుగురిలో పూనుకు తిరగాలని చూశాడో ప్రస్తుతం మాధవ్ ఆ ఒంటరితనం కోసమే మిలమిలలాడిపోతున్నాడు. నానాటికి అతని అప్తుల సంఖ్య పెరిగిపోతోంది. ఎంత ముభావంగా వున్నా, వద్దనియెంత విసుక్కున్నా యెవరూ లక్ష్యపెట్టటంలేదు. పైనుంచి అతనేదో బాధలో వున్నాడని, దగ్గరచేరి అంటిపెట్టుకుని వుంటే అభిమానుల క్రింద జమ అవుతామని ఆశపడుతూ యింకా దగ్గరగా రావాలని ప్రయత్నించసాగారు. అందరికంటే జ్యోతిని తప్పించుకోవటం అతనికి ఓ పెద్ద సమస్య అయి కూర్చుంది. అతని అభిప్రాయం అడక్కుండానే, అతని అనుమతి తీసుకోకుండానే జ్యోతిని వివాహం చేసుకోటానికి యిష్టపడ్డట్టూ త్వరలో అది జరగబోతున్నట్టు గాలి వార్తలు అనేకం ప్రచారంలోకి రాసాగినాయి.

జ్యోతి అంటే అంతగా యిష్టంలేని కొంతమంది (ముఖ్యంగా తమ చెల్లెళ్ళనో, కూతుళ్ళనో, అతనికి కట్టిపెట్టాలని తాపత్రయ పడేవాళ్ళు) జ్యోతి ప్రవర్తన మంచిది కాదని, కావాలంటే వుదాహరణలు చూపిస్తామని, దూరం ఆలోచించుకుని ఈ అడుగు వేయమని సలహాలు యివ్వసాగారు. ఈ గొడవలు కాక హాస్పిటల్లో తీసుకోబోయే నర్సుల కోసం, డాక్టర్లకోసం రికమెండ్ చేస్తూ ఉత్తరాలు కొన్ని, స్వయంగా మనుష్యులు వచ్చి రామగోపాలరావు గారి స్నేహితులం మామాట నువ్వు వినాలి అనే ఆంక్షలుకొన్ని. వాటితో అతనికి క్షణం తీరుబడి లేకుండా ఊదర బెట్టినట్టు వెర్రెత్తసాగింది. కొద్దిరోజులు వాళ్ళందరినీ తప్పించుకుని దూరంగా ఉంటేకాని బ్రతకలేనని భయంవేసింది.

చివరికి ఆలోచించి రామగోపాలరావుగారు తన పేరుమీద వ్రాసిన ఆ పల్లెటూరు యెలాటిదో చూడటానికి వెళ్ళాడు.

● ● ●

చాలా చిన్న పల్లెటూరు. అంతా తక్కువ కులాలవాళ్ళే. ఎక్కువ మంది పల్లెవాళ్ళు వున్నారు. సాలెవాళ్ళు, వడ్రంగులు కూడా కొద్దిమంది ఉన్నారు. ఎవరి వీధి వాళ్ళది. ఎవరిపని వాళ్ళది. పనివుంటే తప్ప యితర్లతో జోక్యం కల్పించుకోరు. సిటీకి అంత దగ్గరలో వున్నా దాని ప్రభావం యేమీ లేనివూరు. హైదరాబాద్‌లో విసుగుపుడితే ఇక్కడకు వచ్చి నాలుగు రోజులుంటే మనసు విశ్రాంతి పొంది మళ్ళీ వుత్సాహాన్ని పుంజుకుంటుంది.

(సశేషం)

"కృష్ణశాస్త్రి కృతులు"



కృష్ణశాస్త్రిగారొకసారి ఒక కాలేజీ విద్యార్థుల సభలో ప్రసంగించడానికి వెళ్ళారట. అవి "మల్లీశ్వరి" కొత్తగా విడుదలయిన రోజులు. విద్యార్థి సంఘం అధ్యక్షులో, ఎవరో, శాస్త్రి గారిని సభికులకు పరిచయంచేస్తూ "వీరు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారని— సినిమాలకు పాటలూ, మాటలూ వ్రాస్తూ వుంటారు" అన్నారట.

ఈ ఉదంతం ఎంతవరకు నిజమో తెలియదుగాని, కృష్ణశాస్త్రిగారిని కేవలం సినిమా కవిగానే ఎరిగివుండడలో ఈ తరంవారి తప్పు కాదేమో.

ఎందుకంటే — కృష్ణశాస్త్రిగారి అభిమానులలో కూడా చాలమందికి ఆయన కృష్ణపక్షం, ఊర్వశి, ప్రవాసం తప్ప ఇంకేం వ్రాశారబ్బా అనిపిస్తుంది. నిజానికి అర్ధ శతాబ్దం కిందట ఆయన కవిగా లోకానికి పరిచితులైనప్పటినుంచి నేటి వరకు, పుంఖాను పుంఖంగా కాకపోవచ్చు గాని, చాలా రచనలే చేశారు. అవేవీ పుస్తక రూపంలో రాలేదు. వచ్చినవైనా చాలాకాలంగా పుస్తక విపణిలో దొరకడంలేదు. కృష్ణాష్టమి, గుహుడు ధమర్దాను; ఒమర్ ఖయ్యాం, ఆండాళ్, వేణుకుంజ లాంటి గేయ నాటికలు, బ్రహ్మసమాజపు రోజులలో వ్రాసిన దైవభక్తిగేయాలు, ఆ మధ్య కాలంలో ఆకలి పాటలు, వ్యాసాలు, రేడియో ప్రసంగాలు, ఇంకా ఎన్నో రంగురంగుల రచనలు —ఏమైనాయో, ఎక్కడన్నాయో తెలియదు. అవన్నీ వేర్వేరు సంపుటాలలోనైనా, ఒక్కచోట, ఒకే ఆకృతిలో కట్టెదుట కనిపించాలి. అప్పుడుగాని ఈ తరంవారికేమి, ముందు కాలాల వారికేమి ఆయన సమగ్రమూర్తి సాక్షాత్కరించదు.

ఇది ఎవరో ఒకరు, ఎప్పుడో అప్పుడు చేయవలసిన పని. చాలా ఆలస్యమైనా ఇన్నాళ్ళకు కావలి, విశ్వోదయ ప్రచురణల సంస్థ ఈపని ప్రారంభించడం ఎంతైనా అభినందించవలసిన విషయం. మొన్న నవంబరు 14వ తేదీన కావలి కాలేజీ "జవహర్ భారతి"గా పేరు మార్చుకున్న సందర్భంలో శాస్త్రిగారి మూడు సంపుటాలు సిద్ధం కావడం, వాటిని ఉపరాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుసేన్ ఆవిష్కరించటం జరిగింది.

[ఆ సంపుటాలివి — 1. బహుకాల దర్శనం 2. పుష్పలావికలు 3. అప్పుడు పుట్టిఉంటే. ఒక్కొక్క దాని వెల మూడేసి రూపాయలు. విశ్వోదయ ప్రచురణ, కావలి]

ఇవి మూడూ వచన సంపుటాలే. కృష్ణశాస్త్రిగారి వచనశైలికి ఎవరూ సర్టిఫికెట్టివ్వవలసిన అవసరం లేదు. వారి పాటలో, పద్యంలో కనబడే సౌందర్యమే వచన రచనలోనూ గోచరిస్తుంది: దంతపు నగిషీలాంటి పనివాడితనం కనబడుతుంది. ఈ నాటి సమాజం చెందుతున్న పరివర్తనపట్ల ఎక్కడా అసహనం కనిపించదు గాని, కీట్సుకుమల్లే కృష్ణశాస్త్రిగారికి కూడా గతకాలం పట్ల మక్కువ ఎక్కువేమో అనిపిస్తుంది. కాళిదాసు, శ్రీనాథుడు, పెద్దన, తిమ్మన, సూరన మొదలైనవారి వర్ణనలనుంచి, శిరీషాలు, శేఫాలికలు, కురవకాలు, లీలా కమలాలు, నీలోత్పలాలు మొదలైన పుష్పాలనుంచి, అత్తరు, జవాది, గొజ్జగి, సాంబ్రాణి మొదలైనవాటి సువాసనల నుంచి, కోవెల-కోలను విధిగా వుండే గ్రామీణ సంస్కృతినుంచి ఆయన ఒక సుందర ప్రపంచాన్ని నిర్మించుకున్నారు; చదువుతున్నంతసేపు ఆ ప్రపంచంపట్ల తాను పొందే ఆరాటాన్నే మనలోను కలిగిస్తారు.

ఆయన రచనలన్నీ కలిపి పద్నాలుగు సంపుటాలలో వెలువరించాలని సంకల్పించినట్లు విశ్వోదయ వారు తమ పీఠికలో తెలిపారు. మంచిదే. కాని దీనికి కొంతకాలం పడుతుంది కనుక, ఈ లోగా వారు ఆయనచేత స్వీయ చరిత్రను కూడా వ్రాయించి పదిహేనవ సంపుటంగా ప్రచురిస్తే బాగుంటుంది. శాస్త్రిగారి బద్ధకం జగత్ప్రసిద్ధమైనదే. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు తమ 'నాలుగు మాటలు' (బహుకాల దర్శనం)లో వ్రాసినట్లు ఒక పాట వ్రాయడానికి పది నిమిషాల నుంచి పదిరోజుల వరకు పట్టవచ్చు. 'పాతిక సంవత్సరాల తెలుగు కవిత్వము' అనే వ్యాసం (అప్పుడు పుట్టి ఉంటే) వ్రాసి ఇవ్వడానికి కృష్ణశాస్త్రిగారు 'భారతి' పత్రికాధిపతులను పెట్టిన తిప్పలు గురించి చివరకా వ్యాసం సంపాదించిన కొడవటిగంటి కుటుంబరావుగారొక వ్యాసం వ్రాయవచ్చు.

అయినా ఆయనచేత ఎలాగైనా స్వీయచరిత్ర వ్రాయించడం తెలుగు దేశానికి అవసరం. తమ సమకాలికులైన కవులు, కవితాగోష్ఠులు, సభలు, సమావేశాలు, సాహితీసమితి, నవ్యసాహిత్య పరిషత్తు— ఈ జ్ఞాపకాలన్నీ ఆయన గ్రంథస్థంచేస్తే తెలుగు సాహిత్యంలో ఎంతో ఫలవంతమైన ఒక అర్థ శతాబ్దపు చరిత్ర మనకు లభిస్తుంది. ఈ పని ఎవరు చేస్తారో మరి!

□□□

ముందడుగు వేసిన వెనుకటి సంవత్సరం



తెలుగు సినిమా కొత్త రంగులతో 1966 లో అడుగిడింది.

సాంఘికాలకు సంబంధించినంతవరకు తెలుపునలుపులలో సొంపులు తెచ్చుకొన్న తెలుగుసినిమా, 1965 లో పూర్తి రంగులలో (తేనె మనసులు) సగం రంగులతో (ఇల్లాలు) కొత్త సొగసును సంతరించుకొన్నది.

వెనుకకు తిరిగిచూడడం ఇతర రంగాలలో మంచిది కాకపోవచ్చు కాని, తెలుగు సినిమా రంగంలో, ముఖ్యంగా 1965 కు సంబంధించినంతవరకు, అది గర్వకారణమే. వెనకటి సంవత్సరం (1965) ముందడుగు వేసిందనే గట్టిగా చెప్పవచ్చు.

రాష్ట్రం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సమీక్షా సంవత్సరంలోనే (ఇక మీదట ఈ సంవత్సరం అంటే 1965 గా భావించ మనవి) ఉత్తమ చిత్రాలకు నంది అవార్డులు అందజేసింది.

మరొక తెలుగుస్టూడియో— సదరన్ మూవీటోన్ స్టూడియోస్, హైదరాబాద్— వెలసింది.

'డాక్టర్ చక్రవర్తి', 'కీలుబొమ్మలు', 'గుడిగంటలు' నంది అవార్డులు అందుకొంటే సినిమా బంధువులైన భానుమతి, డాక్టర్ సి. నారాయణరెడ్డి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతుల నందుకొని సినిమా లోకానికి గౌరవం తెచ్చారు.

దేశం

1965 లో దేశం రెండవసారి శత్రువు దాడికి గురైనా 1962లో వలె దెబ్బతినక దెబ్బతీసింది. 62 శత్రువు చైనాను, 65 శత్రువు పాకిస్తాన్‌ను 'నాట్' దూరంలో నిలిపి వుంచాలి అంటే రాజకీయ నాయకులతో, సైన్యంతో, రైతులతో, ప్రజలతో దాదాపు సమంగా పాటుపడవలసిన బాధ్యత, వారిలో కొందరికంటే ఎక్కువ త్యాగాలు చేయవలసిన బాధ్యత మన సినిమా తారలపైన, టెక్నిషియనులపైన పడింది.

ఈ బాధ్యతను మనవారు గర్వకారకంగా నిర్వర్తించి వున్నారు.

సరిహద్దు ప్రాంతాలకువెళ్ళి సైనికులకు మన తారలు వినోద ప్రదర్శన లిచ్చి వున్నారు. ప్రధానికి స్వర్ణాభరణాలు సమర్పించి ఉన్నారు.

నాగేశ్వరరావు, నిర్మాతలు,

ఇతర పెద్దలు విరాళాలిచ్చి ఉన్నారు. వీరు దేశరక్షణపై డాక్యుమెంటరీ చిత్రాలు నిర్మించ సంకల్పించారు. నిర్మిస్తున్నారు కూడా.

రామారావు సపరివారంగా ఆంధ్రదేశంలో సంచలన యాత్ర సాగించి నాటక ప్రదర్శనలతో ప్రజలను ఉత్తేజపరిచి రక్షణ పటిమకు శాయశక్తులా ధనసేకరణ చేశారు. ధనం కంటే ప్రజలలో దేశభక్తి ఇంధనం సద్వినియోగం తమ ఆశయమని రామారావు చెప్పారు.

ఇక క్రికెట్ ఆటలు, వినోద ప్రదర్శనలు కోకొల్లలుగా జరుగుతున్నవి.

'సినిమా కోసమే జీవితం' అని కాక 'దేశంకోసమే సినిమా జీవితం' అని నిరూపించిన ప్రతిఒక్క కళాకారుని, వారినిమించి వారి ఆశయ సాఫల్యానికి కారకులైన పేదప్రజను, మధ్య తరగతి వారిని, ధనికులను, కార్యకర్తలను 1965 అభినందించక మానదు.

ఆభరణాలు యిచ్చివేసిన కారలు యుద్ధ సంవత్సరానికే ఒక చిన్న ఆభరణం.



"ఎర్రగులాబి" బాలల చిత్రంలో జి. వరలక్ష్మి

విదేశం

ఈ 1966 లో కూడా భారతదేశం అనేది ఒకటున్నదని ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలవారికి తెలియదు. అటువంటప్పుడు ఆంధ్రులు, ఆంధ్రభాష ఆంధ్రదేశం అనేవి పెక్కు విదేశాలలో తెలియకపోవడంలో ఆశ్చర్యం లేదు. అటువంటిది ఒకటున్నదీ అని తెలియజెప్పేందుకని 1965 లో ఒక అవకాశం వచ్చింది. అది పూర్వాంవాటికంటే పెద్ద అవకాశం కూడా.

ఐర్లెండులోని కార్క్‌లో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి మొత్తం భారతదేశంనుంచి ఒకే ఒక చిత్రం అందులో "కీలుబొమ్మలు" అనే ఆంధ్ర చిత్రం - ప్రదర్శించబడినందువల్ల పూర్వంకంటె పెద్ద అవకాశం వచ్చిందని పేర్కొనదగ్గమైనది.

ఐర్లెండులో కూడా ప్రజలు, మధ్యతరగతి కుటుంబాలవారు, "కీలుబొమ్మలు" గుమ్మడి ఉమ్మడి కుటుంబం పడ్డ కష్టాలు ఒకప్పుడు అనుభవించినందువల్ల ఐరిష్‌వారు తమ జీవితమే తెరపై చూచినంత 'ఆనందం' పొందినట్లు కార్క్‌కు వెళ్ళివచ్చిన ఆంధ్ర ప్రతినిధివర్గం వారన్నారు.



గౌరీ ప్రొడక్షన్స్‌వారి "లోగుట్టు పెరుమాళ్ళకెరుక"లో రాజశ్రీ, శోభన్‌బాబు

'వెల్కమ్' అన్నాక కామా (,) 'వచ్చాం' అన్నాక ఫుల్‌స్టాప్ (.) పెట్టడంకాక వెళ్ళివచ్చిన ఫలితం స్థిరంగా వుండేటందుకు అంతో యింతో కృషి చెయ్యాలి.

ఈ సందర్భంలో రెండు ముఖ్య విషయాలు గమనార్హమైనవి.

భారతదేశంలో బెంగాలి చిత్రాలు, బహుశా హిందీ చిత్రాలు వున్నవనే అభిప్రాయం విదేశాలలో వుంది. ఇతర భాషల గురించి కాని, ప్రాంతాల గురించి కాని సినిమాకు సంబంధించినంత వరకు తెలియదు. అంచేత ప్రతి అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి బెంగాలి చిత్రాలతో పాటు, లేదా హిందీ చిత్రంతోపాటు ఓ దక్షిణభాషా చిత్రాన్ని 'సత్రకాయ'గానైనా పంపాలి.

ఏ విషయంలోనైనా విదేశాలపై ఆధారాన్ని తగ్గించుకొనడం శాస్త్రి ప్రభుత్వపు శాస్త్రీయనినాదమైనది. ఐరోపాలో చిన్న చిన్న దేశాలు సినిమా సామగ్రిని స్వంతంగా తయారుచేసుకొని పెద్ద పెద్ద దేశాలతో పోటీ చేస్తున్నవి.

లాల్‌బహదూర్ భాషను సినీరంగానికి కూడా వర్తిపచేసి మన సామగ్రిని మన ఫిల్మును మనమే శీఘ్రంగా తయారుచేసుకోడానికి ఎంత త్వరగా, ఎంత బాగా కృషి చేస్తే హైదరాబాద్‌వంటి ఆంధ్ర నగరాలలో అంత చప్పున అంత బాగా స్టుడియోలు పరికర సంపన్నమై వర్థిల్లుతవి. కార్క్ చెప్పిన 1965 పాఠం అదే.

అంజలీదేవి దశ, దిశ

సి. పుల్లయ్య పేరు ఒకటి పెట్టి పాత్ర పేరొకటి యిచ్చారు.

అంజని అసలు పేరయితే 'అంజలి' అని మార్చారు. "గొల్లభామ" లో వాళ్ళు ప్రతినాయకపాత్ర నిచ్చారు. ఆ భామకు ఆ 'తారాబ్రహ్మ' సినీ జీవితం అలా సృష్టించారు. కొత్త పేరు 'అంజలి' మహత్తు ఏమిటో కాని, ఆ పద అర్థంలో ధ్వనించే వినమ్రత, క్షమ, పవిత్రత, పూజ్య భావం, ప్రశాంతత అభినయించడంలో ఆమెకు ఆమే సాటి అని అనిపిస్తుంది.

ఆ పేరు మార్పు 1945 డిసెంబర్‌లో జరిగింది.

ఆ వూరు మార్పు — అనగా స్వస్థలం పెద్దాపురంనుంచి, నాటక రంగ స్వస్థానం కాకినాడ నుంచి సినీరంగంలో స్థిరనివాసానికై మద్రాసుకు మార్పు—1946 జనవరి 18 వ తేదీన జరిగింది.

ఈ సంచిక నెలకు, అంజలి 19 సినీ సంవత్సరాల మైలు రాళ్ళు దాటారు. అభినయ ప్రజ్ఞా విశేషానికి సంబంధించినంత వరకు, కొందరి లెక్కలో 19 కంటె ఎక్కువ "కిలోమీటర్ రాళ్ళు" వున్నా, మరికొందరి దృష్టిలో 19 కంటే తక్కువ గర్వకారక చిహ్నాలున్నా అందరూ అనేది గత రెండు మూడేళ్ళలో ఆమెనుంచి మంచి నటన రాలేదని.

"సతీ సక్కుబాయి"తో ఆ కొరతా తీరిపోయింది. ప్రభాత్, మధుర రాయల్ టాకీస్, మద్రాసు వాహిని కాలంనాటి విశిష్ట నటనాస్థాయిని ఆ భూమిక నిర్వహణలో అంజలి ప్రదర్శించారు. 1965 ఉత్తమ నటి త్రయంలో సమ పీఠాన్ని అంజలి అధిష్ఠించారు.

కాగా, 1965 కంటె 1966 అంజలికి మరింత ఆశాజనకంగా కన్పిస్తున్నది. ఆమె దశ, దిశ రెండు విధాలుగా మారినవి.

కుమారుని వివాహమే జరిపిన అంజలి 'రొమాంటిక్ లీడ్' వదలి 'మాతృభూమిక'ను అభినయ మాతృభూమి చేసుకొన్నారు.

ఇక దశ... ఇంతవరకు ఎల్. వి. ప్రసాద్ తప్పితే మేటి దర్శకుల చిత్రాలలో నటించని అంజలి 1966 లో బి. ఎన్. రెడ్డి "రంగులరాట్నం" లో నటించ నున్నారు. అందులో 'అమ్మగా అంజలే నటించాలి' అని బి. ఎన్. అన్నారు అంటే 'దశ' మారిందన్నమాటే.

యువ దర్శకులు ప్రత్యగాత్మ చిత్రంలో రంగారావుతో, రామినీడు "పోతన" లో గుమ్మడితో



రవీంద్ర ఆర్ట్ పిక్చర్స్ "జమీందార్"లో విజయలక్ష్మి

ఆమె చేసిన 'వందెవు నటన' 1966 సినీ అభినయానికే అందం.

వర్తమాన, భవిష్యత్తుల నుంచి గతానికి వెడితే... 'లోహితాస్యుడు' బాలుని వేషంతో అంజని బాలిక అభినయ జీవితం ఆరంభమైంది. పాటలు పద్యాలు నాటకాలూ వ్రాసి, సంగీతం కూడా కూర్చిన 'అబ్బాయి' — ఒకప్పుడు నాటకాలలో స్త్రీ వేషాలు వేసిన ఆదినారాయణరావు మార్గ దర్శకత్వం రెండవ దశ. ఆయన రచించిన "వీధి గాయకులు", "బ్లాక్ మార్కెట్" అనే నాటకాలలో నటించింది ఆమె.

నాట్యము, నటన అభ్యసిస్తున్న 'అంజని'కి అవ్పటి మద్రాసు గవ

ర్నర్ సర్ ఆర్థర్ హోప్ బహూకరించిన బంగారు పతకం ఆమెలో క్రొత్త 'హోప్'ను (ఆశను) చిగురింపజేసింది. 'యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్' శిక్షణపొందిన 'యంగ్ వుమన్' ఆంధ్ర నాటక కళా పరిషత్తు ఉత్తమ నటి బహుమతి కూడా పొందడంతో ఆ 'ఆశ' వికాసం కలిగి, వెండితెర వెలుగుతో జోడయినది. ఫలితం గొల్లభామలో నాట్యభామ వేషం. అప్పటికిని ఆమె 19 సంవత్సరాల చిన్నది.

నాట్య, ప్రతినాయిక భూమికలలోనే ఉంటున్న అంజలి 'బాలరాజు'లో అప్పటి నవ యువ హీరో నాగేశ్వరరావుతో సహ నటన ప్రారంభించి, "కీలుగుర్రం"తో సహ స్వారీ సాగించి, "పల్లెటూరిపిల్ల"లో నాగేశ్వరరావు, అప్పటికి క్రొంగ్రొత్త హీరో రామారావుల ప్రజ్ఞ మధ్య నలగక నిలచి "శ్రీ లక్ష్మమ్మ కథ"తో సాధ్వి నటనను చరితార్థం చేశారు. అతి తక్కువ కాలంలో "శ్రీ లక్ష్మమ్మ కథ" తీసినా అత్యుత్తమంగా ఆమె నటించడంతో తెలుగు తెరకు ఒక సమగ్ర నటి సమకూరింది.

తదాది ఆమె స్వంత బ్యానర్‌లోనేమి, పరాయి బ్యానర్‌లోనేమి ఎందరు నాయకులతోనో ఎన్ని తరహాల భూమికలనో నిర్వహించి వుండవచ్చు. అయినా అంజలి—నాగేశ్వరరావు జోడీకే అమిత ప్రజాదరణ లభించింది.

ఎనిమిదవ ఏటనే పరిచితుడైన అబ్బాయి, 15వ ఏట శ్రీవారై, 24వ ఏట ఆమె పేరిటే అంజలి పిక్చర్స్ స్థాపించారు. ఆ ఆదినారాయణరావు స్వరసంగీత నిర్మాణాలలో "సువర్ణసుందరి" "స్వర్ణమంజరి" వంటి ఉత్తమచిత్రాలు వచ్చినవి. సినిమాలలో సమగ్రాంధికం వాడే మల్లాది రామకృష్ణశాస్త్రి, ఛాయాగ్రహణంలో ఓ 'స్మాక్‌త్నెన్' చూపించే సి. నాగేశ్వరరావు వంటి వారు అంజలి సంస్థ బావుటాతో తమ ప్రజ్ఞా ధ్వజాన్నీ ఎగురవేశారు. అభినయానికి సంబంధించినంత వరకు "సక్కుబాయి" అంజలికి పునర్జన్మ వంటిది.

ఆ గొల్లభామనుంచి ఈ భక్తభామవరకు అంజలి త్రివిధ నాయిక (స్వీయ, పరకీయ, సామాన్య, నాయిక, భూమికలూ ధరించారు. అయితే వాటిలో, పతియందు మాత్రము అనురాగము గల స్వీయ నాయికగా, అంజలి ఘటింప జేసుకొన్నారు. నవరసాలలో నాలుగు స్వర శృంగార, హాస్య, కరుణ, శాంత —అర— బీభత్సములను) ప్రదర్శించారు: బాగా పోషించారు. 'వదినగారి గాజులు', 'కులదైవం', 'ఇలవేల్పు' వంటి చిత్రాలలో ఆమె నటన అంజలి నామమును సార్థకం చేసినది. శ్రీ లక్ష్మమ్మకథ, లవకుశ, సతీసక్కుబాయి వంటి చిత్రాలలో 'శాంత'ముతో ప్రేక్షకుల కరుణను లాగివేసుకొన్నారు.



మోడరన్ థియేటర్స్ వారి "మొనగాళ్ళకు మొనగాడు"తో మొదటిసారిగా దర్శకుడుగా పరిచయం కానున్న ఎస్. డి. లాల్. అపరాధ పరిశోధనపై ఆధారపడిన ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కానున్నది.

అనార్కలి, పక్కింటి అమ్మాయి, రేచుక్క (జయసింహ కూడా), అన్నదాత, నిర్దోషివంటి చిత్రాలలో భిన్నతరహా భూమికలకన్నా నిండు ప్రజ్ఞతో నిర్వహించ గలిగారు.

చిన్న నోరు, లేత వదనం, లేడి కళ్ళు, పరిమిత రూపం- ఇవి అంజలి సంపద. చిన్న నోటితో ఏ రీతి సంభాషణనైనా స్పష్టంగానే కాక భావసమన్వితంగా పలకగలిగారు. లేత వదనం కాబట్టే 'సక్కుబాయి'లో ఇంతలో అసలు భక్తురాలుగా అంతలో దొంగ భక్తురాలుగా (కృష్ణుడు సక్కుబాయి అయినప్పుడు) స్పష్టమైన హావభావాలను ప్రదర్శించగలిగారు. లేడి కళ్ళే అయినా బెదిరేవికావు. అమాయకత, అగ్నివర్షమూ, వగలూ, వయ్యారమూ కురిపించగలయాంత్రిక నేత్రాలవి. పరిమిత రూపం కాబట్టి ఎంతటి ఆకారం కల నటుని ముందయినా లాభసాటిగా నిలవ కలుగుతున్నారు. ఆ ఆకారం నాగేశ్వరరావుతో 'రొమాంటిక్ లీడ్'కు పనికి వచ్చింది. రామారావు ప్రక్కన జాలికి బాగా ఉపయుక్తమైనది. రేపు హిరణ్యకశిపుడు (భయంకర) రంగారావు ముందు, ఈ స్వల్పాకారి నిలబడితేనే ప్రేక్షకుల హృదయం నీరవుతుంది. అణిగి మణిగిన ఆ చిన్న రూపమే బి. ఎన్. "రంగులరాట్నం"లో మాతృశక్తి విశ్వరూపం చూపుతుంది.

ఎంతటి తారలయినా వయసుకు తలవంచక తప్పదు. వయసుకు తగిన భూమికను నిర్వహించి తల ఎత్తే వుండగల తారలూ ఉన్నారు. అటువంటి వారి విశిష్టనటనకు అంజలి ఘటించే కళాభిమానులకు కొరవ వుండదు. కొత్తదశలో కొత్త దిశకు పోతున్న అంజలికి ఆ స్థానం స్వస్థానం, కళా సంస్థానం కావాలి.

చలన చిత్ర వార్తలు

పోతన పూజామందిరం

భారత్ ఫిలిమ్సువారి "భక్త పోతన"లో వీనస్ స్టుడియోలో పోతన పూజామందిరం సెట్టుపై డిసెంబర్ రెండవ వారంలో షూటింగ్ జరిగింది. పి. లీల పాడిన ఒక పాటను ధర్మాంబ (అంజలి)పై చిత్రీకరించారు. ఇంకా గుమ్మడి, బేబి రోహిణిలకు ఈ సెట్‌లో పని కలదు. పోతన (గుమ్మడి) సెట్ ఇంటీరియర్‌లో డిసెంబర్‌లో షూటింగ్ జరిగింది. ఈ వాక్య నెలలో అను రీళ్ళ అన్ఎడిటెడ్ ఫిల్ము తీయాలని నిర్మాతలు సంకల్పించారు శ్రీనాధుడుగా ఎస్. వి. రంగారావు నటిస్తున్నారు. రచన: సముద్రాల రాఘవాచార్య, దర్శకత్వం: రామినీడు, సంగీతం: రాజేశ్వరరావు, పాటలు: నారాయణ రెడ్డి, సముద్రాల, కెమెరా: సి. నాగేశ్వరరావు

"జమీందార్" లో వేషంపై నాగేశ్వరరావు

రవీంద్ర ఆర్ట్ పిక్చర్సు వారి "జమీందార్" విడుదలకు సిద్ధంగా వున్నది. ఇందులో తన పాత్రపై అక్కినేని నాగేశ్వరరావు వ్యాఖ్యానిస్తూ "హీరోగారు మామూలుగానే ఆడుతూ పాడుతూ వీరోచితంగా వ్యవహరిస్తూ వుంటారు కాని చిత్రం మధ్యలో ఒక ఆకస్మికమైన మలుపు



ఐటెక్స్

సౌందర్యానికి సహాయకారులు

* ఐటెక్స్ కాటుక
పసిపిల్లలకు కూడా చాలా మంచిది

* ఐటెక్స్ బిందీ
కంటికింపైన రంగులలో లభించును.

* ఐటెక్స్ కుంకుం పేస్టు



అరవింద్ లేబొరేటరీస్,
పి. బి. 1415 — మద్రాసు—17.



మోడరన్ థియేటర్స్‌వారి "మొనగాళ్ళకు మొనగాడు" చిత్రంలో కృష్ణకుమారి

తిరుగుతారు. ఇక చిట్టచివరకు వచ్చేసరికి అందరికి దిగ్భ్రాంతి కలిగించే ఓ పని మెరుపులా చేసి కొత్త వీరుడు అని అనిపించుకొంటారు" అని అన్నారు. కృష్ణకుమారి నాయిక, గుమ్మడి, రేలంగి, లింగమూర్తి, సూర్యకాంతం, ఎల్. విజయలక్ష్మి, తారాగణంలో కలరు. రచన; ముళ్ళపూడి. ఎడిటర్; సంజీవి, సంగీతం: చలపతిరావు, దర్శకుడు; మధుసూదనరావు,

"రహస్యం" పోరాట ఘట్టాలలో నాగేశ్వరరావు

లలిత శివజ్యోతివారి "రహస్యం" ఈస్ట్‌మన్‌కలర్ చిత్రంలో డిసెంబర్ రెండవ తేదీనుంచి ఐదురోజుల పాటు ఔట్‌డోర్, ఇన్‌డోర్ షెడ్యూల్స్ జరిగినవి. రెండురోజుల పాటు ఔట్‌డోర్‌లో జరిగిన పోరాట ఘట్టాలలో నాగేశ్వరరావు, లింగమూర్తి, లంకసత్యం ప్రభృతులు పాల్గొన్నారు. మదరన్

మూవిటోన్ స్టుడియోలో జరిగిన సెట్ షూటింగ్‌లో నాగేశ్వరరావు, కృష్ణకుమారి, సూర్యకాంతం పాల్గొన్నారు. దాదాపు ఒకటిన్నర రీళ్ళు ఈ షెడ్యూలులో తయారైనవి. దర్శకుడు వేదాంతం రాఘవయ్య. నిర్మాత శంకరరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ సినిమాటోగ్రఫీ — పి. ఎల్. రాయ్, ఆపరేటివ్ కెమెరామన్ — కె. ఎస్. రామకృష్ణారావు, రచన సదాశివబ్రహ్మం.

"ఆత్మగౌరవం"

అన్నపూర్ణావారి "ఆత్మగౌరవం" లో రామప్ప దేవాలయం వద్ద కొన్ని ఘట్టాలు నాగేశ్వరరావు, కాంచనలపై చిత్రీకరించారు. సారథీ స్టుడియోన్‌లో పతాక సన్నివేశం తీశారు.

అనేక రంగాలలో క్రొత్త రుచులివ్వనున్న అన్నపూర్ణావారి "ఆత్మగౌరవం" జనవరిలో విడుదల కాబోతున్నది. దర్శకుడుగా కె. విశ్వనాధ్ సంభాషణల రచయితగా భమిడిపాటి రాధాకృష్ణ, బాల నటి గోపి, శ్యామల (7 సంవత్సరాల బాలిక) ఒక శాస్త్రీయనృత్యం దర్శకురాలిగా శ్రీమతి సుమతీకౌశల్ పరిచయమౌతున్న "ఆత్మగౌరవం" అన్నపూర్ణా సంస్థకు మిక్కిలి గౌరవప్రదమైనది. చిత్రం యూనిట్ వివరమిది: దుక్కిపాటి మధుసూదనరావు, సెల్వరాజ్ జి, వి. సుబ్బారావు, ఎస్. రాజేశ్వర

సంక్రాంతి శుభాకాంక్షలతో

పంకజ్ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్ వర్క్స్

హైదరాబాద్



శ్రీదేవి ప్రొడక్షన్స్‌వారి "పరమానందయ్య శిష్యులు కథ"లో ఎన్. టి. రామారావు, ఎల్. విజయలక్ష్మి

రావు, ఆరుద్ర, దాశరధి, నారాయణరెడ్డి. కొసరాజు, అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య, గుమ్మడి, రేలంగి, చలం, రమణారెడ్డి, అల్లు రామలింగయ్య, రాజశ్రీ, కాంచన, సూర్యకాంతం, వాసంతి.

జనవరి 15న "శ్రీ కృష్ణ పాండవీయం"

ఎన్. ఏ. టి, రామకృష్ణ, కంబైన్స్‌వారి "శ్రీకృష్ణపాండవీయం" జనవరి 15న విడుదల కాగలదు. ఇంత పెద్దయెత్తున, ఇంత వ్యయప్రయాసలతో ఈమధ్య ఏ చిత్రమూ రాలేదని అంటున్నారు. టి. వి. ఎస్. శర్మ కళాదర్శకత్వంపై విశేష ప్రశంసలు వినవస్తున్నవి. శ్రీకృష్ణ దుర్యోధన పాత్రలను నిర్వహించడమేకాక దర్శకత్వం కూడా వహించిన రామారావుకు ఘన విజయం కాగలదంటున్న ఈ చిత్రంలో హిట్ సభ్యులు: ఎస్. త్రివిక్రమరావు, సముద్రాల రాఘవాచార్య, టి. వి. రాజు, వెంపటి సత్యం, కె. ఆర్. విజయ, గీతాంజలి, ఎస్. వరలక్ష్మి, రత్న, కాంతారావు, శోభన్‌బాబు, బాలయ్య, రాజనాల, ముక్కామల, ధూళిపాళ, సత్యనారాయణ, ఉదయకుమార్, మిక్కిలినేని, కె. వి. ఎస్. శర్మ, ప్రభాకరరెడ్డి, మల్లాది.

రామారావు రక్షణనిధి సేకరణ

జాతీయ రక్షణనిధికి ఉడుతాభక్తి కానుక సమర్పించే లక్ష్యంతో ప్రసిద్ధ నటుడు ఎన్. టి. రామారావు 16, 17 రోజులు (నవంబర్ 25 నుంచి డిసెంబరు 11) సపరివారంగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. ప్రముఖ వర్లు క్లీర్లునుంచి మేటి తారల వరకు దాదాపు 150 మంది ఈ బృందంలో వున్నారు. కార్లు, వ్యానులలో ప్రయాణం సాగించారు. మద్రాస్‌నుంచి హైదరాబాద్‌వరకు సాగిన ఈ యాత్రలో తొమ్మిది కళా ప్రదర్శన మజిలీలున్నాయి. ఆ తొమ్మిది నగరాలలోను నృత్య, నాటిక, సంగీత ప్రదర్శనలిచ్చారు. దేశభక్తిని ప్రబోధించే నాటకం నుంచి రాక్ ఎన్ రోల్ ట్విస్ట్ నృత్య వినోదాలవరకు ఆ కార్యక్రమం వుంది. మన ఊళ్ళలో పాలేర్లు, కూలీలు సయితం 25 రూపాయల టిక్కెట్టు కొని ఆ ప్రదర్శనలు చూచారు. పెద్ద పెద్ద ప్రభుత్వాధికారుల మొదలు పోలీస్ కానిస్టేబుల్‌వరకు ఎందరో రామారావు బృందానికి అండగా నిలచారు. తొమ్మిది నగరాలలో కళా ప్రదర్శనలివ్వడమేకాక వీధులలో యాచించి మధ్య మధ్య వచ్చిన పట్టణాలలో కూడా అనుకోకుండా నిధి సేకరణ జరిపారు. ఒంగోలు వంటి పట్టణానికి అటువంటి ఛాన్సు దొరికింది. రెండు మూడు కేంద్రాలలో స్త్రీలు తమ మంగళ సూత్రములను వొలిచి రామారావుకు యిచ్చారు.

ప్రదర్శనద్వారా, యాచన ద్వారా వచ్చిన ఎనిమిది లక్షల రూపాయలను చెక్కు రూపేణా ప్రధాని శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రికి డిసెంబర్ 11 వ తేదీ రాత్రి హైదరాబాద్‌లో అందజేశారు. శాస్త్రి, బ్రహ్మానందరెడ్డి రామారావును అభినందించారు. అదీకాక బంగారు ఆభరణాల దండను ప్రధానికిచ్చారు. నాలుగు గోనె సంచుల నాణెములు కూడా అందజేశారు.

మద్రాసునుంచి బయలుదేరే ముందేమి, హైదరాబాద్ చేరిన మీదటేమి శ్రీ రామారావు ఒక్క విషయం స్పష్టపరిచారు. డబ్బు సేకరించి యివ్వడం తమ ప్రధాన లక్ష్యం కాదని, అభినయ కళను సినిమాకే కాక దేశానికి కూడా ఎలా వినియోగించవచ్చు అన్న విషయాన్ని నిరూపించడం, ఆ కళ ద్వారా ప్రజలలో దేశభక్తి ఇనుమడింప జేయడం తమ ముఖ్య లక్ష్యమని అన్నారు.

10 వ తేదీన హైదరాబాద్‌లో విలేఖరులతో ముచ్చటిస్తూ రాజధానిలో స్టుడియో తదితర వసతులు పుష్కలంగా లేకపోవడంవల్ల మద్రాసు నుంచి ఆంధ్రతారలు టెక్నిషియనులు తరలి రావడానికి జడుస్తున్నారన్నారు.

రామారావు సమక్షంలో డి. వి. ఎస్. ప్రొడక్షన్స్ నిర్మాత శ్రీ డి. వి. ఎస్. రాజు పత్రికా ప్రతినిధులతో ముచ్చటిస్తూ దక్షిణ భారత ఫిలిం నిర్మాతల గిల్డు తరపున ప్రభుత్వానికి ఒక మెమొరాండం అందజేశామన్నారు. ఆంధ్ర ప్రభుత్వం వారు రాజధానిలో పది పన్నెండు ఫ్లోర్‌లు, సమస్తమైన యంత్ర సామగ్రి కూర్చి, స్టుడియోను స్వంతంగా ప్రభుత్వమే నిర్వహిస్తే రాజధానిలో ఫిలిం నిర్మాణం అతి శీఘ్రంగా సాగగలదని మెమొరాండంలో తెలియజేశామన్నారు ప్రభుత్వమే కట్టిఇస్తే గిల్డువారు నిర్వహించ సిద్ధమే నన్నారు.

ఆర్థికమంత్రి చెన్నారెడ్డి, ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, 'ఇదేమీ సాగే పథకం కా'దని చెప్పివేశారు.

రక్షణనిధికి రామారావు బృందమూ, ప్రజలూ కార్యకర్తలు చేసిన కృషిని ముఖ్యమంత్రి మొదలు అధికారుల వరకు అందరూ కీర్తించారు.

రామారావు పరివారంలో రంగారావు, కాంతారావు, రాజనాల, దేవిక, రాజసులోచన, గీతాంజలి, ఘంటసాల వెంకటేశ్వరరావు, లక్ష్మిరాజ్యం. ధూళిపాళ, రామకృష్ణ, ముక్కామల, పేకేటి, సి. ఎస్. రావు మొదలైనవారు కలరు.



శ్రీ పి. పుల్లయ్య దర్శకత్వాన నిర్మించిన డిఫెన్స్ డాక్యుమెంటరీ చిత్రం 'వీరకంకణం' లో శ్రీ ఎస్. వి. రంగారావు

• • •

"ప్రేమలో ప్రమాదం"

సిటడల్ ఫిలిం కార్పొరేషన్. తారాగణం: రాజశ్రీ, రామకృష్ణ, గీతాంజలి; వి. వి. రాధ: సంభాషణలు: ముద్దుకృష్ణ, కెమెరా: లూకాస్, దర్శకత్వం: జోసఫ్ తలియత్, స్టుడియో: సిటడల్.

• • •

"పాండవవనవాసం" బెంగాలీలో డబ్ చెయ్యబడి డిసెంబర్ 12న కలకత్తాలో సెన్సార్ అయింది.

ఫిలిం పరిశ్రమ అభివృద్ధి: నాగేశ్వరరావు కార్యక్రమం

హైద్రాబాద్‌లో ఫిలిం పరిశ్రమ మరింత శీఘ్రంగా అభివృద్ధిచెందడం కోసం పది చిత్రాలలో నటించేందుకు తన అంగీకారం తెల్పివున్నానని శ్రీ అక్కినేని నాగేశ్వరరావు ఒక గోష్ఠిలో పేర్కొన్నారు.

వచ్చే సంవత్సరం ఆరంభంలో సారథీ స్టుడియోస్‌కు వారి రెండు ఫ్లోర్‌లు, మరొక యూనిట్ అమరగలవని, మరి కొలది నెలలకు సరదరన్ మూవిటోన్ స్టుడియోస్‌లో అదనపు సదుపాయాలు సమకూరగలవని, మార్చి మాసారంభంలో ప్రసాద్ స్టుడియోస్ సిద్ధం కావచ్చునని, ఈగా కమల్ అమ్రోహి ఒక స్టుడియో నెలకొల్పే అవకాశం వున్నదని, ఇవన్నీ పనిచెయ్యడం ప్రారంభించగానే భాగ్యనగర్‌లో ఏడాదికి 22 చలన చిత్రాలు నిర్మించ వీలవుతుందని శ్రీ నాగేశ్వరరావు అన్నారు.

తాను ఎక్కువ చిత్రాలలో నటించడంవల్ల, ఎక్కువమంది నిర్మాతలు వచ్చి, మరి రెండేళ్ళకు తనవంటి ఒక్కరిపై ఫిలిం పరిశ్రమ ఆధారపడే స్థితి పోతుందన్నారు.

"క్షేత్రయ్య సినిమా తీస్తే ఎలా వుంటుంది? అని ప్రశ్నించగా చిత్తశుద్ధితో పవిత్ర భావాలతో తెరకెక్కించవలసిన కథలలో అది ఒకటని శ్రీ నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు.

• • •

"ఆంధ్ర మహావిష్ణు కథ"

శ్రీ శంభు ఫిలిమ్సు వారి "శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు కథ"లో యింకా రెండు మూడు పెద్ద సెట్లపై పని జరుగవలసి వున్నది. ఉగాదికి విడుదల కాగల ఈ చిత్రంలో నాగాంధ్రుడు నిశంభుడుగా ఎస్. వి. రంగారావు. అతని క్రౌర్యములను ఎదుర్కొని ఆంధ్ర ఉప నాయకులను ఏకంచేసి మహావిష్ణువుగా చరితార్థుడైన వల్లభదేవునిగా ఎన్. టి. రామారావు, ఆ విష్ణువుకు 'లక్ష్మి'గా జమున నటిస్తున్నారు. సంభాషణలు, పాటలు పింగళి నాగేంద్రరావు సమకూర్చారు. దర్శకుడు: శేఖర్; నిర్మాత: దగ్గుబాటి లక్ష్మినారాయణ చౌదరి.

Edited and Published by V. V. Raghavaiah
and Printed by him at Jyothi Press,
Congress Office Road, Governorpet, Vijayawada-2.

JYOTI JAN'66 Regd No. H 368

రవీంద్రా ఆర్ట్ పిక్చర్స్

దర్శకుడు వి. మధుసూదనరావు

నిర్మాత తమ్మారెడ్డి కృష్ణమూర్తి

వాణీ రిలీజ్

